
శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



క్షీణిస్తున్న భారత్ – బంగ్లా సంబంధాలు

చైనా సరిహద్దుల్లో ఆగిన ట్రంప్ సుంకాల బెదిరింపు

ట్రంప్ రియల్ ఎస్టేట్ ప్లాన్‌కు జోర్డాన్ తిరస్కృతి

లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 235 | గురువారం | 13-02-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## ప్రజాసమస్యలపై రాజీపడబోం

**కాంగ్రెస్‌తో కలిసి వెళ్తున్నా పోరాటం.. పోరాటమే...**



- ఆర్‌టిసి కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలి
- స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ వైఖరిని బట్టి పొత్తులు
- బిజెపి మినహా కలిసివచ్చే పార్టీలతోనూ పొత్తు ఆలోచన చేస్తాం
- ప్రజాప్రతినిధుల పట్ల అధికారులు, మంత్రుల తీరు బాగాలేదు
- హిందువుల అభ్యున్నతికి ఏం చేసిందో బిజెపి చెప్పాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి సిపిఐ ముందుకు సాగుతున్నప్పటికీ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా ఆర్‌టిసి కార్మికుల సమ్మెను నివారించాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్‌టిసి సంస్థ నిర్వహించాలని, ఈ విషయంలో రాజీపడేదిలేదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం మీడియాతో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరిపై సిపిఐ పొత్తు ఆధారపడి ఉంటుందని కూనంనేని వెల్లడించారు. కాంగ్రెస్ కలిసి వస్తే ఆ పార్టీతో ముందుకు సాగుతామని, లేకపోతే సిపిఐకి బలం ఉన్న చోట్ల ఒంటరిగా పోటీ చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. ఇదే సమయంలో బిజెపి మినహా కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకునే ఆలోచన సైతం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి కరీంనగర్ పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానంలో కాంగ్రెస్‌పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించామని సాంబశివరావు వెల్లడించారు. మిగిలిన టీచర్స్ ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించి ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం నాయకులు చర్చలు జరుపుతున్నారని, చర్చల అనంతరం తరువాయి 2లో

## కులగణనలో పాల్గొనని వారికి మరో అవకాశం

- 16 నుంచి 28వ తేదీ వరకు సర్వే
- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై మార్చిలో అసెంబ్లీలో బిల్లు
- కేంద్రానికి పంపి పార్లమెంటులో ఆమోదానికి కృషి
- డిప్యూటీ సిఎం భట్టి వెల్లడి

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే 12

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో సారి కుల గణన సర్వే నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే విషయంలో మార్చిలో కేబినెట్‌లో తీర్మానం చేసి, సంబంధిత బిల్లుకు శాసనసభలో ఆమోదంతో చట్టబద్ధం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సచివాలయంలో బుధవారం బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ కులగణన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపి, ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదానికి కృషి చేస్తామని చెప్పారు.



ఓబిసిలకు రిజర్వేషన్‌ల కోసం వివిధ పార్టీల నాయకుల అభిప్రాయాలను తీసుకొని, రిజర్వేషన్‌లపై కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని పోతామని తెలిపారు. ఇక కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ సర్వేలో వివరాలు తరువాయి 2లో

## ఉచితాల కంటే.. ప్రధాన స్రవంతిలోకి తీసుకురండి



- దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయండి
- ప్రజలకు ఉచితాలు అందజేయడం కంటే అదే మంచిది
- పనిచేయకుండానే రేషన్, నగదు పొందుతున్నారు
- కష్టపడాలన్న ఆలోచనే కలగడం లేదు
- ఉచిత హామీలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- పరాన్న జీవులను సృష్టిస్తున్నామా? అని ప్రశ్న

**న్యూఢిల్లీ :** ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచితాలపై చేసే హామీలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉచితాలను ప్రటించడం ద్వారా మనం పరాన్న జీవులనే వర్గాన్ని సృష్టిస్తున్నామా? అన్న సందేహం వ్యక్తం చేసింది. ప్రజలకు ఉచితాలు అందజేసేకంటే వారిని ప్రధాన ప్రజా స్రవంతిలోకి తీసుకువచ్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయడం మంచిదని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాషిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికలకు ముందు ప్రకటించే 'లాడ్ కీ బహిన్' తదితర పథకాల వల్ల ప్రజలు కష్టపడేందుకు ఇష్టపడడం లేదని జస్టిస్ గవాయ్ అభిప్రాయం వ్యక్తంచేశారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు లేని వారికి ఆశ్రయం కల్పించే హక్కును అమలు చేసేలా ఆదేశించాలని దాఖలైన వినతిని పరిశీలిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం పైవిధంగా స్పందించింది. ప్రజలు పనిచేయకుండానే రేషన్, నగదు పొందుతున్నారని, దీంతో వారికి కష్టపడాలనే ఆలోచన కలుగడం లేదని అభిప్రాయపడింది. పేద ప్రజల ఆదుకోవాలనే ప్రభుత్వాలకు ఉండే ఆలోచనను అర్థం చేసుకోగలమని, అదే సమయంలో వారిని ప్రధాన తరువాయి 2లో



03

### రాముడిపేరుతో దౌర్జన్యాలు సహించం

- చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌కు సిపిఐ నేతల పరామర్శ



03

### ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- 15న రాష్ట్రవ్యాప్తంగా నిరసన
- ఆటో డ్రైవర్స్ యూనియన్ జెఎసి హెచ్చరిక



03

### పండగలా వర్గీకరణ విజయోత్సవాలు

- ఎమ్మెల్యేలకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచన



05

### రైతు సంఘాలు ఏకం

## రేషన్‌కార్డులపై భారీ ఆశలు

- అదిగో... ఇదిగో... అంటూ ఊరిస్తున్న ప్రభుత్వం
- కొత్తదరఖాస్తులు, పేర్లల్లో మార్పులు చేర్పుల కోసం మీసేవ వద్దకు బారులుదీరుతున్న ప్రజలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రేషన్‌కార్డు అనేది పేదవాడికి అందని ద్రాక్షగా మారింది. కొత్త రేషన్ కార్డులు ఇదిగో.. అదిగో.. అంటూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ళ పాటు ప్రజలకు ఆశ పెట్టి చివరికి ఇవ్వకుండానే అధికారం కోల్పోయింది. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు గడుస్తున్నా ఇంకా దరఖాస్తుల ప్రక్రియ మాత్రమే కొనసాగిస్తుండడంతో నిరుపేదలు ఉసూరుమంటున్నారు. అధికారం చేపట్టిన నెల రోజుల్లో 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి6 వ తేదీ వరకు ప్రజాపాలన అభయ హస్తం పేరుతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగా రేషన్ కార్డుల మంజూరు కోసం 19 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. అదేవిధంగా ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాలలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సైతం వేల సంఖ్యలో దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాపాలనలో భాగంగా అందిన దరఖాస్తులకు సంబంధించి గత ఏడాది కాలంగా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో దరఖాస్తుదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇదే క్రమంలో జనవరి 26వ తేదీ తరువాయి 12లో

## నోటా ఉండాల్సిందే



- స్థానిక సంస్థల్లో అమలుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదన
- సిపిఐ, బిఆర్‌ఎస్, సమర్థన
- వ్యతిరేకించిన కాంగ్రెస్
- ఇప్పుడే చెప్పలేమన్న బిజెపి
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఎన్నికల కమిషన్ సమావేశం
- నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నికలు పెట్టాలి : తక్కళ్లపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థ ఎన్నికలలో నోటా అమలు చేయాలనే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనను కాంగ్రెస్ వ్యతిరేకించింది. సిపిఐ, బిఆర్‌ఎస్ సమర్థించగా సుప్రీం కోర్ట్‌లో కేసు ఉన్నందున తాము ఇప్పుడే అభిప్రాయం చెప్పలేమని బిజెపి తెలిపింది. ఎన్నికల్లో ఒక్కరు నామినేషన్ దాఖలు చేస్తే ఏకగ్రీవంగా చేయకుండా నోటాతో ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదనను కాంగ్రెస్ వ్యతిరేకించగా, సిపిఐ, బిఆర్‌ఎస్ సమర్థించాయి. స్థానిక సంస్థలలో 'నోటా' అమలు విషయమై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో తరువాయి 2లో

## 10.13 లక్షల మందికి రూ.1269.32కోట్లు

మూడెకరాల వరకు రైతు భరోసా పంపిణీ

ప్రజాపక్షం /హైదరాబాద్




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సహాయం కింద బుధవారం మరో రూ.1269.32 కోట్లు నిధులను రైతుల ఖాతాలో జమా చేసింది. ఇప్పటికే రెండెకరాల లోపు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు బదిలీ పూర్తి చేసిన ప్రభుత్వం తాజాగా మూడెకరాల లోపు భూమి కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. ఇందులో భాగంగా మూడవ విడతలో 10.13 లక్షల మంది రైతులకు సంబంధించిన 21.12 లక్షల ఎకరాలకు రూ.1269.32 కోట్లు నిధులను జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే 2 ఎకరాల వరకు ఉన్న భూములకు సంబంధించి ఈనెల 10వ తేదీన తరువాయి 2లో

## భారత్–ఫ్రాన్స్ బంధం మరింత బలోపేతం

- ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సహకార విస్తృతి
- పెట్టుబడి,వాణిజ్య సంబంధాలు ఇక పటిష్టం
- మోదీ–మేక్రాన్ అంగీకారం
- అంతర్జాతీయ వేదికలపై సన్నిహిత సమన్వయం
- భద్రతామండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి మేక్రాన్ మద్దతు



**పారిస్ :** అత్యంత విస్తారమైన ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సహకారాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు భారత్–ఫ్రాన్స్ దేశాలు అంగీకరించాయి. ఫ్రాన్స్‌లో రెండురోజులు పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారంనాడు ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో అధికారిక సమావేశం జరిపారు. పారిస్ నుండి మార్సియల్లీకి మేక్రాన్ విమానంలోనే మోదీ ప్రయాణించేసి వెళ్ళారు. విమానంలోనే వారిమధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగినట్లు భారత విదేశాంగ కార్యదర్శి తరువాయి 12లో

## అమెరికా చేరుకున్న మోదీ

### అణుశక్తిపై ట్రంప్‌తో చర్చ

ఫ్రాన్స్‌లో రెండు రోజుల పర్యటన అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారంనాడు అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్ళారు. అమెరికాలో నిర్ణీత ప్రకారం ఆయన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశం జరుపుతారు. అమెరికా 47వ అధ్యక్షుడుగా ట్రంప్ పదవీ స్వీకారం చేసిన తర్వాత ఆయనను వైట్‌హౌస్‌లో కలిసిన నాలుగో విదేశీ ప్రభుత్వాధినేత మోదీ. ట్రంప్ మొదట ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూతో సమావేశమయ్యారు. ఆ తర్వాత జపాన్ ప్రధానమంత్రి షిగెరూ ఇషిదా, జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 తో సమావేశం జరిపారు. నాలుగో నాయకుడు మోదీతో ఆయన సమావేశం కానున్నారు. వారిద్దరిమధ్య అణుశక్తికి సంబంధించిన అంశమే ప్రధాన చర్చగా ఉంటుందని భావిస్తున్నారు. 2047వ సంవత్సరం నాటికి 100 గిగావాట్ల శక్తిసామర్థ్యంగల అణు శక్తిని ఉత్పత్తి చేయాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకుంది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల అభివృద్ధి నిమిత్తం పరిశోధనలకు మద్దతుగా రూ.20,000 కోట్ల బడ్జెట్‌తో ఒక అణు ఇంధన పథకాన్ని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలారంభంలోనే ఒక ప్రణాళికను ప్రకటించింది.

## 14న పిసిసి చీఫ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

- కులగణన, ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై మరింత అవగాహన
- కాంగ్రెస్ శ్రేణులకు మరింత సమాచారం ఇవ్వాలని టిపిసిసి నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన, ఎస్‌సి ఉప కులాల వర్గీకరణపై కాంగ్రెస్ నాయకులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు గాంధీభవన్‌లో పవర్ పాయింట్ తరువాయి 12లో



## టి ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్

- డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి 93 లక్షల గృహాలు
- ప్రపంచబ్యాంక్ అధికారులకు వివరించిన ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

టి ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రారంభించినట్లు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలోని 93 లక్షల గృహాలను తరువాయి 2లో

# బంగ్లాదేశ్‌లో జులై హింస వెనుక హసీనా హస్తం

**45 రోజుల్లో 1,400 మంది హతం**
**ఐక్యరాజ్యసమితి హక్కులసంఘం అంచనా**



**ఢాకా :** బంగ్లాదేశ్‌లో గత ఏడాది జులైలో జరిగిన విద్యార్థుల నాయకత్వాన దేశవ్యాప్తంగా జాబ్ రిజర్వేషన్లపై చెలరేగిన నిరసన ప్రదర్శకులను హింసాత్మకంగా అణచివేసిన ఘటనల వెనుక షేక్ హసీనా ప్రభుత్వం ఉండే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం అభిప్రాయం వ్యక్తం చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా ఆమె నేరాలకు పాల్పడ్డారని పేర్కొంది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఒక నివేదికను బుధవారంనాడు విడుదల చేసింది. ఒక పద్ధతి ప్రకారం ఈ హింసాత్మక అణచివేత జరిగిందని అంచనావేసింది. ఈ ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చడంతో చివరకు గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన హసీనా ప్రభుత్వం పతనమైంది. నాటి ప్రధానమంత్రి షేక్ హసీనా తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడానికే ఈ హింసకు పాల్పడి ఉండవచ్చునని సంఘం సందేహించింది. 45 రోజుల వ్యవధిలో 1,400 మంది హింసాత్మక అణచివేతలో మరణించారని, వేలాదిమంది గాయపడ్డారని నివేదిక అంచనా వేసింది. భద్రతాబలగాల కాల్పుల్లోనే ఎక్కువమంది మరణించారనీ, వీరిలో 15 మంది వరకూ చిన్న పిల్లలు కూడా ఉంటారని నివేదిక పేర్కొంది. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఒక పథకం ప్రకారం హింసాత్మక అణచివేత వ్యూహాన్ని అమలు చేసి ఉంటారని నివేదిక విడుదల సందర్భంగా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం అధిపతి ఓల్కర్ టర్క్ స్పష్టం చేశారు. మహిళలపై అత్యాచారం చేస్తామని బెదిరింపులు చేశారని, ఇష్టానుసారంగా అరెస్టులు చేశారని పేర్కొన్నారు. మొత్తం 230 ఇంటర్వ్యూలు చేసిన తర్వాత ఈ నివేదిక ద్వారా ఈ నిర్ధారణకు వచ్చినట్లు ఆయన చెప్పారు.మానవత్వానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లోని గత ప్రభుత్వం నేరాలకు పాల్పడి ఉండవచ్చునని సందేహించారు. ఫోరెన్సిక్ నిపుణులు, ఆయుధ నిపుణులు, దర్యాప్తు అధికారులను పంపించాలని యూనుస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఒక నిజ నిర్ధారణ కమిటీ ద్వారా దర్యాప్తు జరిపి ఇచ్చిన ఈ నివేదికను బంగ్లాదేశ్ తాత్కాలిక అధిపతి మహ్మద్ యూనుస్ స్వాగతించారు. బంగ్లాదేశ్ ప్రజలు ఎంతో గౌరవ మర్యాదలు,హుందాతో భద్రత మధ్య జీవించేవిధంగా దేశాన్ని తీర్చిదిద్దాలన్నదే తన ఆశయమని ఆయన ఈ సందర్భంగా అన్నారు. హత్యలతోపాటు జైలులో నిర్బంధించడం, ఇతరవిధాలుగా శారీకంగా హింసించడం, అమానవీయ చర్యలకు పాల్పడటం వంటి ఘటనలు ఎక్కువగా జరగడానికి అవకాశాలున్నాయని నమ్మల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని మానవ హక్కుల సంఘం తన నివేదికలో పేర్కొంది. పదవిలో ఉన్న నాటి ప్రధానమంత్రి షేక్ హసీనాపార్టీ అవామీలీగ్‌తోపాటుగా బంగ్లాదేశ్ భద్రతా బలగాలు, ఇంటిలిజెన్స్ సర్వీసెస్ కూడా ఈ మానవత్వ వ్యతిరేక హింస, అణచివేతలో పాల్గొని ఉండేందుకు అవకాశాలున్నాయని పేర్కొంది. గత ఏడాది ఆగస్టులో ప్రధానమంత్రి కార్యాలయంలోకి ఉద్యమకారులు దూసుకురావడానికి ముందుగానే హసీనా విమానంలో భారత్‌కు వచ్చి ఒక గుర్తుతెలియని ప్రదేశంలో అప్పటినుండీ అజ్ఞాతంలో నివసిస్తున్నారు. ఆమెను అరెస్టు చేసేందుకు ఇప్పటికి రెండుసార్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం వారెంట్లు జారీ చేసింది. ఆమెను తమ దేశానికి అప్పగించాలని కూడా బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌ను కోరింది. ఈ ఏడాది డిసెంబరులో జరిగే ఎన్నికల్లో పోటీ చేయకుండా అవామీ లీగ్ పార్టీపై తాత్కాలిక ప్రభుత్వం అనర్హత వేటు వేసింది.

# ఎ ఐ ప్రకటనపై 60 దేశాలు సంతకం

**అమెరికా,బ్రిటన్ తిరస్కృతి**




**పారిస్ :** కృత్రిమ మేధపై పారిస్‌లో సోమ,మంగళవారాల్లో జరిగిన ప్రపంచ శిఖరాగ్ర సదస్సులో రూపొందించిన ప్రకటనపై 60 దేశాలు సంతకం చేశాయి. కానీ అమెరికా, బ్రిటన్ దేశాలు మాత్రం సంతకాలు చేసేందుకు తిరస్కరించాయి. కృత్రిమ మేధ సాంకేతికత బాహాటత్వంతో ఉండాలనీ, సామాన్య ప్రజలకు చేరువకావాలని, అందరి క్షేమం కోరుకోవాలనీ, ఎలాంటి అరమరికలూ లేకుండా బాహాటపద్ధతులలో సాంకేతికత రూపొందాలనీ, భద్రత, విశ్వసనీయత ఉండాలని కృత్రిమ మేధపై జరిగిన శిఖరాగ్ర సదస్సు డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఈ డిక్లరేషన్‌తో అమెరికా,బ్రిటన్ దేశాలు విభేదించాయి. ప్రజలస్థిరత్వంకోసం, భూగోళస్థిరత్వంకోసం కృత్రిమ మేధను అందుబాటులోకి తెచ్చి ఉపయోగించాలని డిక్లరేషన్ ప్రకటించింది. ఐతే విపరీతమైన ఆంక్షలు కృత్రిమ మేధ విస్తృతికి, పరివర్తనకు ఆటంకాలు కలిగిస్తాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ అన్నారు. అసలు మొట్టమొదటి కృత్రిమ మేధ ప్రపంచ శిఖరాగ్ర సదస్సును 2023లో బ్రిటన్ ప్రభుత్వమే నాటి ప్రధానమంత్రి రుషి సునాక్ సారథ్యంలో నిర్వహించింది. ఇప్పుడు బ్రిటన్ ప్రభుత్వం ఈ డిక్లరేషన్‌పై సంతకం చేసేందుకు తిరస్కరించింది. మరింత సమర్థవంతమైన, ఆచరణాత్మకమైన పరిష్కారాలు సాధించేందుకు తమ అమెరికా భాగస్వామితో కలిసి కృషి చేస్తామని బ్రిటన్ ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రకటనపై బ్రిటన్ ఒసతకాలు చేయకపోవడం సరైన నిర్ణయమని ఆ దేశ ప్రతినిధులు సమర్థించారు. కృత్రిమ మేధ ద్వారా ప్రపంచం ముందుకు ప్రయాణించేందుకు ఈ మాత్రం నియంత్రణలు ఉండాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సహా భారత్ కూడా సమర్థించింది.

# ట్రంప్ రియలెస్టేట్ ప్లాన్‌కు జోర్డాన్ తిరస్కృతి



**వాషింగ్టన్ :** గాజాలో ట్రంప్ ప్రతిపాదించిన రియల్ ఎస్టేట్ ప్రతిపాదనను జోర్డాన్ తిరస్కరించింది. ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఎలాంటి వాగ్దానం చెయ్యలేదు. పాలస్తీనియన్లను గాజాలో ఉంచి మరోవైపు నుండి శిథిలాల తొలగింపు చర్యలు కొనసాగించవచ్చునని జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 అన్నారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆయనతో సమావేశమై జోర్డాన్‌లో పాలస్తీనా ప్రజలకు శరణార్థులహోదా ఇవ్వాలని అడిగారు. అందుకు జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 తిరస్కరించారు. అదేవిధంగా ఈ విషయాలను అరబ్‌దేశాలు జరిపే ఉమ్మడి సమావేశంలో నిశితంగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని కూడా ఆయన ట్రంప్‌కు భరోసా ఇచ్చారు. గాజాను కొనుగోలు చేసే ఉద్దేశం లేదని, ఆ అవసరం లేదనీ, గాజాను తాము ఆక్రమించుకుంటామని ట్రంప్ ఈ సందర్భంగా జోర్డాన్ రాజుకు చెప్పారు. ట్రంప్ రియల్ ఎస్టేట్ పథకం గురించి ప్రపంచమంతా ప్రచారం జరిగిన తర్వాత ఈ విషయంపై అంతర్జాతీయస్థాయిలో ఒక నాయకుడితో ట్రంప్ చర్చించడం ఇదే మొదటిసారి. ఈజిప్టు, జోర్డాన్‌ల భాగస్వామ్యంలేకుండా తాము ఏమీ చేయలేమని కూడా ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా గాజాలో తిరిగి యుద్ధం మొదలవుతుందని పాలస్తీనా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని హమాస్ ఆరోపిస్తుండగా, బందీల విడుదలను హమాస్ ఉగ్రవాదులు నిరవధికంగా వాయిదా వేయడాన్ని అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పూర్తిస్థాయిలో సైన్యాన్ని సన్నద్ధం చేయాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. తాము కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నామనీ, కానీ ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తే తాము కూడా తిరస్కరిస్తామని హమాస్ చెరబుతున్నది. దీంతో గాజాకు తిరిగి వచ్చిన లక్షలాదిమంది ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన జరుగుతుందని అంచనాలు వేస్తున్నారు.

**రష్యా విడుదల చేసిన బందీకి స్వాగతం పలికిన ట్రంప్**



రష్యా విడుదల చేసిన అమెరికా బందీకి వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారంనాడు స్వాగతం పలికారు. అమెరికా ఉపాధ్యాయుడు మార్క్ ఫోగల్‌ను 2021లో మాస్కో విమానాశ్రయంలో అక్రమంగా అరెస్టు చేశారు. ఆయనకు రష్యా న్యాయస్థానం 14 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. వైద్యపరంగా ఆయనను మార్జువానా వాడమని వైద్యులు చెప్పారు. ఆయనవద్ద మార్జువానా పట్టుబడటంతో రష్యా కోర్టు ఆయనకు పెద్ద శిక్ష విధించింది. అప్పటినుండి ఆయన అక్కడ జైలులో మగ్గుతున్నారు. ట్రంప్ చొరవతో ఆయన విడుదలై వచ్చారు. వైట్‌హౌస్‌లో ట్రంప్‌ను కలిశారు. ట్రంప్ ఆయనకు స్వాగతం పలికి శుభాభినందనలు తెలియజేశారు. ఇంకా రష్యావద్ద ఎనిమిదిమంది అమెరికన్లు బందీలుగా ఉన్నారు.




## నోటా ఉండాల్సిందే (మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఎన్నికల కమిషన్ బుధవారం సమావేశాన్ని నిర్వహించింది. 2016 ఫిబ్రవరిలో జరిగిన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, అచ్చంపేట, సిద్ధిపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో నోటాను అమలు చేశారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఒక్కరే నామినేషన్ దాఖలు చేస్తే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించొద్దని, నోటాతో ఎన్నికలు నిర్వహించాలని, ఒక వేళ నోటాకు ఎక్కువ ఓట్లు పోలైతే, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని బిఆర్‌ఎస్,సిపిఐతో పాటు పలువురు ఎన్నికల సంఘానికి సూచించారు. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇది వరకే చెప్పిన విషయాన్ని సిపిఐ(ఎం) తెలిపింది. కాగా తమ అభిప్రాయాన్ని రెండు, మూడు రోజుల్లో చెబుతామని టిడిపి చెప్పగా, ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినా నోటా ఉండాలని జనసేనా తెలిపింది. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు బి.కమలాకర్ రావు, పి.రాజేష్ కుమార్ (కాంగ్రెస్), అంథోని రెడ్డి, ఎస్.,మల్లారెడ్డి( బిజెపి), సి.హెచ్ రాజేష్‌కుమార్, పల్లె రవికుమార్, (బిఆర్‌ఎస్) తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ రావు(సిపిఐ), డి.జి.నర్సింహరావు(సిపిఐ(ఎం), సయ్యద్ ఖలీలుల్లా (ఎంఐఎం), దేగం యాదగౌడ్(టిడిపి) తదితరులు పాల్గొన్నారు.

**ఒక్క నామినేషన్ వచ్చినా నోటాతో ఎన్నికలు నిర్వహించాలి : సిపిఐ**
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక నామినేషన్ వస్తే ఏకగ్రీవానికి తావు ఇవ్వకూడదని, ఒక వేళ ఒక్కటే నామినేషన్ వస్తే, నోటా' గుర్తుతో కలిపి ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సూచించారు. నోటాను స్వాగతిస్తున్నామని, అభ్యర్థి కంటే 'నోటా' కు ఎక్కువ ఓట్లు పోలేతే మళ్లీ ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో సిపిఐ తరపున తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నోటాకు ఎక్కువ ఓట్లు పోలై, ఆ తర్వాత స్థానంలో ఉన్న అభ్యర్థిని ప్రకటించవద్దని కోరారు. మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలలో నోటాకు ఓట్లు ఎక్కువగా పోలయితే, మళ్లీ ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని శ్రీనివాస్‌రావు గుర్తు చేశారు. ఇదే విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. ఏకగ్రీవం పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలలో ఇతర పార్టీల నాయకులను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని, వేలం పాటలు వేసి పదవులను కొనుగోలు చేస్తున్నారని, ఇది రాజకీయాల్లో మంచి సాంప్రదాయం కాదని హితువుపలికారు.




తెలంగాణ సచివాలయ నిర్మాణంలో లోపాలు బయటపడుతున్నాయి. సచివాలయం ఏడో అంతస్తు నుంచి ఒక్కసారిగా పెచ్చులు ఊడిపడ్డాయి. పెద్ద శబ్దాలతో పెచ్చు ఊడిపడడంతో ఉద్యోగులందరూ ఉలిక్కిపడ్డారు. పూర్తిగా అతికించడంలో నిర్లక్ష్యం వల్ల ఊడి పడిన ముక్కలు.. కింద రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ కార్ పార్క్ చేసి ఉండడంతో నేరుగా కారు పై పడిన పెచ్చులు...అదే స్థలంలో ఎవరైనా నిల్చుని ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది.

## రూ.1269.32కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**

13,23,615 మంది రైతుల 18.19 ఎకరాలకు గాను రూ.1091.95 కోట్లు, 12వ తేదీన 56,898 రైతులకు సం బంధించి 63,900,15 ఎకరాలకు గాను రూ.38.24 జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. 5వ తేదీన మొదటి విడతలో ఎకరం వరకు 17.03 లక్షల మంది రైతులకు, 9.29 లక్షల సాగుభూమికి రూ.557.54 కోట్లు జమ చేసిన విషయం తెలిసిందేఅన్నారు. మొత్తం ఇప్పటీవరకు మూడు విడుతలు కలిపి44.82 లక్షలమంది రైతులకు సంబంధించిన 58.13 లక్షల ఎకరాలకు రూ.3487.82కోట్లను జమ చేసిశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

**విడుదల వారిగా విడదల చేసిన నిధుల వివరాలు :**

| తేదీ | లబ్ధిదారులు | ఎకరాలు | నిధులు రూ. | ఎకరాలవారిగా |
|---|---|---|---|---|
| 27.01.2025 | 4,41,911 | 9,48,332.35 | రూ.5,689,997,265 | 577(పైలెట్ గ్రామాలు) |
| 05.02.2025 | 17.03,419 | 9,29.234.20 | రూ.5,575,407,019 | 1 ఎకరం వరకు |
| 10.02.2025 | 13,23,615 | 1.819.919.09 | రూ.10.919.515.390 | 2 ఎకరాల వరకు |
| 12.02.2025 | 56,898 | 63.900.15 | రూ.383,401,002 | 2 ఎకరాల వరకు |
| 12.02.2025 | 9,56,422 | 2,051,649.62 | రూ.12,309,899,722 | 3 ఎకరాల వరకు |
| మొత్తం | 4,482,265.00 | 5,813,036.61 | రూ.34,878,220,398 | |

## రాజీ పడబోం (మొదటి పేజీ తరువాయి)

తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

**ప్రజాప్రతినిధులతో ప్రభుత్వం సమన్వయ లోపం**
ప్రజాప్రతినిధుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగాలేదని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినా మంత్రులు కానీ, అధికారులు గానీ కనీసం సమాధానం ఇవ్వడం లేదని, ఆ సమయంలో వారు పనిలో ఉంటే ఆ తర్వాత అయినా కనీసం స్పందించడకపోవడం దారుణమన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పటికీ దానిని వివరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీకి సంబంధించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అంత కంటే ఎక్కువగా రుణం ఉన్న వారికి సైతం రూ.2 లక్షలలోపు మాఫీ చేసి ఉంటే ప్రభుత్వానికి ఎంతో మంచి పేరు వచ్చి ఉండేదని, ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదో ఇప్పటికీ అర్థం కాలేదన్నారు. బిసిల రిజర్వేషన్లుకు సంబంధించి 42 శాతం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఉన్న 50 శాతం సీలింగ్‌ను అధిగమించేందుకు న్యాయ పోరాటం చేయాలని సాంబశివరావు సూచించారు. కుల సర్వే సక్రమంగా లేదని వివిధ వర్గాల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో గ్రామ సభలు పెట్టి మరోసారి పునసమీక్షించి సరిదిద్దాలని సాంబశివరావు సూచించారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తూ హిందుత్వ మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బిజెపి ప్రభుత్వం అదే హిందువుల అభ్యున్నతికి ఏమి చేసిందో చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. 'సబ్‌కా సాత్...సబ్‌కా వికాస్' అంటున్న బిజెపి దేశంలో 99 శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల బతుకులను వినాశనం చేస్తూ, కేవలం ఒక శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు సంపద అంతా దోచిపెడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి కేంద్ర పాలకులకు హిందువులపైనా, ఇతరులపైనా అభిమానం లేదని, కేవలం మతాలను, కులాలను అడ్డం పెట్టుకుని అధికారం చెలాయించడమే వారి లక్ష్యమన్నారు.

**కాంగ్రెస్ వైఖరే బిజెపికి బలం**
గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రగతిశీల శక్తులు, లౌకిక పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏకమై రాజకీయంగా బిజెపి బలాన్ని తగ్గించగలిగామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి కారణంగా మళ్లీ బిజెపి బలం పుంజుకోవడం ఈ దేశానికే అత్యంత ప్రమాదకరంగా మారనుందన్నారు. ఢిల్లీలో ఆప్ ఓడిపోవడంతో బిజెపి మరింత రెచ్చిపోయే అవకాశం లభించిందని, ఇందుకు ఇండియా కూటమికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీతో పాటు కూటమిని కాదని ఒంటరిగానే బరిలోకి దిగుతామని మొండి వైఖరి అవలభించిన ఆప్ అధినేత కేజ్రీవాలే కారణమని ఆయన పేర్కొన్నారు. ఆప్ కేవలం 2 శాతం ఓట్ల తేడాతో ఢిల్లీలో అధికారం కోల్పోయిందని, అదే కాంగ్రెస్‌కు 6 శాతం ఓట్లు వచ్చాయని, ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసి ఉంటే తప్పక మరోసారి ఆప్ అధికారం చేపట్టేదని తెలిపారు. అయితే కేజ్రీవాల్‌పై ఉన్న కేసులను అడ్డం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనను బెదిరింపులకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఉదారభావంతో వ్యవహరించి ఇండియా కూటమిని ఏకతాటిపై నడిపేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే బిజెపి మరింత బలపడి దేశ ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారుతుందని తెలిపారు.

**మావోయిస్టులు ఈ దేశ ప్రజలు కాదా?**
మావోయిస్టులనే పేరుతో ఈ దేశ ప్రజలపై యుద్ధం ప్రకటించి వారిని అత్యంత కిరాతకంగా మట్టు పెడతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారికంగా ప్రకటించడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధమని, దీనిపై అంతర్జాతీయ న్యాయస్థానంతో పాటు ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని ఇందుకు కారణమైన కేంద్రమంత్రి అమిత్‌షాను శిక్షించాలని ఆయన కోరారు. అదేవిధంగా సుప్రీంకోర్టు సైతం ఎన్‌కౌంటర్లపై విచారణ నిర్వహించి ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల అన్ని చర్యలను తాము సమర్థించడంలేదని, ప్రజల కోసమని అడవి బాట పట్టి పోరాడుతున్న మావోయిస్టులు అసలు ఎందుకోసం చనిపోతున్నారో ప్రజలు కనీసం గుర్తించడంలేదనే విషయాన్ని గుర్తించుకోవాలని హితువు పలికారు. ఈ దేశంలో విప్లవం ద్వారా రాజ్యాధికారం వచ్చే పరిస్థితులు ప్రస్తుతం లేవని, ఈ నేపథ్యంలో వారు పునరాలోచన చేసుకోవాలని సాంబశివరావు కోరారు.

**అమెరికా చర్యలు దుర్మార్గం**
అక్రమ వలసల పేరుతో అమెరికా ప్రభుత్వం భారత ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గమని, దీనిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్నారని 104 మంది భారతీయులను అమానవీయంగా సంకెళ్లు వేసి, సైనిక విమానాల్లో దేశంలో వదలిపెడితే దీనిపై కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం, ఈ ఘటనను ప్రధాని ఖండించకపోవడం దారుణమన్నారు.

## మరో అవకాశం

**(మొదటి పేజీ తరువాయి)**

వెల్లడించ లేదన్నారు. తెలంగాణలో 3.1 శాతం మంది సర్వేలో పాల్గొన లేదన్నారు. గతంలో నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారి కోసమే ఈ సారి నిర్వహిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరితే అధికారులు ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. మండల కార్యాలయాల్లో ప్రజా పాలన అధికారులు ఈ 10 రోజులు అందుబాటులో ఉంటారన్నారు. అక్కడ వివరాలు నమోదు చేసుకోవచ్చు అన్నారు. ఆన్ లైన్ ద్వారా కూడా కుటుంబ వివరాలు నమోదుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బిసిల దశాబ్దాల కల నెరవేర్చేందుకు ప్రజా ప్రభుత్వంతో రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, మేధావులు కలిసి రావాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

**పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తాం..**
రాష్ట్రంలో ఓబిసిలకు విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భట్టి విక్రమార్క అన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం కోసం కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఢిల్లీకి ప్రతినిధి బృందం వెళుతుందని చెప్పారు. పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను కూడా కాలుపుకపోతామన్నారు. రాష్ట్రంలో మూడు శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదు వారికి మరో సారి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. కెసిఆర్, కెటిఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి వంటి వారు ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వలేదన్నారు. మరి కొందరు అందుబాటులో లేకుండా పోయారని, వారందరి కోసం మరోసారి అవకాశం ఇస్తున్నట్టు ఆయన చెప్పారు.

**రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టాం..**
రాష్ట్రంలో కుల గణన విజయవంతం అయితే దేశమంతటా చేయాల్సి వస్తుందని అనుకునేవారు రీ సర్వే కోసం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లక్ష మందికి పైగా సిబ్బందితో పూర్తిగా శాస్త్రీయంగా సమగ్ర ఇంటింటి సర్వే రాష్ట్రంలో జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏ ఏ వర్గాల జనాభా ఎంతో శాసనసభలో లెక్కలతో సహా సిఎం రేవంత్ రెడ్డి వివరించారని, చర్చ కూడా జరిగిందన్నారు. ఓబిసిలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు ఆమోదం కోసం, మద్దతు కూడబెట్టడానికి రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి, రాజకీయ పార్టీలు, సోషల్ యాక్టివిస్టులు, మేధావులు, ప్రజలు అంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జనాభాలో ఓబిసిలు 56 శాతంగా ఉన్నట్టు ఉపముఖ్యమంత్రి అన్నారు.

**దశాబ్దాల ఓబిసిల కలలను నిజం చేసేందుకు కృషి ..**
స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకురావడం తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దశాబ్దాల ఓబిసిల కలలను నిజం చేసేందుకు కృషిచేస్తామన్నారు. రిజర్వేషన్లపై రాజకీయపరంగా కుట్రలు చేస్తే తిప్పికొడతామని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి పక్కన పెట్టి మద్దతు పలకాలని కోరుతున్నామన్నారు. కులగణన సర్వేలో పాల్గొనని వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర జనాభా లెక్కల్లో వచ్చేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

**ఆర్థిక భారమైన 56 శాతం జనాభా కోసం భరిస్తాం..**
పంచాయతీ ఎన్నికలు అలస్యం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారం పడుతుందని, అయినా జనాభాలో 56 శాతం ఉన్న బిసిలకు న్యాయం చేయడం కోసం ప్రభుత్వం ఆర్థిక భారాన్ని భరించేందుకు సిద్ధంగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా భట్టి విక్రమార్క తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో ఓబిసిలకు రాజకీయ రిజర్వేషన్‌లు కల్పిస్తామన్నారు.

## ఇంటింటికీ ఇంటర్నెట్

**(మొదటి పేజీ తరువాయి)**

డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి తీసుకురానున్నట్టు సచివాలయంలో బుధవారం తనను కలిసిన ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందానికి వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద డిజిటలైజేషన్ చేపట్టిన నాలుగు గ్రామాలను ఈ బృందం సందర్శించి తమ అనుభవాలను మంత్రితో పంచుకుంది. హాజిపల్లి (రంగారెడ్డి జిల్లా), మద్దూర్ (నారాయణ్ పేట), సంగుపేట (సంగారెడ్డి), అడవి శ్రీరాంపూర్ (పెద్దపల్లి) గ్రామాల్లో ఇంటర్నెట్ కనిక్టివిటీ వల్ల స్థానికులకు కలిగిన ప్రయోజనాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్టు వైజంతీ దేశాయ్, కింబర్లీ జాన్స్ ఆధ్వర్యంలోని ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందం వెల్లడించింది. మరో మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు కనెక్టివిటీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు శ్రీధర్ బాబు వారికి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 32 వేల కిమీ పొడవున ఫైబర్ ఆప్టిక్ కేబుల్ ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. సమావేశంలో ఐటి శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ఇషిరా మెహతా, అరుణ్ శర్మ, స్యూ సంజ్ ఎంగ్‌లు పాల్గొన్నారు.

## తీసుకురండి(మొదటి పేజీ తరువాయి)

స్రవంతిలోకి చేర్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తే బాగుంటుందని సూచించింది.
పిటిషన్ల తరపున అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఉపాధి దొరికితే కష్టపడడానికి ఎవరూ వెనుకాడరని తెలిపారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ 'మీరు ఒకవైపు మాత్రమే ఆలోచిస్తున్నారు. నేను రైతు కుటుంబంనుంచి వచ్చినవాడినే. మహారాష్ట్రలో ఉచితాలవల్ల రైతులకు పొలాల్లో పనిచేసేందుకు శ్రామికులు లభ్యం కావడం లేదు' అన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు ధర్మాసనం నిరాకరించింది. అంతకుముందు పేదలకు ఆశ్రయం కల్పించే విషయమై ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తున్నదని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వెల్లడించారు. పలు సమస్యల పరిష్కారానికి తోడు పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ఒక మిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ మిషన్ పనిచేసే తీరు, అందులోని అంశాలు, ఎంతకాలంలో మిషన్‌ను పూర్తి చేస్తారన్న సమాచారం అందించాలని ధర్మాసనం కోరింది. మిషన్ కింద దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న విధానం వివరించాలన్నది. విచారణ సందర్భంగా ఒక పిటిషనర్ అధికారులు పేదలపట్ల ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని, ధనవంతులకు ఇచ్చే ప్రాధాన్యం పేదలకు ఇవ్వలేదనడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇటువంటి వ్యాఖ్యలు కోర్టులో చేయవద్దని, కోర్టును రాజకీయ వేదికగా మార్చవద్దని పిటిషనర్‌ను హెచ్చరించింది. ప్రభుత్వం ధనికుల పట్లే శ్రద్ధ చూపుతుందని ఎలా చెప్పగలవని ఆ పిటిషనర్‌ను ప్రశ్నించింది. అయితే ప్రభుత్వం పేదల సమస్యలపట్ల తగినంత శ్రద్ధ చూపడం లేదన్నది వాస్తవమేనని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం. అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి అందజేసిన పిటిషన్‌లో సమాచారంపై మాట్లాడుతూ 2024 డిసెంబర్ 4నాటికి దేశవ్యాప్తంగా 2,557 నిరాశ్రయులకోసం షెల్టర్లను ఆమోదించారని, అయితే 1,995 షెల్టర్లు మాత్రమే 1.16 లక్షల పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్క ఢిల్లీలోనే 3 లక్షలమంది నిరాశ్రయులున్నారని వెల్లడించారు. ఢిల్లీ అర్బన్ ఆశ్రయ అభివృద్ధి బోర్డు అందించిన సమాచారం ప్రకారం 17వేలమందికి ఆశ్రయం కల్పిస్తున్నారని, అందులో 5,900మందికి మాత్రమే పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఢిల్లీ ఆశ్రయ అభివృద్ధి బోర్డు న్యాయవాది దేశ రాజధానిలో 197 షెల్టర్లు ఉన్నాయని, అందులో 17మంది ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. గత నాలుగేళ్లలో సగటున 5,500మంది ఆక్యుపెన్సీ నమోదైనట్టు తెలిపారు. మరో పిటిషనర్ వివిధ రాష్ట్రాలలో అందుబాటులో ఉన్న షెల్టర్లు, అందులో ఆశ్రయం పొందుతున్న వారి సమాచారాన్ని పట్టిక రూపంలో అందజేశారు. అవి కేంద్రం అందజేసిన సమాచారం ఆధారంగా రూపొందించినవేనని తెలిపారు. ఆ పట్టికలోని సమాచారం సరైనదో కాదో తెలియజేయాలని ధర్మాసనం అటార్నీ జనరల్‌కు సూచించింది. దీనిపై తదుపరి విచారణను కోర్టు ఆరువారాలకు వాయిదా వేసింది. పిటిషన్‌ను విచారించే సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు నిరాశ్రయులకు అందజేస్తున్న సౌకర్యాలపై నివేదిక సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరిన సంగతిని ప్రస్తావించడం గమనార్హం.

**'సుప్రీంకోర్టును ఆశ్రయించండి'**
ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించడం, నగదును పంచడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి ఎస్.ఎన్.ఢింగ్రా వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు విచారించేందుకు తిరస్కరించింది. ఈ అంశం ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉందని, పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిందిగా హైకోర్టు చీఫ్ జస్టిస్ డి.కె.ఉపాధ్యాం, జస్టిస్ తుషార్ రావ్ గెడెలతో కూడిన ధర్మాసనం తెలిపింది. పిటిషనర్ తన అభ్యర్థనను రెండు కోణాలలో.. ఉచితాలు, అవినీతి చర్యలు అనే అంశాలలో ప రిశీలించాలని కోరారు. అయితే ఒకే అంశాన్ని రెండు విధాలుగా పరిశీలించడం కుదరదని, ఈ అంశం సుప్రీం కోర్టు పరిశీలనలో ఉన్నందున తాము జోక్యం చేసుకోబోమని వెల్లడించింది. కాగా పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు ఫిర్యాదు తరపు న్యాయవాది అంగీకరించగా, కోర్టు అందుకు అనుమతించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఢింగ్రా ఫిర్యాదు చేసినా బుధవారం అది విచారణకు వచ్చింది. ఫిర్యాదుదారు న్యాయవాది మరో అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచితాలు పంచేందుకు ఓటర్ల సమాచారం కోరడంకూడా ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఎలక్షన్ కమిషన్ న్యాయవాది ఈ పిటిషన్‌పై స్పందిస్తూ దీనిపై ఇప్పటికే సుప్రీంకోర్టుకు తమ వాదనను అందజేశామని హైకోర్టు దృష్టికి తెచ్చారు. కాగా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆప్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పలు పథకాలు ప్రకటించిందని, ఇది స్వేచ్ఛాయుత ఎన్నికలకు విఘాతమని ఢింగ్రా తన ఫిర్యాదులో పేర్కొన్నారు.



## ఆలయంలో అపచారంపై విచారణకు ఆదేశం

మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ టప్పా చబుత్రలోని 'జిర్ర హనుమాన్ ఆలయం'లో చోటు చేసుకున్న అపచార ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విచారణకు ఆదేశించారు. గుర్తు తెలియని కొందరు ఆలయంలోని శివలింగంకు సమీపంలో మాంసం ముద్దలు పడేయడంపై కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఆదేశాలతో ఘటనా స్థలానికి దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు వెళ్లారు. సమగ్ర విచారణ తర్వాత బాధ్యులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. భక్తుల నమ్మకాల విషయంలో తమ ప్రజా ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

ప్రభుత్వానికి టిఎన్‌జిఒ కార్యవర్గ సమావేశం విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలని టిఎన్‌జిఒ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణ ఎన్‌జిఒ కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లోని టిఎన్‌జిఒ భవన్ టిఎన్‌జిఒ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, హుస్సేనీ ముజీబ్ మాట్లాడుతూ నుతన ప్రభుత్వం ఏర్పాటయ్యేనాటికి పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలలో ఒక డిఎను ప్రభుత్వం విడుదల చేయడాన్ని హర్యం వ్యక్తం చేస్తున్నామని, మిగిలిన పెండింగ్ డిఎలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. నూతన పిఆర్‌సిని అమలు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఎన్నడూ లేని విధంగా సిఎం మూడు గంటలకు పైగా తమతో చర్చించి, మార్చి తర్వాత అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని సిఎం హామీనిచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర సంఘం నాయకులు ఎన్.నరసింహస్వామి, చేపూరి నరసింహ చారి, సి.ఎస్. నరసింహారెడ్డి, వెల్లంకి మాధవి, ఉమారెడ్డి, నజీర్ అహ్మద్, కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పండగలా వర్గీకరణ విజయోత్సవాలు

మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌సి వర్గీకరణ ఫలాలను ప్రతిగడపకూ తీసుకెళ్లే బాధ్యత ఎంఎల్‌ఎలపైన ఉన్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. మాదిగ, ఉపకులాల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుతున్న తరుణంలో వర్గీకరణను ఒక పండుగలా జరుపుకోవాలని, వర్గీకరణ విజయోత్సవాల్లో అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఎంఎల్‌ఎలు కడియం శ్రీహరి, లక్ష్మీ కాంతరావు, అద్లూరి లక్ష్మణ్, మందుల సామెల్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలెయాదయ్య, మాజీ ఎంఎల్‌సి రాజేశ్వరరావు తదితరులు హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో మంత్రి దామోదర రాజనర్సింహతో బుధవారం సమావేశమయ్యారు. వర్గీకరణను ముందుకు తీసుకెళ్లే అంశంపై వారు మంత్రితో చర్చించారు. వర్గీకరణలో అవలంభించిన శాస్త్రీయ పద్ధతులను ప్రజలకు వివరించాలని, అపోహలను, అనుమానాలను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికాకుండా చూసే బాధ్యత ఎంఎల్‌ఎలు, మాదిగ సామాజికవర్గ నాయకులదేనని ఆయన చెప్పారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మద్దతుగా నిలిచిందన్నారు. 2005 సంవత్సరంలో జరిగిన శాసనసభ సమావేశంలో వర్గీకరణకు అనుకూలంగా నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం తీర్మానం చేసిందని, ఈ తీర్మానం ఆధారంగానే 2006లో నాటి యుపిఎ ప్రభుత్వం జస్టిస్ ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని దామోదర రాజనర్సింహ వివరించారు. 2006లో దవిందర్ సింగ్ దాఖలు చేసిన కేసులో, వర్గీకరణకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన వాదనను వినిపించిందని చెప్పారు. వర్గీకరణకు అనుకూలమని 2018లో రాహుల్‌గాంధీ హైదరాబాద్‌లో జరిగిన ఎడిటర్ మీట్‌లో చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 2023లో చేవెళ్లలో జరిగిన ఎస్‌సి డిక్లరేషన్ సభలో, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్వయంగా వర్గీకరణకు అనుకూలంగా ప్రకటన చేశారన్నారు. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే, సుప్రీంకోర్టులో వర్గీకరణకు అనుకూలంగా వాదించేందుకు సిఎం రేవంత్ రెడ్డి సీనియర్ అడ్వకేట్‌ను నియమించారని చెప్పారు. 2006 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో, 2024 ఆగస్ట్ ఒకటిన తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారన్నారు. ఆ వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించారని, ఆ తర్వాత ఏక వ్యక్తి జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించారని తెలిపారు. ఈ కమిషన్ జనాభా, విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేసి, ఉమ్మడి పది జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి, ఆయా సామాజిక వర్గాల, సంఘాల నుంచి వినతిపత్రాలను స్వీకరించిందని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో సుమారు 8 వేలకుపైగా వినతులను తీసుకుని, వాటిని క్రోడీకరించి, శాస్త్రీయంగా నివేదికను రూపొందించిందని మంత్రి తెలిపారు.

ప్రతి కులానికి న్యాయం చేసేలా వర్గీకరణ ఉందన్నారు. అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్1లో, మధ్యస్తంగా 18 కులాలను గ్రూప్2లో, కొంత మెరుగ్గా ఉన్న కులాలను గ్రూప్3లో చేర్చాలని కమిషన్ సూచించిందని ఆయన వివరించారు. కమిషన్ సూచించినట్టుగా అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా వర్గీకరణ జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ మల్లేశం, టిపిసిసి నాయకుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు

## వనపర్తి ఐటి టవర్‌కు రూ.22 కోట్లు మంజూరు చేస్తూ ఐటి శాఖ ఉత్తర్వులు

సిఎంకు డాక్టర్ జి. చిన్నారెడ్డి కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వనపర్తి జిల్లాకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) టవర్ మంజూరు అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయ మీడియా సెంటర్లో బుధవారం విలేకరుల సమావేశంలో జి. చిన్నారెడ్డి ఐ.టి టవర్ మంజూరు అంశాలను వెల్లడించారు. వనపర్తి లో ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ.22 కోట్లు విడుదల చేస్తూ రాష్టర ఐటి శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండు ఎకరాల స్థలంలో ఐటి టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 25 వేల చదరపు అడుగుల లో ఐటి భవన నిర్మాణం జరుగుతుందని ఈ భవనంలో ఏకకాలంలో 250 మంది ఐటి ప్రొఫెషనల్స్ పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని చిన్నారెడ్డి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఐటి అబ్బులను అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటి టవర్ మంజూరు అయిందని సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటి టవర్ ను వనపర్తి లో ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఐటి టవర్ మంజూరు అయిందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు.



## జైళ్ల శాఖ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జైలు ఉద్యోగమనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్త అన్నారు. చంచల్ గూడ లోని సికా పరేడ్ గ్రౌండ్ లో బుధవారం ఏర్పాటు చేసిన తెలంగాణ జైళ్ల శాఖ 7వ రాష్ట్ర స్థాయి వార్షిక స్పోర్ట్స్ మీట్–2025ను జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రాతో కలిసి రవిగుప్తా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్‌ల ద్వారా సిబ్బంది లో శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు సిబ్బంది మధ్య స్నేహ సంబంధాలకు ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. అంతకుముందు ఆయన జైలు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడా జెండాను ఎగురవేసి, పావురాలు, బెలూన్లను ఎగురవేసి, పోలీసు క్రీడా జ్యోతిని వెలిగించారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు నాంది పలికారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజిలు రాజేష్.మురళి బాబు. డిఐజిలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్‌లు నవాబ్ శివకుమార్ గౌడ్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# రాముడి పేరుతో దౌర్జన్యాలు సహించం

చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు సివి.రంగరాజన్‌పైన కొంతమంది రామభక్తులు అని చెప్పి దౌర్జన్యాలకు పాల్పడి, దుర్భాషలాడటం బాధాకరమని, అలాంటి దొంగ రామభక్తులపైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం రంగరాజన్ నివాసం వద్దకు సాంబశివరావు, పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. ప్రభులింగంలతో కలిసి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశం సకల మతాలకు నిలయమైన దేశం అని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి దేశంలో రాముడి పేరుతో రాజకీయాలు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని, ఇది ముమ్మాటికీ ఫడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రామరాజ్యంలో కష్టాలు, కన్నీళ్లు, మహిళలపై హింస,అత్యాచారాలు ఉండవని, ఈ దేశంలో అన్నీ జరుగుతున్నాయని, దీనిని ఎలా రామరాజ్యం అంటామని ఆయన ప్రశ్నించారు. నిజమైన రామ భక్తులు, దేశభక్తులు కమ్యూనిస్టులేనని కూనంనేని సాంబశివరావు అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపైన కఠినమైన చర్యలు తీసుకొని శిక్షించాలని, మరోసారి దేశంలో, రాష్ట్రంలో ఎక్కడా కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, శంకరపల్లి మండల కార్యదర్శి పి.సుధీర్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, కన్యగారి నరసింహారెడ్డి, సుధాకర్ గౌడ్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, వెంకటయ్య, నాయకులు రఘురాం, నారాయణ, మధు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

15న నిరసన

ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారిస్తామని స్వయంగా రవాణ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చి రెండు నెలలు దాటినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి నేతలు బి.వెంకటేశం (ఎఐటియూసి), పి. శ్రీకాంత్ (సిఐటియు) ఎంఎ. సలీం, ఎండి. నజీర్ (యుటిఎడబ్ల్యూఎ), నిరంజన్ (బిఆర్‌టి యు), వి.ప్రవీణ్ (టియుసిఐ), రామ్‌రెడ్డి (ఐఎఫ్‌టియు) సిహెచ్. జంగయ్య, ఎస్.అశోక్, ఎం.శ్రీనివాస్, ఎం.కృష్ణ (ఎఐటియుసి) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ 2014 నుండి పెండింగ్‌లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించకుండా మోసం చేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత కొంత కాలంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి చేస్తున్న ఆందోళనకు స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల ముందు జెఎసి నేతలతో చర్చలు జరిపి 15 రోజుల్లో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని, నేటి వరకు కనీసం స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, తదితర ప్రధాన డిమాండ్లను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్కూల్ వ్యాన్లు, ఓలా, ర్యాపిడో, ఉబెర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటో లను నిషేదించాలని ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను తీవ్రతరం చేస్తామని అయన హెచ్చరించారు. ఈనెల 15న హైదరాబాద్ నారాయణగూడ ఫ్లైఓవర్ కింద రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయనున్నామని వెల్లడించారు.

# బిఆర్ఎస్ వ్యూహ ఫలితం దక్కేదెవరికి?

మరో ఓటమిని తట్టుకోలేకే పోటీ నుంచి తప్పుకున్నారా

బిఆర్ఎస్ తీరుపై విస్తృత చర్చ




**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో మూడు శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి 10 జిల్లాలు ఉండగా మూడు జిల్లాలు మినహాయించి ఏడు ఉమ్మడి జిల్లాలతో ఈ ఎన్నికలు ముడిపడ్డాయి. ఖమ్మం, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం మూడు స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ ఈ ఎన్నికల రంగం నుంచి తప్పుకుంది. దీనికి సంబంధించి రాష్ట్రంలో విస్తృత స్థాయిలో చర్చ జరుగుతుంది. బిఆర్ఎస్ వ్యూహం ఏ పార్టీకి మేలన్న దానిపైనే చర్చ సాగుతుండగా కాంగ్రెస్ వ్యతిరేక ఓటు చీలకూడదని పోటీ నుంచి ఉపసంహరించుకున్నామన్న కొందరు బిఆర్ఎస్ నేతల మాటలు వెనక బిఆర్ఎస్ లాభం దాగి ఉందన్నది బహిర్గతమవుతుంది. కాంగ్రెస్ వ్యతిరేక ఓటు బిఆర్ఎస్ పోటీ చేయని కారణంగా బిజెపి వైపు మల్లుతుందని దీంతో పరోక్షంగా బిజెపికి లాభం చేకూర్చే దిశగా బిఆర్ఎస్ వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మరో పక్క వరుస ఓటమిలతో తల్లడిల్లుతున్న బిఆర్ఎస్‌కు మరో ఓటమి రాకూడదనే పోటీలో నుంచి తప్పుకున్నారన్న వాదన వినపడుతుంది. 2023 శాసనసభ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా దక్కలేదు. ఆ తర్వాత ఖమ్మం పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల్లో సైతం ఆ పార్టీ అభ్యర్థి ఓటమి చెందక తప్పలేదు. ఇటువంటి పరిస్థితుల్లో మరోసారి ఓటమిని మూటకట్టుకునే కంటే వ్యూహం పేరుతో పోటీ నుంచి తప్పుకోవడమే శరణ్యమని ఆ నేతలు భావించారన్న చర్చ సాగుతుంది. ఔనన్నా, కాదన్నా రాష్ట్రంలో కాంగ్రెస్ స్వయం తప్పిదమో లేక మరేదైనా కారణం కావచ్చేమో కాని ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత కనపడుతున్నది. కానీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారు బిఆర్ఎస్ వెనక ర్యాలీ కావడం లేదన్న వాస్తవాన్ని ఈ సందర్భంలో గ్రహించాల్సి ఉంది. ఉదాహరణకు పదవి విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనం రాకపోవడంతో ఉద్యోగుల్లో కొంతమేర వ్యతిరేకత కనపడుతుంది. అదే సందర్భంలో బిఆర్ఎస్‌ను సమర్థించే పనిలో ఉద్యోగులు లేరు. ఇది అసలు బిఆర్ఎస్ పదవి విరమణ వయస్సు పెంపు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతుంది అంటున్నారు తప్ప కాంగ్రెస్‌ను కాదని బిఆర్ఎస్‌ను సమర్థించే స్థితికి ఇంకా ఉద్యోగులు చేరలేదు. రైతులు, నిరుద్యోగులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న నైపుణ్యతతో కూడిన ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో సైతం ఈ విషయంపై భిన్నాభిప్రాయం లేదు. తమకు రావాల్సిన ప్రయోజనాల పట్ల కాంగ్రెస్ పై వ్యతిరేకత కనబరుస్తున్నా బిఆర్ఎస్ వైపు చూసే పరిస్థితి లేదు. అందుకే బిఆర్ఎస్ వ్యూహం పేరుతో మరో ఓటమిని తప్పించుకునేందుకు ప్రయత్నించింది తప్ప మరొకటి కాదు. బిఆర్ఎస్ ఓట్లతో బిజెపికి కూడా పైన పేర్కొన్న రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానం నుంచి గెలిచే పరిస్థితి లేదు. మొత్తంగా బిఆర్ఎస్ వ్యూహం మరోసారి తనకు ఎదురు రావచ్చు. అలా కాకుండా కాంగ్రెస్ ఓడిపోయి బిజెపి గెలిస్తే బిఆర్ఎస్‌కు అది మరింత ప్రమాదం. ప్రత్యామ్నాయ శక్తిగా బిజెపి ఎదిగి బిఆర్ఎస్ పుంజుకుంటుందన్న ఆశలు సడిలి బిజెపి వైపుకు క్యాడర్ మరలే అవకాశం ఉంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాల్సి ఉంది. కాంగ్రెస్ విజయం సాధిస్తేనే బిఆర్ఎస్‌కు మనుగడ లేదంటే అస్థిత్వానికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

## యువతకు ఉపాధి కల్పించడంలో..
# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



వలి ఉల్లా ఖాద్రీ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తున్న పాలకులపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గ కమిటీ సమావేశం శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని గురుబ్రహ్మ కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో మోసపూరిత హామీలను ఇస్తు గద్దెనెక్కిన తర్వాత హామీల అమలును మర్చిపోవడం నీచ స్వార్థ రాజకీయాలకు తార్కాణమన్నారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి కల్పన కోసం నిర్దిష్టమైన ప్రతిపాదనలు లేవని, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన రంగంలో ప్రతిపాదనలన్నీ కంటితుడుపు చర్యలే అని తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ తొలి పదేళ్లకాలంలో ఉద్యోగాల కల్పనే లేదని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆర్థిక మంత్రి నానాతంటాలు పడ్డారని ఆరోపించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రధానంగా నిరుద్యోగులకు అన్యాయం చేశారనే గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించారనే అంశాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మార్చిపోవద్దని వారు హితవు పలికారు. నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే వరకు నిరుద్యోగ భృతి రూ.3116ల హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ యువత నిరంతరం సమాజంలోని అంతరాలపై పోరాడాలని, శాస్త్రీయ భావజాలం వైపు ఆలోచనలు చేసేలా చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్,కళ్యాణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక :** ఎఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా కళ్యాణ్, కార్యదర్శి ఎం.భగత్ సింగ్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్,రమేష్. కె.జి. రవి సహాయ కార్యదర్శి కె. నాగరాజు, బాలపేరు,మల్లేష్ సభ్యులుగా నవీన్ కుమార్, రాముడు, కె. నర్సింహాలతో పాటు 13 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, ఎస్ఎల్‌పి జోన్ :: జిహెచ్ఎంసి
NIT No. 47/EE/CIR-20/SLPZ/GHMC/2024-25 ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్) తేది: 12.02.2025
**పని రకం:** ఇతర పని. **అంచనా వ్యయం:** రూ.2.20 లక్షలు. **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 12.02.2025న మ.01.30గం.ల నుండి 13.02.2025న మ.01.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సిఐఆర్-20, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్: 9154834248.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, జిహెచ్ఎంసి
DIPR R.O. No. : 10186-PP/CL/ADVT/1/2024-25, Date: 12-02-2025



తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా
G2/1559/2024 Dt: 16.11.2024
Gaz. No.68/2024

భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం. 6, ప్రాథమిక ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని భైరాపూర్ గ్రామము పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.2.28 గుంటలు** భూమి ప్రజా ప్రయోజనార్థం ఈ యొక్క భూమి దేవాదాయ ఉన్నందున Hon'ble High Court Telangana Hyderabad ఆదేశాల ప్రకారం అనగా SRVR డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. సెక్షన్ 6(2) క్రింద (చట్టం 30/2013)లో పేర్కొనిన ప్రకారము నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము: భైరాపూర్ (డివిజన్-9) మండలం: వెల్దండ జిల్లా: నాగర్ కర్నూల్

| క్ర. సం. | [illegible] | [illegible] | [illegible] | [illegible] | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 126 | [illegible] | మెట్ట | 2.04 | దేవాదాయ శాఖ | | | | | | | | |
| 2 | 127 | [illegible] | మెట్ట | 0.24 | దేవాదాయ శాఖ | | | | | | | | |
| | | | | 2.28 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, రెవెన్యూ డివిజనల్ అధికారి & భూసేకరణ అధికారి డి.ఎల్ఐ.ఎస్, కల్వకుర్తి మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన ఆభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరవై) దినములలోగా రెవెన్యూ డివిజనల్ అధికారి & భూసేకరణ అధికారి డి.ఎల్.ఐ.ఎస్, కల్వకుర్తిగారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో సేకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి కార్యాలయము, కల్వకుర్తి నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గానీ జరగడం లేనందును ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

జి.ఓ.ఎమ్.ఎస్. నం.39, తేదీ: 30.06.2017 ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణను చట్టంలోని ఛాప్టర్-II & ఛాప్టర్-III అనగా సామాజిక ప్రభావిత అధ్యయనము మరియు ఆహార భద్రత నుండి భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత & హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు, 2013, (తెలంగాణ సవరణ) చట్టము 2016లోని సెక్షన్ 10(ఎ) క్రమము తెలంగాణ ప్రభుత్వం, SRVR డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు జి.ఓ.ఎమ్.ఎస్. నం.39, తేదీ: 30.06.2017 ద్వారా మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయనైనది.

సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి & భూసేకరణ అధికారి, DLIS, కల్వకుర్తి.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్
DIPR RO NO. 672/LA/PP/Advt/Pub/2024-25

ప్రజాపక్షం
గురువారం, ఫిబ్రవరి 13

# దార్శనికత లోపించిన బడ్జెట్

ఆర్థిక వ్యవస్థ "వేగంగా తిరిగి పుంజుకుంటోంది" అని ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ మంగళవారం లోక్‌సభలో 2025–26 బడ్జెట్‌పై సాధారణ చర్చకు సమాధానమిస్తూ ఉద్ఘాటించారు. ప్రపంచ అస్థిరతలు "అపారంగా" ఉన్న స్థితిలో దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న తక్షణ సవాళ్లను పరిష్కరించేందుకు బడ్జెట్ ప్రయత్నించిందని ఆమె సమర్థించారు. ఆర్థికాభివృద్ధి 6.4 శాతానికి మించకపోవచ్చన్న అంచనాల నేపథ్యంలో ప్రజల కొనుగోలు శక్తి పెంపుచేసే నిమిత్తం వారి చేతిలో డబ్బు లభ్యతను పెంచటం, కుటుంబాల సెంటిమెంటును ఉద్దీపింపజేయటం, ప్రైవేటురంగం పెట్టుబడులను ప్రోత్సహించటం, వృద్ధిని వేగవంతం చేయటం బడ్జెట్ లక్ష్యాలుగా ఆమె పునరుద్ఘాటించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో వేతనాలు పెంచలేదు. గ్రామీణ ఉపాధి హామీ పనిదినాలుగాని, కేటాయింపులుగానీ పెంచలేదు. వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ కల్పించటంపై రైతులు సంవత్సరాల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నోరుమెదపటం లేదు. అటువంటప్పుడు పట్టణ, గ్రామీణ ప్రజల చేతుల్లో ద్రవ్య లభ్యత ఎలా పెరుగుతుంది? సాధారణ, విద్యావంతుల్లో నిరుద్యోగిత పెరుగుతోంది. శ్రమదోపిడీ పెరుగుతోంది. అధిక ధరలు, విద్య, వైద్యం ఖర్చులు సామాన్యుల జేబు కత్తిరిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు సంపన్నులపై, కుబేరులపై సంపదపన్ను, కార్పొరేట్ పన్ను పెంచలేదు – కొన్ని సంవత్సరాల క్రితం బడ్జెట్ ద్వారానే ఇదే మోదీ ప్రభుత్వం సంపద పన్ను, కార్పొరేట్ పన్ను భారీగా తగ్గించింది. అదేమంటే పన్ను రేటు తక్కువగా ఉంటే చెల్లింపు పెరుగుతుందనే వాదనతో ప్రజలను మభ్యపెట్టారు. రూ.50లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో దాదాపు సగం అప్పులతో పబ్బం గడుపుతున్నారు. మోదీ పాలనలో గత నాలుగైదు ఏళ్లలోనే ప్రభుత్వ అప్పు 60–70లక్షల కోట్లు పెరిగింది. మొత్తం రూ.170లక్షల కోట్లకు చేరింది.

ట్రంప్ ఇప్పుడు నయా ఉదారవాద ఆర్థిక సిద్ధాంతాన్ని అటకెక్కించి మళ్లీ 'రక్షణవాదం' (ప్రొటెక్షనిజం) లోకి ప్రపంచాన్ని మళ్లిస్తున్నారు. ప్రపంచంలో 'అపారంగా' ఉన్న అస్థిరతల మధ్య గొప్ప బడ్జెట్ పెట్టామని చెప్పుకుంటే సరిపోదు. ఆ అస్థిరతలకు కారణాలను, కారకులను గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

ఇదంతా అభివృద్ధికి దోహదం చేస్తుందా? ప్రజల నడ్డి విరుస్తుందా? ఈ ప్రభుత్వ విధానాలు అటు సామాన్య ప్రజలను ఎండబెడుతున్నాయి, ప్రజలపై ఏటేటా రుణభారం పెంచుతున్నాయి; కొద్ది కార్పొరేట్ సంస్థలను స్వల్పకాలంలోనే అపర కుబేరులుగా తయారు చేశాయి.

బడ్జెట్ అంటే అంకెలగారడీ కాదు. ప్రభుత్వానికున్న దార్శనికత బడ్జెట్‌లో ప్రతిబింబించాలి. ఏమిటి ఈ ప్రభుత్వ దార్శనికత? ప్రజలనుండి పన్నుల ఆదాయంతో, శ్రామికుల చెమటతో నిర్మించిన ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేయటమేగా? ప్రభుత్వరంగంలో ఇదిగో ఫలానా రంగాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకునేందుకు ఏమైనా ఉందా? అంతా ప్రైవేటుమయం. వారేమన్నా డబ్బు సృష్టిస్తున్నారా? వారు అంతటి సమర్థులైతే దాదాపు రూ.18 లక్షల కోట్ల రుణాలను ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందో చెప్పగలరా? రుణం ఎగ్గొట్టిన ఏ ఒక్క పరిశ్రమ ఆస్తులనైనా స్వాధీనం చేసుకున్నారా? రెండోవైపున, సామాన్య ప్రజల రుణగ్రస్థత పెరిగింది. వారికేదీ ఉపశమనం? ప్రధాని నరేంద్రమోదీ ఎన్ని మోసకారి వాగ్దానాలు చేసినా, వాగాడంబరంతో ప్రజల చెవిలో పువ్వు పెడుతున్నా, హిందూత్వం పేరుతో ప్రజలను విభజిస్తున్నా భజనపరులు పెరగటం ఈ దేశం దౌర్భాగ్యం. 25కోట్లమందిని దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చామని డాంబికాలకు పోతున్నారు. అటువంటప్పుడు 80 కోట్లమందికి ఉచితంగా ఆహారధాన్యాలు ఎందుకు ఇస్తున్నట్లు! ఈ పథకం ఆపివేస్తే వారిలో అత్యధికులు మళ్లీ దారిద్ర్యంలోకి జారుకుంటారు. అభివృద్ధి ఫలాలను సామాన్య ప్రజలకు బదులు సంపన్నులకు అందిస్తున్నవి వార్షిక బడ్జెట్లు. ఇదంతా సరళీకరణ పేరుతో జరుగుతోంది. ట్రంప్ ఇప్పుడు నయా ఉదారవాద ఆర్థిక సిద్ధాంతాన్ని అటకెక్కించి మళ్లీ 'రక్షణవాదం' (ప్రొటెక్షనిజం)లోకి ప్రపంచాన్ని మళ్లిస్తున్నారు. ప్రపంచంలో 'అపారంగా' ఉన్న అస్థిరతల మధ్య గొప్ప బడ్జెట్ పెట్టామని చెప్పుకుంటే సరిపోదు. ఆ అస్థిరతలకు కారణాలను, కారకులను గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

# చైనా సరిహద్దుల్లో ఆగిన ట్రంప్ సుంకాల బెదిరింపు

**మతీన్ ఖలీద్**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులు, బుకాయింపులతో మెక్సికో, కెనడాలపై 25శాతం సుంకాలు విధించినప్పటికీ చైనాపై మాత్రం పది శాతం సుంకాలు మాత్రమే విధించారు. ప్రచ్ఛన్న యుద్ధం 2.0లో నిజమైన సమ ఉజ్జీ పోటీదారులు అమెరికా, చైనా మాత్రమే. ఈ రెండవదశ ప్రచ్ఛన్న యుద్ధంలో వీరిద్దరే అగ్రశ్రేణి ప్రత్యర్థులుగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో 60శాతం సుంకాలు విధిస్తానని చెబుతూ వచ్చిన ట్రంప్ కేవలం పదిశాతం మాత్రమే విధించటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి అంత పెద్ద ముప్పేమీ కాదు. అందుకు ప్రతిగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ విధించిన పది శాతం సుంకాలు కూడా అంత అమానుషమైనవేమీ కాదు. ఇటు ట్రంప్ కానీ, అటు జిన్‌పింగ్ కానీ ఆచితూచి వాణిజ్య ఎత్తుగడలు వేస్తున్నారని, తద్వారా పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధ నివారణకు తమ వంతు నియంత్రణ కృషి చేస్తున్నారని దీనిని బట్టి అర్థమవుతున్నది. చైనా పీపుల్స్ రిపబ్లిక్, హాంకాంగ్ లలో ఉన్న ఆర్థిక మార్కెట్లు ఊహించిన దానికంటే తక్కువగానే చైనా ప్రతీకార సుంకాలు ఉన్నాయి. చైనా దిగుమతి చేసుకునే 14 బిలియన్ డాలర్ల విలువైన 80 అమెరికా ఉత్పత్తులపై మాత్రమే సుంకాలు విధించింది. అదే సమయంలో అమెరికా సెర్చ్ ఇంజన్ గూగుల్ కంపెనీ సేవలను ఇప్పటికే చైనా స్తంభింపచేసింది. టారిఫ్‌ల నేపథ్యంలో చైనా చట్టాలపై విశ్వాసం లేదన్న ఆరోపణలపై ఆర్థిక భారాలు విధించకుండా గూగుల్‌పై దర్యాప్తు చేపట్టింది. యాపిల్ సంస్థ యాప్ స్టోర్ కమీషన్‌ల విధానాన్ని నియంత్రించటానికి సమీక్షకు కూడా ఆదేశించింది. అత్యంత అరుదైన భూగర్భ ఖనిజాలపై ప్రస్తుతమున్న ఎగుమతుల నియంత్రణలపై కూడా చైనా మరింత పట్టు బిగించింది. మరో రెండు అమెరికా కంపెనీలను అవిశ్వసనీయ సంస్థలుగా పేర్కొంటూ నిషిద్ధ జాబితాలో చేర్చింది. వాచాలత్వంతో మెక్సికో, కెనడాలపై తక్కువ సుంకాలు విధించిన రాజకీయ నాటకంలో ట్రంప్ ప్రపంచ స్థాయిలో వాణిజ్య యుద్ధాన్ని విస్తరించేందుకు సాహసించాలనుకోవటంలేదు. ఎందుకంటే 1960లో యూరోపియన్ యూనియన్‌తో అమెరికా చేసిన 'చికెన్ ట్రేడ్ వార్' పూర్వరంగంలో మళ్లీ అలాంటి సాహసం చేసేందుకు ట్రంప్ ఇష్టపడటం లేదని అర్థమవుతోంది. విచిత్రమైన విషయం ఏమిటంటే చైనా ప్రాచీనుడు కన్ఫ్యూషియన్ వ్యూహకర్త సన్ టీజు రాజనీతిజ్ఞులకు ఇచ్చిన సలహాల దారిలో వెళ్లకుండా ఇటు ట్రంప్ అటు జిన్‌పింగ్ ద్వైపాక్షిక వాణిజ్యంపై చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. నిజం చెప్పాలంటే అత్యుత్తమమైన యుద్ధాల్లో ఎప్పుడూ ప్రత్యక్ష పోరాటం ఉండదు. గతవారం చైనా కరెన్సీ యువాన్‌ను అధిగమించి అమెరికా డాలరు భారీగా ముందుకు దూసుకెళ్లింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి తలక్రిందులైంది. ఇది యాదృచ్ఛిక సంఘటన కాదు.

అమెరికాలో ఫెడరల్ రిజర్వు బ్యాంకు భరించగలిగే స్థాయికంటే ఎక్కువగా ద్రవ్యోల్బణం ఉంది. అదే సమయంలో చైనాలో ఆర్థిక క్షీణతకు దారితీసే పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులలో డోనాల్డ్ ట్రంప్–జీ జిన్‌పింగ్ పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధం జరగకుండా నివారించాలనే కోరుకుంటున్నారు. ఎందుకంటే చరిత్రలోకి తొంగిచూసినపుడు 2008–2014 మధ్యకాలంలో అమెరికాలో తలెత్తిన దిగ్భ్రాంతికరమైన రియల్ ఎస్టేట్ ఆస్థి సంక్షోభంతో ఆర్థికవృద్ధి, వినియోగదారుల విశ్వాసం దిగజారిపోయిన పరిణామాలు ఈ రెండు దేశాలకూ తెలుసు. ఒకప్పుడు చైనాను పరిపాలించిన ప్రముఖ నాయకుడు డెంగ్ సియావోపింగ్ ప్రపంచానికి ద్వారాలు తెరిచి సంస్కరణలు చేపట్టటంతో చైనాలో ప్రతి ఇల్లు ఒక కర్మాగారంగా మారిపోయింది. ఆ దేశంలో ఆర్థికవృద్ధి ఒక ఇతిహాసంగా చరిత్రలో నమోదైంది. అందువల్ల



అమెరికా ఆర్థిక వ్యవస్థకు 28 ట్రిలియన్ డాలర్ల మేరకు చేసే ఎగుమతులకు చైనా హాని కలిగించకోదు. టిబెట్, గ్జియాన్‌జింగ్, హాంకాంగ్, తైవాన్ ప్రాదేశిక, భౌగోళిక ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అమెరికాతో దక్షిణ చైనా సముద్రంలో నౌకాదళం పరంగా విభేదాలు కొనసాగుతున్నప్పటికీ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా అమెరికాకు తమ పదిహేను శాతం ఎగుమతుల గమ్యాన్ని పాడుచేసుకోదు. చైనా సెంట్రల్ బ్యాంక్ కూడా అమెరికా ట్రెజరీకి 780 బిలియన్ డాలరుల రుణం ఇచ్చి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ బాండ్ మార్కెట్‌ను అస్థిరపరచాలని చైనా కోరుకోదు.

చైనాలో వ్యవస్థాగతంగా ద్రవ్య అస్థిరత ఏర్పడితే అది కాంతివేగంతో ప్రపంచ మార్కెట్లకు అంటువ్యాధిలా పాకుతుందని అమెరికాకు తెలుసు. 1998లో ఆసియా కరెన్సీ విలువ పతనం సంక్షోభం ఇలాగే వ్యాపించింది. ఇప్పుడు గనుక చైనాతో పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధం చేస్తే ట్రంప్‌కే ఎదురుదెబ్బ తగులుతుంది. ఎందుకంటే అమెరికాలో మాంద్యం తలెత్తుతుంది. రెండేళ్ల తరువాత అమెరికా కాంగ్రెస్‌కు జరిగే మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ మెజార్టీ సాధిస్తుంది.

రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రపంచ దేశాలపై సుంకాల భారాలు విధించే నాయకుడిగా పేరు తెచ్చుకున్న ట్రంప్ రెండేళ్ల తరువాత అంతటి మూల్యం చెల్లించవలసి వస్తుంది. అందుకే ఆయన వాటికి సిద్ధంగా లేడు. కెనడా, మెక్సికో దేశాలు రెండూ సంప్రదాయకంగా అమెరికాకు మిత్రదేశాలు. అక్రమ వలసల బాధ తట్టుకోలేక వాటిని దండించటం కోసం 25శాతం సుంకాలు విధించి బెదిరించిన ట్రంప్ చివరకు వెనక్కి తగ్గి 30రోజులపాటు వాటిన వాయిదా వేశారు. ఈ వ్యూహాత్మకమైన రెండు పొరుగు దేశాలతో ఇప్పుడు ట్రంప్‌కు సంబంధాలు చెడిపోయాయి. మెక్సికో 'పెసో' ఇప్పుడు జర్రున జారిపోయినట్లుగా క్షీణించిపోతోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయి. ఎందుకంటే బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిన మెక్సికో ఉత్తర ప్రాంత రాష్ట్రాలలో కర్మాగారాలు నిర్మించటానికి ఇకముందు ప్రపంచ కంపెనీలు ముందుకురావు. ప్రపంచంలో అతిపెద్ద వినియోగ ఆర్థిక వ్యవస్థను అందుబాటులో ఉంచుకోవాలనేదే వాళ్ల ఉద్దేశం.

మెక్సికో ఎగుమతులను దారిమళ్లించేందుకు ఆ దేశ అధ్యక్షురాలు షీన్ బామ్ తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. ఇక్కడొక విషయం ప్రధానంగా గుర్తు చేసుకోవాలి. "నిరుపేద మెక్సికో దేశం ఆ దేవుడికి చాలాదూరంలో ఉండిపోయింది. కానీ అమెరికాకు మాత్రం చాలా దగ్గరగా ఉంది" అని మెక్సికో మాజీ అధ్యక్షుడొకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ దేశ పరిస్థితి ఇదే. సుంకాలు విధించటం ద్వారా డోనాల్డ్ ట్రంప్ మెక్సికో ప్రజలను రెచ్చగొట్టారు. సాధారణంగా మెక్సికోలో మంచులో హాకీ ఆటలాడుతారు. ఈ సందర్భంగా అమెరికా జాతీయ జెండాను ప్రదర్శించినప్పుడల్లా కెనడా ప్రేక్షకులు రెచ్చిపోయి "ఆటలో మిమ్మల్ని ఓడిస్తాం. ఛీ...ఛీ..."అంటూ వెక్కిరిస్తారు. ఇప్పుడు ట్రంప్ తన సుంకాల మోతతో కెనడా సార్వభౌమాధికారాన్ని బెదిరింపులకు గురిచేసి ఆ దేశంలో అమెరికా వ్యతిరేక సెంటిమెంటును కూడా రెచ్చగొట్టారు.

ఆల్బెర్టాలో ఉత్పత్తి చేసి అమెరికా ఉత్తరమధ్య ప్రాంతం మిడ్‌వెస్ట్‌లో శుద్ధిచేసే రోజుకు 40 లక్షల బ్యారెల్‌ల ముడిచమురుపై కూడా పదిశాతం పన్ను విధించటంవల్ల అమెరికాలో గుండెకాయ వంటి ప్రాంతాలలో గాసోలైన్ ధరలు బాగా పెరిగిపోతాయి. తక్కువ ఆదాయం గలవారిపై టాక్స్‌లు లేకుండా చూస్తామని ట్రంప్ చేసిన వాగ్దానం నుంచి చట్టబద్ధంగా ఆయన వెనుకంజ వేసినట్టు అవుతుంది. కెనడా నుంచి వచ్చే ముడిచమురు దిగుమతులకు మార్కెట్ అవకాశాలు కల్పించేంత భౌగోళిక, ప్రాదేశిక పరిస్థితులుగానీ, సాంకేతిక సామర్థ్యం గానీ వెనిజులాకు లేదు. అందువల్ల కెనడా ఇంధనంపై చేసే టారిఫ్‌ల బెదిరింపులకు ఎలాంటి అర్థం లేదు. కెనడాలో అమెరికా ఉత్పత్తులను బహిష్కరించాలన్న ఆలోచనలకు ట్రంప్ ఆజ్యం పోశారు. యూరప్, కొరియా, బోస్నియా, ఆఫ్ఘనిస్థాన్ తదితర దేశాల్లో అమెరికా సైనికులతో

అమెరికాలో ఫెడరల్ రిజర్వు బ్యాంకు భరించగలిగే స్థాయికంటే ఎక్కువగా ద్రవ్యోల్బణం ఉంది. అదే సమయంలో చైనాలో ఆర్థిక క్షీణతకు దారితీసే పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులలో డోనాల్డ్ ట్రంప్ – జీ జిన్‌పింగ్ పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధం జరగకుండా నివారించాలనే కోరుకుంటున్నారు.

పాటుగా కెనడాకుచెందిన ఎంతోమంది యువకులు అమెరికా ప్రయోజనాలకోసం రక్తం ధారబోశారు. మెక్సికో అధ్యక్షురాలు షీన్ బామ్‌ను గాని , కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోను గాని బెదిరించి మోసం చేసినట్టు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌ను గాని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ని గాని బుకాయించే ధైర్యం ట్రంప్ చేయలేరు. అదే విధంగా ఇరాన్ చమురు ఎగుమతులను అడ్డుకునేందుకు గరిష్టస్థాయిలో ఆంక్షలఒత్తిడి పెంచాలని ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయటం ఊహించదగిందే. కాని గాజాను సొంతం చేసుకునే ట్రంప్ ఆలోచన ఊహించనిది. గాజాను ఖాళీ చేయించి అక్కడి వనరులు ఆక్రమించుకునేందుకు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ట్రంప్ చెప్పారు. కానీ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ఒక బ్యారల్‌కు 75 డాలర్లుగా ఉన్నంతవరకు మధ్యఆసియా భౌగోళిక రాజకీయాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. (ఐపిఎ సర్వీస్)

# క్షీణిస్తున్న భారత్ – బంగ్లా సంబంధాలు

బంగ్లాదేశ్‌లో ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తరువాత కూడా భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలు దిగజారుతూనే ఉన్నాయి. డాక్టర్ మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఆగస్టు 8న బంగ్లాదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇరుదేశాల సంబంధాలు క్షీణిస్తూ వస్తున్నాయి. వాటి పునరుద్ధరణకు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఉన్నత శ్రేణి బృందం ఒకటి గత డిసెంబర్ 9న బంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం పరిస్థితి మెరుగవకపోగా మరింత దిగజారింది. ఇందుకు ప్రధాన కారణం భారత్‌లో తలదాచుకున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరడం, భారత గడ్డపైనుంచి బంగ్లా ఆపద్ధర్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హసీనా 'రాజకీయ కార్యకలాపాలను' అడ్డుకోవాలని కోరడం.

హసీనాను అప్పగించాలని యూనస్ ప్రభుత్వం చేసిన డిమాండ్‌కు భారత ప్రభుత్వం ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదు. దానికితోడు హసీనా తన అనుచరులను ఉద్దేశించి వీడియో సందేశం అందించేందుకు భారత్ సహకరించడంకూడా బంగ్లాదేశ్‌కు కినుక తెప్పించింది. బంగ్లాదేశ్ విడిచి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా హసీనా ఫిబ్రవరి 5న తన సందేశంలో అపద్ధర్మ బంగ్లదేశ్ ప్రభుత్వం చట్టబద్ధమైనది కాదని పేర్కొనడం యూనస్ ప్రభుత్వం ప్రతీకార చర్యలకు ప్రేరేపించింది. ప్రభుత్వ మద్దతుదారులు బంగ్లా జాతిపిత ముజిబుర్ రెహ్మాన్ చారిత్రక నివాసాన్ని, హసీనా ఇంటిని తగులబెట్టడాన్ని హసీనా ఆక్షేపించింది. ప్రభుత్వం ఈ చర్యను అడ్డుకోలేకపోయిందని హసీనా నిరసన వ్యక్తం చేసింది.

ప్రస్తుత పరిణామాల దృష్ట్యా యూనస్ ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కూల్చడానికి మన ప్రభుత్వం ఇంటా బయట హసీనాకు మద్దతు ఇస్తోందని స్పష్టమైంది. బంగ్లాదేశ్‌లో ఎపుడు ఎన్నికలు ప్రకటించినా వాటిని ఎదుర్కొనేందుకు హసీనా తన వర్గాన్ని సిద్ధం చేస్తోంది. పొరుగు దేశ పరిస్థితులను గమనిస్తున్న భారత్‌కు ఆ దేశంతో సంబంధాలు ఇప్పట్లో మెరుగయ్యే పరిస్థితి లేదని అర్థమౌతోంది. హసీనాను బహిష్కరించాలన్న యూనస్ ప్రభుత్వ డిమాండ్‌ను భారత్ ఎన్నటికీ ఆమోదించదు. బంగ్లాదేశ్‌లో పలు పార్టీలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరకోవడం నూతన పరిణామం. అయితే కొన్ని పార్టీలు తీవ్రవాద, మతవాద శక్తులతో చేతులు కలిపి భారత వ్యతిరేక భావజాలాన్ని ప్రజలలో ప్రేరేపించడం అక్కడి భారత సంతతి ప్రజలకు ముప్పుగా పరిణమించింది. ఇటువంటి పరిస్థితులలో ఇరు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొనే వాతావరణం లేదని భారత ప్రభుత్వం గ్రహించింది.

బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే ఆపద్ధర్మ ప్రభుత్వంలో చీలికలు ఏర్పడ్డాయి. బిఎన్‌పి మద్యే మార్గం అవలంబిస్తూ ఈ యేడాది చివరికి, వీలైతే అక్టోబర్ లో ఎన్నికలు నిర్వహించాలని కోరుతోంది. కోర్టు కేసులు ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు మినహా అవామీ లీగ్‌కు కూడా ఎన్నికల్లో అవకాశం కల్పించాలని సూచిస్తోంది. హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటులో పాల్గొన్న వారికికూడా అవకాశం కల్పించాలని కోరుతోంది. బిఎన్‌పి చైర్‌పర్సన్ ఖలీద జియా ప్రస్తుతం అనారోగ్యంతో బ్రిటన్‌లో వైద్య చికిత్స పొందుతోంది. త్వరలోనే కోలుకుని ఏప్రిల్‌లో స్వదేశానికి తిరిగి రానున్నట్టు సమాచారం. అప్పటినుంచి ఎన్నికల కోసం బిఎన్‌పి విస్తృతంగా ఉద్యమం చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది. బిఎన్‌పిలో కీలక పాత్ర పోషిస్తున్న ఖలీద సోదరుడు తారిక్ రహ్మాన్ లండన్‌లోని తన నివాసంనుంచే కార్యకర్తలతో వీడియో చర్చలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిఎన్‌పి కార్యకర్తలు తమ నాయకురాలు పూర్తి స్వస్థతతో స్వదేశం రాకకోసం ఎదురుచూస్తున్నారు.

మరోవైపు విద్యార్థి సంఘాలు ఖలీద రాకమునుపే తమ కొత్త పార్టీని నెలకొల్పి ఎన్నికల ఉద్యమాన్ని ఆరంభించాలని యోచిస్తున్నాయి. బిఎన్‌పికంటె ముందుగా ప్రజలలో చొచ్చుకుపోవాలని, బెంగాలీ కొత్త సంవత్సరం (ఏప్రిల్ 14)నాటికి పార్టీ స్థాపించి బిఎన్‌పిపై పైచేయి సాధించాలని భావిస్తున్నాయి. వైశాఖ మాసంలో వచ్చే బెంగాలీ నూతన సంవత్సరం రోజును శుభప్రదమైనదిగా భావిస్తారు. ఆ రోజు ఆరంభించే కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగుతాయన్నది బంగ్లాదేశీయుల నమ్మకం. అన్ని రాజకీయ పార్టీలు ఆరోజు సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నాయి. అవామీ లీగ్ కూడా సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ప్రచారాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నా, విద్యార్థి బృందాలు వారిని ఏ మేరకు అనుమతిస్తాయన్నది సందేహమే. దీనితో గుట్టుగా తమ ప్రచారాన్ని సాగించాలని అవామీ లీగ్ భావిస్తున్నది. ఏప్రిల్–మే నెలల్లో బంగ్లాదేశ్ రాజకీయ చిత్రం కొత్త రూపు దాల్చే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా బిఎన్‌పి, విద్యార్థి సంఘాల నేతృత్వంలోని కొత్త పార్టీ మధ్యే పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఇరు పార్టీలు ఎదురుపడినపుడు ఉద్రిక్తతలు చెలరేగే అవకాశాన్ని కొట్టివేయలేమన్నారు.

బంగ్లాదేశ్ పరిణామాలపై ఢాకాలోని అమెరికా దౌత్య కార్యాలయం వాషింగ్టన్ వర్గాల ఆదేశాలకోసం ఎదురు చూస్తున్నది. అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. అమెరికాకు దక్షిణాసియా ఇపుడు ప్రాధాన్యతా అంశం కాదు. అయితే చైనా బంగ్లాదేశ్‌లోని బిఎన్‌పి, విద్యార్థి సంఘాల నేతలతో సాన్నిహిత్యం నెరపుతున్నది. ఈ రెండు వర్గాలతోపాటు భారత్ వ్యతిరేక భావాలను కలిగిన జమాత్ ఇ ఇస్లామి పార్టీని కూడా ఇండియా నిశితంగా పరిశీలిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో బంగ్లాదేశ్‌లో పరిణామాలపై అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఎన్నికలు, సామాజిక పరిణామాల మధ్య బంగ్లాదేశ్‌లోని భారతీయుల సంక్షేమానికి మోదీ ట్రంప్‌నుంచి హామీ పొందాలని ఆశిస్తున్నారు. అయితే దక్షిణాసియా అంశం ఇపుడు అమెరికాకు కీలకం కాదు. బంగ్లాదేశ్‌లోని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలతో చైనా సన్నిహిత సంబంధాలు నెరపడం అమెరికాను ఆలోచనలో పడవేసింది. దీనితో ట్రంప్ చైనా కదలికపై దృష్టి సారించారని సమాచారం. బంగ్లాదేశ్‌ను ప్రభావితం చేయగల సామర్థ్యం అమెరికాకు ఉన్నదన్నది నిర్వివాదాంశం. అయితే ట్రంప్ ఈ విషయంలో ఎంతవరకు జోక్యం చేసుకుంటారన్నది ప్రశ్నార్థకం.

ఇండియాను కలవర పరుస్తున్న మరో అంశం పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ అధికారులు బంగ్లాదేశ్ అధికారులతో అంటకాగడమే. పాకిస్తాన్ సైనికాధికారులు, వారి ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ చీఫ్ బంగ్లాదేశ్‌లో పర్యటించడం భారత్‌ను ఆందోళనకు గురిచేస్తున్నది. పాక్, బంగ్లాదేశ్‌ల మధ్య సైనిక ఒప్పందాలు జరిగాయన్న సమాచారం భారత్ భద్రతకు ప్రమాద ఘంటికలు మోగించే అంశమే. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాపూరిత ఎన్నికలు జరిగినపుడే దక్షిణాసియా ప్రాంతంలో శాంతి భద్రతలు నెలకొంటాయి. ఎన్నికల తరువాత బంగ్లాదేశ్‌లో అపద్ధర్మ ప్రభుత్వం స్థానంలో స్నేహహస్తం అందించే ప్రభుత్వం ఏర్పడాలని భారత్ ఆశిస్తోంది.

# ఉన్నత విద్యావ్యవస్థలో అవినీతి పందికొక్కులు...!



డాక్టర్ ఎం.సురేష్ బాబు

ఏ దేశ అభివృద్ధిలోనైనా విద్య కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల, ఉన్నత విద్య యొక్క పరిమాణం,నాణ్యత అందించే విద్యా కార్యక్రమాల ఔచిత్యం, శ్రేష్ఠత పెంపొందించేందుకు నియంత్రణ మండలి, న్యాక్ ఎన్బిఎ లాంటి అక్రిడేషన్ సంస్థలు ప్రవేశపెట్టారు. సెల్ఫ్ ఫైనాన్స్ సంస్థలు, విద్యా సంస్థలు తమ పనితీరును నిర్దేశించిన పారామితులకు అనుగుణంగా ఆత్మపరిశీలన ద్వారా విద్య వనరులు, బోధనా పద్ధతులు నాణ్యమైన విద్య, సామాజిక సమగ్రత, శాస్త్ర సాంకేతిక రంగంలో పురోగాభివృద్ధి, వినూత్న బోధనా పద్ధతులు అందించే ప్రక్రియ ద్వారా అంచనా వేయడానికి న్యాక్ ఏర్పాటు చేయబడింది. విద్యాసంస్థలు ఇచ్చిన సమాచారంతో కూడిన సమీక్ష ప్రక్రియ ద్వారా సంస్థ తన బలాలు, బలహీనతలు అవకాశాలను తెలుసుకోవాలి. ఉన్నత విద్యా సంస్థలకు స్వయంప్రతిపత్తి కలిగిన అక్రిడిటేషన్ ఏజెన్సీ, నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఐదు సంవత్సరాల పాటు సర్టిఫికేషన్ కోసం దరఖాస్తును సమర్పించకుండా నిరోధించింది. న్యాక్ ఇన్‌స్పెక్షన్‌లో కేఎల్ కు ఏ++ గ్రేడ్ పొందడానికి లంచాలు చెల్లించారనే ఆరోపణలకు సంబంధించి సిబిఐ కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ విసి, డైరెక్టర్, వైస్ చైర్మన్ ను అదుపులోకి తీసుకున్న వారం తర్వాత ఇది జరిగింది. పీర్ బృందంలోని ఏడుగురు సభ్యులు అసెస్మెంట్లలో లేదా ఇతర న్యాక్ కార్యకలాపాలలో పాల్గొనకుండా శాశ్వతంగా నిషేధించాలని కూడా నిర్ణయించింది. అంతేకాకుండా, ఫలితాలు ఇంకా ప్రకటించబడని ఉన్నత విద్యా సంస్థలకు ఏడుగురు సభ్యులు ఇటీవల చేసిన సందర్శనలలో దేనినైనా సమీక్షిస్తారు. అటువంటి ఉన్నత విద్యా సంస్థల పరిశోధన ఫలితాలు గోప్యంగా ఉంచబడతాయి. ఫలితాలు బహిరంగంగా ప్రకటించే ముందు న్యాక్ స్టాండింగ్ కమిటీ ఒక క్లిష్టమైన మూల్యాంకనాన్ని నిర్వహించవచ్చు. గత సంవత్సరం సందర్శనలు క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే అదనపు చర్య కోసం ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ కు సమర్పించాలని న్యాక్ ఒక ప్రకటనలో పేర్కొంది. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులు అనుగుణంగా, న్యాక్ 2025 ఏప్రిల్ మే లో ప్రాథమిక అక్రిడిటేషన్ ను ప్రారంభిస్తుంది. దీని తర్వాత మెచ్యూరిటీ ఆధారిత గ్రేడెడ్ లెవల్స్ ఉంటాయి. దేశ ఉన్నత విద్యా వ్యవస్థలో జరిగిన భారీ అవినీతి బయటపడింది. ఉన్నత విద్యా సంస్థలకు ఇచ్చే నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ అనుకూల గ్రేడ్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేయడం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే డబ్బులు తీసుకుని నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వంటి ఘటనలు మరవకముందే మళ్లీ నాక్ గ్రేడ్ కోసం కోట్ల రూపాయల డబ్బులను డిమాండ్ చేయడం బయటపడింది. జెఎన్యూ ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా కెయల్ యూనివర్సిటీకి నాక్ తనిఖీ నివేదికను తారుమారు చేయడానికి క్యాంపస్‌లోని తన నివాసంలో లంచంకోసం చర్చలు జరిపారు. అనుకూలమైన అక్రిడిటేషన్ గ్రేడ్ ఇవ్వడానికి నాక్ బృందం సభ్యులు కెఎల్ఈఎఫ్ నుంచి రూ.1.8కోట్లు డిమాండ్ చేశారు. చర్చల తర్వాత, రూ.28లక్షలకు ఒప్పందం ముగిసింది. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా ప్రధాన వాటాను సొంతం చేసుకున్నారు. సిబిఐ సోదాలు నిర్వహించి కేసు నమోదు చేసింది. ప్రొఫెసర్ సిజారియాతో సహా మొత్తం పదిమందిని దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. అనుకూల గ్రేడ్ల మంజూరు కోసం లంచం ఇవ్వడం, తీసుకోవడం దారుణం. బిజెపి, ఆర్ఎస్ఎస్ పాలనలో పెంచి పోషించిన అవినీతి వ్యవస్థ ప్రత్యక్ష ఫలితమే ఈ ఉదంతం.

ప్రొఫెసర్ సిజారియాతో సహా మొత్తం పది మందిని దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. అనుకూల గ్రేడ్ల మంజూరు కోసం లంచం ఇవ్వడం, తీసుకోవడం దారుణం. బిజెపి, ఆర్ఎస్ఎస్ పాలనలో పెంచి పోషించిన అవినీతి వ్యవస్థ ప్రత్యక్ష ఫలితమే ఈ ఉదంతం. అర్హత లేని పార్టీ విధేయులు ఉన్నత విద్యా సంస్థల్లో కీలకమైన స్థానాల్లో ఉన్నారు, సంస్థలను మోసంచేసే పక్షపాత కేంద్రాలుగా మారుస్తున్నారు. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా చాలాకాలంగా ఆర్ఎస్ఎస్, ఎబివిపి వ్యక్తి. ప్రస్తుత యుజిసి చైర్మెన్, ఆయన్ను మాజీ వైస్ ఛాన్సలర్ మామిడాల జగదీశ్ కుమార్ వ్యక్తిగతంగా నియమించుకున్నారు.

అర్హత లేని పార్టీ విధేయులు ఉన్నత విద్యా సంస్థల్లో కీలకమైన స్థానాల్లో ఉన్నారు, సంస్థలను మోసం, పక్షపాత కేంద్రాలుగా మారుస్తున్నారు. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా చాలాకాలంగా ఆర్ఎస్ఎస్, ఎబివిపి వ్యక్తి. ప్రస్తుత యుజిసి చైర్మెన్, జెఎన్యూ మాజీ వైస్ ఛాన్సలర్ మామిడాల జగదీశ్ కుమార్ ఆయన్ను వ్యక్తిగతంగా నియమించుకున్నారు. విద్యారంగంలో అకస్మాత్తుగా ఎదగడానికి ముందు, సిజారియా కిర్లోస్కర్ జనరేటర్లకు సేల్స్‌మేన్‌గా ఉన్నాడు. తర్వాత ప్రయివేట్ బిజినెస్ స్కూల్‌లో చేరాడు. 2020లో మామిడాల జగదీష్ కుమార్ ఆయనను జెఎన్యులో ఫ్యాకల్టీ సభ్యుడిగా నియమించారు. 2023నాటికి ప్రస్తుత విసి శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ ఆధ్వర్యంలో డీన్ పదవికి ఎదిగాడు. ఆయన విద్యాపరమైన ప్రతిభ ఆధారంగా కాకుండా రాజకీయ ప్రోత్సాహం ఆధారంగా ఎదిగారు. ఆయన 2016లో యుపిలో ని మీరట్‌లో ఎబివిపి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. మామిడాల జగదీశ్ కుమార్.. సిజారియాకు జేఎన్యూలో పదోన్నతి కల్పించడమే కాకుండా బిహెచ్యూ కోర్టు, ఎఐసిటిఇ సలహా కమిటీ, నిట్, ఐఐఈఎస్టీ శిబ్పూర్, ముఖ్యంగా నాక్‌లో కూడా పదవులు పొందారు. ఆయన ఇప్పుడు అవినీతి సామ్రాజ్యాన్ని నియమించుకున్నాడు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ విద్యా సంస్థలలోకి చొరబడిందని అని చెప్పడానికి చక్కని తార్కాణం. ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఇచ్చే సమయంలో యుజిసి కొన్ని కఠిన నిర్ణయాలు తూచా తప్పకుండా పాటించాలి, లేనిచో ఇంకోసారి ఆ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు రద్దు చేస్తారు. కానీ ఇలాంటి ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడు ప్రో వైస్ ఛాన్సలర్, ఛాన్సలర్, బోర్డు మెంబర్‌లు అందరు గతంలో యుజిసి లోను/ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత పదవులు వెలగబెట్టిన వారే. ప్రైవేటు విశ్వవిద్యాలయాల వెబ్సైట్ పరిశీలిస్తే ప్రతి ప్రైవేటు విశ్వవిద్యాలయంలో యుజిసి, ఎఐసిటిఇ, న్యాక్, ఎన్బిఎ లో డైరెక్టర్లు, సలహాదారులు, పేరెన్నిక కలిగిన విశ్వవిద్యాలయాలలో ఉపకులపతిగా పనిచేసినవారు ఉంటున్నారు. వీరందరూ రిటైర్ అయిన తరువాత తమ కుటుంబంతో గడుపుతుంటారు తప్ప అక్కడకు వెళ్ళేది కేవలం రెండు నెలలకు ఒకసారి. వీరంతా మా బలమని ఈ విశ్వవిద్యాలయాలు విర్రవీగుతుంటాయి. వారికైతే ప్రభుత్వ మరియు యుజిసి వివిధ విభాగాలలో పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి నందిని పందిగా సులభంగా మార్చవచ్చు. కంచె చేను మేస్తే కాపు ఏమి చేయగలరు.ఇటువంటి అనైతిక పద్ధతులు మన ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క సమగ్రతను దెబ్బతీస్తాయి. ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి విద్యానైపుణ్యం ప్రమాణాలు నిలబెట్టడానికి త్వరిత నిర్ణయాత్మక చర్య అవసరం.

# మానవాళికి అమూల్య సేవలుఅందిస్తున్న రేడియో



ప్రపంచ మానవాళికి ఆత్మీయనేస్తంగా గత 130 ఏండ్ల నుంచి సమాచార వినోద విజ్ఞాన క్రీడా సమకాలీన వార్తలను ఇంటింటికి చేర్చుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణంగా రేడియో అమూల్య సేవలను అందిస్తున్నది. టెలివిజన్, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ రాకతో రేడియో వినియోగం కొంత తగ్గినా, నేటికీ మారుమూల మానవాళి మనసులను సహితం దోస్తున్న ఉపకరణం రేడియో మాత్రమే. నమ్మకానికి పెట్టింది పేరు మన రేడియో. సాపేక్షకంగా చవకైన సాధనంగా రేడియో ప్రపంచ వార్తలను క్షణాల్లో అందిస్తూ, సహజ/మానవ తప్పిద విపత్తు ల సమయంలో ప్రజలకు విలువైన సమాచారాన్ని అందిస్తున్న రేడియో ప్రాధాన్యం ఎన్నటికీ చెక్కుచెదరదు. వాహన ప్రయాణ సమయాల్లో మనందరికీ ఉపయోగకరమైన రేడి యో మన నిత్య స్నేహితుడిగా వ్యవహరిస్తున్నది.ప్రపంచ మానవాళినా ఉక్కిరిబిక్కిరి చేస్తు న్న వాతావరణ ప్రతుల మార్పులను ప్రజల చెత్తకు చేర్చుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వాతావరణ స్థాపన, పౌర సమాజ పాత్రను సహితం వివరించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో రేడియో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న వేళ ప్రపంచ రేడియో దినం2025 ఇతివృత్తంగా రేడియో వాతావరణ మార్పులు : వాతావరణ కార్యాచరణకు శక్తివంతమైన సాధనం అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రపం చ రేడియో దినం వేదికగా కార్యశాలలు, వెబినార్లు, సదస్సులు, చర్చలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలి. నేటి ఆధునిక డిజిటల్ ఎఐ యుగంలో కూడా రేడియో అవసర మార్పులు చేసుకుంటూ మానవాళి ప్రియ విశ్వాసనేస్తంగా రేడియో సేవలు అందిస్తున్న వేళ అందరికీ ప్రపంచ రేడియో దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుకుందాం, రేడియో ప్రసారాలతో ప్రయోజనం పొందుదాం.

డా బిఎం. రెడ్డి, 9949700037

# ఏకమైన రైతు సంఘాలు

## సమావేశమైన కెఎంఎం, ఎస్‌కెఎం



**ఛండీగఢ్ :** రైతుల సమస్యలపై పోరాడుతున్న కిసాన్ మజ్దూర్ మోర్చా(కెఎంఎం), సంయుక్త కిసాన్ మోర్చా బుధవారం సమావేశమై వివిధ సంఘాల ఐక్యతపై చర్చించాయి. ఈ అంశంపై ఒక అడుగు ముందుకు వేశామని కెఎంఎం నాయకులు వెల్లడించారు. కెఎంఎం నాయకుడు సర్వన్ సింగ్ పాంధర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే నాన్ పొలిటికల్ విభాగమైన ఎస్‌కెఎం ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఖనౌరి సరిహద్దువద్ద తమ నాయకత్వం నిర్వహిస్తున్న 'కిసాన్ మహాపంచాయత్' కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఈ సమావేశానికి హాజరు కావడం లేదని సంఘం నాయకులు తెలిపారు. ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కెఎంఎం పంజాబ్, హర్యానా సరిహద్దుల వద్దనున్న షంభు, కనౌరి ప్రాంతాలలో రైతు సమస్యలపై ఆందోళను నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా కనీస మద్దతు ధరపై రైతు సంఘాలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. బిజెపి ప్రభుత్వంపై సంయుక్తంగా పోరాడేందుకు ఎస్‌కెఎం ఈ సమావేశానికి చొరవ తీసుకుంది. జనవరి 13, 18 తేదీలలో ఎస్‌కెఎం, ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్) సంఘాల మధ్య ఐక్య పోరాటంపై రెండుసార్లు చర్చలు జరిగాయి. అయితే ఇరు సంఘాల మధ్య విభేదాల కారణంగా ఆ సమావేశాలు విఫలమయ్యాయి.

బుధవారంనాటి సమావేశంపై ఎస్‌కెఎం నేత జోగిందర్ సిగ్ ఉగ్రహాన్ మాట్లాడుతూ ఐక్యతపై ఇరు సంఘాలమధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయన్నారు. తదుపరి సమావేశంలో ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్) సంఘంతో సంప్రతించి చర్చలు జరుపాతమన్నారు. ఎస్‌కెం, ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కెఎంఎంల మధ్య ఐక్యతపై ఒక తుది రూపును తీసుకువస్తామన్నారు. కేంద్రంతో రైతు సమస్యలపై పోరాటంపై ఉగ్రహాన్, ఇతర సీనియర్ ఎస్‌కెఎం నాయకులు మాట్లాడుతూ ఇది సుదీర్ఘ పోరాటమని, అందుకు రైతు సంఘాలు సంఘటితం కావాల్సి ఉందన్నారు. ఐక్యతపై సుదీర్ఘంగా చర్చించామని, ఇందుకు తుది రూపం తీసుకువచ్చామని పాంధర్ అన్నారు. మహా పంచాయత్ కార్యక్రమం వల్ల ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్) ఈ సమావేశానికి హాజరు కాలేకపోయిందన్నారు. వారితో మాట్లాడామని, తదుపరి సమావేశాలను త్వరలో నిర్వహిస్తామన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్యత ఎంతో ఆవశ్యకమని, కేంద్రం కొత్త వ్యవసాయ విధానాలపై ఐక్యంగా పోరాడి విజయం సాధించామని, మరోసారి అటువంటి ఐక్యతే అవసరమన్నారు. గత పోరాటాలనుంచి నేర్చుకున్న పాఠాలపై చర్చించామన్నారు. కేంద్రం నూతన వ్యవసాయ విధానాలపై తాము రూపొందించిన 12 అంశాల చా ర్టర్‌ను ఎస్‌కెఎం( నాన్ పొలిటికల్), కెఎంఎం సంఘా లు మద్దతు పలకాలని కోరారు. ఫిబ్రవరి 14న ఛండీగఢ్‌లో సమావేశానికి రావాలని కేంద్రం ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కెఎంఎం సంఘాలను ఆహ్వానించింది. ఈ సమావేశంలో సానుకూల నిర్ణయాలు వెలువడతాయన్న ఆశాభావంతో నాయకులు ఉన్నారు.

**గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన బలదేవ్ సిర్సా**

సీనియర్ రైతు నాయకుడు బలదేవ్ సిర్సాను గుండె సంబంధ సమస్యతో పాటియాలోని అస్పత్రిలో చేర్పించారు. కనౌరి సరిహద్దువద్ద నిరసన సందర్భంగా స్వల్ప గుండెపోటుకు గురైనా బలదేవ్‌ను వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. గత కొద్ది కాలంగా కనౌరిలో నిర్వహిస్తున్న ఆందోళనలో సిర్సా పాల్గొంటున్నట్టు సీనియర్ నాయకులు వెల్లడించారు. బుధవారం ఉందయం ఆయన హఠాత్తుగా అస్వస్థతకు గురవడంతో పాటియాలలోని రాజింద్ర ఆస్పత్రికి తరలించారు. ఆందోళనలో పాల్గొంటున్న సిర్సా ఆరోగ్యం బాగోలేదని చెప్పగానే అక్కడే ఉన్న వైద్య బృందం ఆయనను పరీక్షించి రక్తపోటు తక్కువగా ఉందని తెలుపడంతో వెంటనే ఆస్పత్రికి తరలించామని రైతు నాయకులు తెలిపారు.

# అమానవీయ గెంటివేతపై ప్రశ్నించాలి

## ప్రధానికి ప్రతిపక్ష నాయకుడు ఖర్గే సూచన



**న్యూఢిల్లీ :** అమెరికానుంచి భారతీయ వలసదారులను అమానవీయంగా గెంటివేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రశ్నించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గె ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. అమెరికాలో చట్ట విరుద్ధంగా నివసిస్తున్న భారతీయులను సంకెళ్లతో కార్గో విమానంలో భారత దేశానికి తీసుకు రావడం శోచనీయమని, తన చిరకాల స్నేహితుడిగా పేర్కొనే ట్రంప్‌ను మోదీ ఈ విషయమై అడగాలని అన్నారు. మోదీ రెండు రోజుల పర్యటనలో గురువారం ట్రంప్‌తో భేటీ కానున్న నేపథ్యంలో ఖర్గె ఈ సూచన చేశారు. కలబురగిలో విలేకరులతో మాట్లాడుతూ వాస్తవానికి మోదీకి అమెరికానుంచి ఆహ్వానం లేదని, అయితే విదేశీ వ్యవహారాల మంత్రి అమెరికా దౌత్య కార్యాలయంతో మాట్లాడి ఇరు దేశాల నేతల సమావేశం ఏర్పాటు చేశారని ఖర్గె వెల్లడించారు. ఈ సమావేశం ఎంతవరకు సత్ఫలితాలినిస్తుందన్నది అనుమానమేనన్నారు. మోదీ ట్రంప్‌ను తన సన్నిహిత మిత్రునిగా చెపుతుంటారని, అదే నిజమైతే వారి సమావేశం సందర్భంగా భారతీయులను అమానుషంగా గెంటివేయడంపై వివరణ కోరాలన్నారు. గెంటివేతకు గురైన భారతీయులను సాధారణ విమానంలో కానీ, లేదా భారత్ ప్రత్యేక విమానంలో కానీ తీసుకురాలేదని, ఈ వారిని కార్గో విమానంలో వ్యర్థ పదార్థాలవలె తీసుకువచ్చారని ఖర్గె విమర్శించారు. ఇరు దేశాల స్నేహ సంబంధాలు కొనసాగడం అవసరమేనని, అయితే వలసదారుల విషయంలో అమెరికా ప్రవర్తనను ఆమోదించలేమన్నారు. భారత వలసదారులను గెంటివేసిన విధానంలో ప్రభుత్వం ఫిబ్రవరి 7న తమ నిరసనను తెలియజేసింది. భవిష్యత్తులో ఇటువంటి జరుగకుండా చూడాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరింది. విదేశీ వస్తువులపై అమెరికా పన్నును పెంచడంపై, అమెరికా వస్తువులపై పన్ను పెంచడంపై ఇతర దేశాలను ట్రంప్ హెచ్చరించడాన్ని కూడా ఖర్గె తప్పుపట్టారు.

**ట్రంప్‌తో రెండు 'టి'లపై చర్చించాలి**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ రెండు 'టి'లను చర్చించాలని ఖర్గె సూచించారు. ఒకటి టారిఫ్, రెండోది అమానవీయ గెంటివేత(ట్రౌమాటిక్ డిపోర్టేషన్) అని ఖర్గె అన్నారు. 'రెండు దేశాల నేతలు గురువారం భేటీ కానున్నారు. ఈ సందర్భంగా భారతీయులను కలవలరపరుస్తున్న రెండు అంశాలను మోదీ ప్రస్తావించాలి. మొదటిది, విదేశీ వస్తువులపై అమెరికా పన్ను పెంపు. ముఖ్యంగా స్టీల్, అల్యూమినియంపై 25 శాతం పన్ను పెంచారు. ఇది భారత ఉత్పత్తులకు పెద్ద దెబ్బ. ఇరు దేశాలకు ప్రయోజనకరమైన రీతిలో పన్ను విధానం ఉండాలి. అమెరికా మనకున్న పెద్ద వర్తక భాగస్వామి. పన్నులు ఏకపక్షంగా పెంచడం మన ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది' అన్నారు. ఇక వలసదారులను సంకెళ్లతో భారత్‌కు తిరిగి పంపించడంపై కూడా ఖర్గె అసంతృప్తి వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగించేందుకు ఇటువంటి అంశాలలో సున్నితంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఇరు దేశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

# 'నేడు' పార్లమెంటులో కొత్త ఇన్‌కంటాక్స్ బిల్లు!

• ఇక అందరికీ అర్థమయ్యేలా పరిభాషలో మార్పులు • స్థాయీ సంఘంలో చర్చించాకే చట్టరూపం • వచ్చే ఏడాది నుండీ అమలులోకి కొత్త చట్టం




**న్యూఢిల్లీ :** కొత్త ఆదాయపన్ను బిల్లు–2025 ను గురువారంనాడు పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లు ఆమోదం పొందగానే 60 ఏళ్ళక్రితం నాటి ఆదాయపన్ను చట్టం ఇక కాలగర్భంలోకి వెళుతుంది. ఇప్పటివరకూ ఈ చట్టంలో కొనసాగుతున్న సంక్లిష్టతను తొలగించి అందరికీ అర్థమయ్యేలా కొత్త పారిభాషిక పదాలు ఈ బిల్లులో చేర్చినట్లు ముసాయిదా బిల్లు ద్వారా తెలుస్తున్నది. ఆర్థిక వ్యవస్థ విస్తృతితోపాటు ఇప్పటివరకూ ఉన్న ఆదాయపన్ను చట్టం పనితీరు, దానిలో సంక్లిష్టతలపై వేలాది ఫిర్యాదులు రావడంతో ఆదాయం పన్ను చట్టాన్ని సరళీకరించాలనే ఉద్దేశంతో కొత్త చట్టాన్ని తెస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించారు. అందుకు అనుగుణంగా కొత్త ఆదాయపన్నుబిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. బిల్లును పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టాక చర్చలు, సమీక్ష నిమిత్తం స్థాయీసంఘానికి పంపిస్తారు. స్థాయీసంఘం ఆమోదించాక పార్లమెంటు ఆమోదం పొందితే 2026 ఏప్రిల్ 1వ తేదీ నుండి బిల్లు చట్టరూపం ధరించి అమలులోకి వస్తుంది. ఆదాయపన్నులో మార్పులు, సంక్లిష్టత తొలగింపునకు చాలాకాలంగా అందరూ ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఏడాదిలో సంపాదన ఎంతో తేలిన తర్వాత కొత్త ఏడాది మార్చి 31 లోపు అందరూ ఆదాయ పన్ను చెల్లిస్తారు. సంపాదించిన ఏడాది కాలాన్ని కొత్త బిల్లు ప్రకారం ప్రీవియస్ ఇయర్‌గా పరిగణిస్తారు. 622 పేజీలతో కూడిన ఈ కొత్త బిల్లులో536 సెక్షన్లు ఉంటాయి. ప్రస్తుత ఆదాయపన్ను చట్టంలో కంటే కొత్త ఆదాయపన్ను బిల్లు–2025లో సెక్షన్లు ఎక్కువగా ఉన్నప్పటికీ గతంకంటే పేజీల సంఖ్య తగ్గింది. పేజీలు తగ్గి సెక్షన్ల సంఖ్య పెరిగింది. కొత్త బిల్లులోనూ, పాత చట్టంలోనూ అధ్యాయాల సంఖ్య మారకుండా 23 గానే ఉంది. 1961లో ఐ.టి బిల్లు ఆమోదం పొంది చట్టరూపం దాల్చినప్పుడు కేవలం 880 పేజీలే ఉండగా ఈ 60 ఏళ్ళలో సవరణలమీద సవరణలు చేసుకుంటూ గణనీయంగా పేజీలసంఖ్య పెరిగి ఈ చట్టం వినియోగదార్లకు సంక్లిష్టమై తలనొప్పిగా మారింది. ఇప్పుడు కొత్తబిల్లు–2025లో పేజీల సంఖ్య అంతకంటే తక్కువగా 622గానే ఉన్నప్పటికీ కాలగమనంలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఈ చట్టాన్ని మార్చాలని ఆదాయపన్ను వినియోగదారుల నుండి 6,500కుపైగా ఫిర్యాదులు, సలహాలు రావడంతో ప్రభుత్వం కొత్తచట్టానికి రూపకల్పన చేసింది.

# మాఘ పూర్ణిమ.... పోటెత్తిన యాత్రికులు



**ప్రయాగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్‌లో ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కన్నుల పండువగా కొనసాగుతోంది. దేశ విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. కుంభమేళాలో మరో పుణ్య ఘట్టమైన మాఘ పూర్ణిమ వేళ బుధవారం సాయంత్రం 5 గంటల వరకు త్రివేణీ సంగమం, ఇతర ఘాట్‌ల వద్ద దాదాపు 2 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో మరింత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్టు కుంభ్‌మేళా డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు. ఈ మాఘ పూర్ణిమ స్నానంతో తమ నెలరోజుల కల్పవాసీ దీక్ష ముగించుకొని దాదాపు 10 లక్షల మంది మహా కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో వారంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని , పార్కింగ్ స్థలాలను మాత్రమే వినియోగించాలని అధికారులు కల్పవాసీలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు భక్తులపై హెలికాప్టర్ నుంచి పూలవర్షం కురిపించారు. లఖ్‌నవూ లోని తన అధికారిక నివాసం నుంచి సీఎం యోగి ఆదిత్యనాథ్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వార్‌రూమ్‌లో సీఎంతోపాటు డీజీపీ ప్రశాంత్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ ప్రసాద్, సీఎం కార్యాలయం అధికారులు ఉన్నారు. మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన సతీమణితో కలిసి త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ప్రయాగ్‌రాజ్‌కు మంగళవారమే వారు చేరుకున్నారు. సాధారణ యాత్రికుడిగా పడవపై సంగమం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. మరోవైపు ఫిబ్రవరి 11 వరకు మొత్తం 46.25 కోట్ల మంది భక్తులు మహా కుంభ్‌కు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించినట్టు అధికారులు తెలిపారు.

# గ్రీస్ అధ్యక్షుడుగా టసౌలాస్ ఎన్నిక

**ఏథెన్స్:** ఆగ్నేయ యూరోపియన్ దేశం గ్రీస్ కొత్త అధ్యక్షుడుగా కాన్స్టాంటైన్ టసౌలాస్ (66) ఎన్నికయ్యారు. ఆయన న్యాయవాది, 2000 సంవత్సరం నుండి గ్రీస్ చట్టసభ సభ్యుడుగా కొనసాగుతూ స్పీకర్ పదవి నిర్వహించారు. గ్రీస్ పార్లమెంటులో బుధవారంనాడు ఓటింగ్ జరిగింది. 300 మంది సభ్యులున్న పార్లమెంటులో 160 మంది ఎంపీలు ఆయనకు మద్దతుగా ఓటు వేశారు. సరిగ్గా నెలరోజుల తర్వాత వచ్చేనెల 13 తేదీన ఆయన ప్రెసిడెంట్ ఆఫ్ హెలెనిక్ రిపబ్లిక్ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరిస్తారు. గ్రీస్ పార్లమెంటుకు ఆయన స్పీకర్‌గా పనిచేశారు. పార్లమెంటు ఆయననే దేశాధ్యక్షుడుగా ఎన్నుకుంది. పార్లమెంటులో ఓటింగ్ అనంతరం గ్రీస్ ప్రధాన మంత్రి కైరియాకోస్ మిట్సోటకిస్, ఆయన పక్ష చట్టసభ సభ్యులు ఆయన గెలుపును ఆహ్వానిస్తూ పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. ఐతే అదేసమయంలో ఏథెన్స్‌లో పార్లమెంటు వెలుపల భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడి నిరసన ప్రదర్శన జరిపారు. గ్రీస్‌లో జరిగిన ఘోరాతిఘోరమైన రైలు ప్రమాదంపై పార్లమెంటుగానీ, చట్టసభ సభ్యులుగానీ ఏ మాత్రం పట్టించుకోలేదనీ, కుటుంబాలకు న్యాయం చేసేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని నిరసన ప్రదర్శకులు నినాదాలు చేశారు.

# సిక్కుల ఊచకోత కేసులో.. దోషిగా కాంగ్రెస్ మాజీ ఎంపి



**జబల్‌పూర్/మైహర్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి సజ్జన్ కుమార్‌ను రౌస్ అవెన్యూ కోర్టు దోషిగా తేల్చింది. 1984 నవంబర్ 1న సరస్వతి విహార్ ప్రాంతంలో తండ్రీకొడుకుల హత్య కేసులో ఆయన ప్రమేయం ఉన్నట్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా బుధవారంనాడు తీర్పునిచ్చారు. శిక్షపై వాదనలు వినేందుకు కేసును ఫిబ్రవరి 19వ తేదీకి వాయిదా వేశారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన మరో సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ప్రస్తుతం సజ్జన్ కుమార్ యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. తీర్పు సందర్భంగా సజ్జన్ కుమార్‌ను తీహార్ జైలు నుంచి బుధవారంనాడు కోర్టు ముందు హాజరుపరిచారు. 1984 నవంబర్ 1న జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్ దీప్ సింగ్ హత్య కేసులో కోర్టు ఆయనను దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్యానంతరం ఒక పెద్ద గంపు మారణాయుధాలతో విరుచుకుపడింది. సిక్కులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున లూటీలు, గృహదహనాలకు పాల్పడింది. అల్లరిమూక సింగ్, ఆయన కుమారుడిని హత్య చేసి ఇల్లు లూటీ చేసిందని, ఆ తర్వాత ఇంటికి నిప్పుపెట్టిందని ప్రాసిక్యూషన్ పేర్కొంది. సజ్జన్ కుమార్ కేవలం ఈ అల్లర్లలో పాల్గొనడమే కాకుండా ఆ గుంపునకు నాయకత్వం వహించాడని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు తగిన సాక్ష్యాలు లభించాయని తెలిపింది. కాగా, సజ్జన్ కుమార్‌ను దోషిగా కోర్టు ప్రకటించడాన్ని ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజిమెంట్ కమిటీ (జిఎస్‌జిఎంసి) ప్రధాన కార్యదర్శి జగ్‌దీప్ సింగ్ కహ్లోన్ స్వాగతించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా సిట్‌ను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూసేసిన కేసులను తిరిగి ఇన్వెస్టిగేట్ చేయడం వల్ల ఈ ఫలితం వచ్చిందని, జగ్‌దీష్ టైట్లర్ల విషయంలోనూ న్యాయం జరుగుతుందని తాము ఆశిస్తున్నామని చెప్పారు. 1984 సిక్కు అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారిస్తూ 2018లో తీర్పు వెలువడింది. ఆయనకు యావజ్జీవ జైలుశిక్ష పడింది.

# ఇసి నియామకాల పిటిషన్‌పై 19న విచారణ




**న్యూఢిల్లీ :** నూతన చట్టం కింద భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) కమిషనర్ల (ఇసిల)నియామకానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 19వ తేదీని ఖరారు చేసింది. ఎన్‌జిఒ తరపు పిటిషన్‌పై ప్రాతినిధ్యం వహించిన అడ్వకేట్ ప్రశాంత్‌భూషణ్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అంతకుముందు ఈ పిటిషన్ల విచారణను ఈరోజు (బుధవారం) షెడ్యూల్ చేసినప్పటికీ, అత్యున్నతన్యాయస్థానం ఫిబ్రవరి 19వ తేదీన ఈ కేసు విచారణ చేపట్టేందుకు నిర్ణయించింది. ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ పిటిషన్ విచారణను త్వరగా చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితి గురించి ధర్మాసనానికి వివరించారు. ఫిబ్రవరి 18న చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ పదవీవిరమణ చేయవలసి ఉన్న కారణంగా 2023చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ నేపథ్యంలో ప్రభుత్వం నూతన సిఇసిని నియమించవచ్చని ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి తెలియజేశారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ 'మేం ఈ అంశంపై విచారణజరిపేందుకు ఫిబ్రవరి 19వ తేదీని ఖరారు చేస్తున్నాం. ఈ స్వల్ప విరామంలో ఏదైనా జరిగితే పరిణామాలు అనుసరించాల్సిఉంటుంది' అని స్పష్టం చేసింది. అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ 'డెమొక్రటిక్ రిఫార్మ్స్'అనే ఎన్‌జిఒ అసోసియేషన్ తరపు పిటిషన్‌కు ప్రాతినిధ్యం వహించారు. అత్యున్నత న్యాయస్థానం రిజిస్ట్రీ జస్టిస్ సూర్యకాంత్ అనారోగ్యంతో ఉన్నారనే విషయాన్ని తెలియజేసిందని, ఈ అంశంపై విచారణ తేదీని ఫిబ్రవరి 19కి వాయిదా వేసినట్లు వెల్లడించిందన్నారు. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను ఫిబ్రవరి 19న విచారణ చేపడతామన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన అత్యున్నత న్యాయస్థానం ఈ అంశంపై విచారణను బుధవారం నాటికి (ఫిబ్రవరి 12)ను నిర్ణయించారు. కాగా ఈ అంశానికి సంబంధించిన విచారణను మెరిట్, ఫైనల్‌పై ఫిబ్రవరి 19వ తేదీని ఖరారు చేస్తున్నట్లు ధర్మాసనం తెలియజేసింది. 2023తీర్పు వెల్లడించిన ప్రకారం ఎన్నికల కమిషనర్ల నియామక ఎంపిక ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఇండిపెండెంట్ ప్యానెల్ చేస్తుందని ప్రశాంత్‌భూషణ్ గతంలో సుప్రీంకోర్టుకు అందజేసిన సమర్పణలో తెలియజేశారు. వారు భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించేలా ఒక చట్టం తీసుకువచ్చి, ఒక మంత్రిని తీసుకువచ్చారు. కమిషనర్ల నియామకాన్ని ప్రభుత్వం ఇష్టానికి అనుగుణంగా చేసుకునే అవకాశం కల్పించుకున్నారు. ఎన్నికల కమిషనర్లను నియమించేందుకు ఒక ఇండిపెండెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రశాంత్ భూషణ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పిటినర్ జయఠాకూర్ తరపున అడ్వకేట్ వరుణ్‌ఠాకూర్ హాజరయ్యారు. కొత్త చట్టం ప్రకారం 2024లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షత వహించిన సెలెక్షన్ కమిటీ మాజీ ఐఎఎస్ అధికారులు జ్ఞానేష్‌కుమార్, సుఖ్‌బీర్ సంధులను ఎలక్షన్ కమిషనర్లుగా నియమించేందుకు సిఫారసు చేశారు.

# విదేశాలకు వెళ్లి తిరిగి రాకుంటే...?

## ఇంద్రాణీ ముఖర్జీ అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలంటూ షీనా బోరా హత్య కేసులో కీలక నిందితురాలు ఇంద్రాణీ ముఖర్జీ చేసిన అభ్యర్థనను సుప్రీం కోర్టు బుధవా రంనాడు తోసిపుచ్చింది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరా కరిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను న్యాయమూర్తులు ఎంఎం సుందరేశన్, రాజేష్ బిందాల్‌లో కుడిన సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఏడాదిలోగా కేసు విచారణను పూర్తి చేయాలని విచారణ కోర్టును ఆదేశించింది. మీరు విదేశాల నుంచి తిరిగి వస్తారనే గ్యారెంటీ లేదు. కేసు విచారణ తుది దశకు చేరుకుంది. ఈ దశలో మీ అభ్యర్థనను పరిశీలించలేం. విచారణను వేగవంతం చేసి ఏడాదిలోగా పూర్తి చేయాలని విచారణ కోర్టును ఆదేశి స్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. ఇంద్రాణి ముఖర్జీ ట్రయిల్ కోర్టుకు వెళ్లేం దుకు కూడా సుప్రీం ధర్మాసనం అనుమతించింది. దీనికి మందు, ముఖర్జీ విదేశాలకు వెళ్లేందుకు చేసుకున్న అభ్యర్థనను సిబిఐ తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. ఇది సున్నితమైన కేసు అని, విచారణ సగానికి పైగా పూర్తయిందని, 96 మంది సాక్ష్యులను విచారించామని కోర్టుకు తెలిపారు. ముఖర్జీ తరఫు న్యాయవాది వాదన వినిపిస్తూ, సుప్రీంకోర్టు ఆమెకు బెయిలు ఇచ్చిందని, అయితే ఈ కేసులో ఇంకా 92 మంది సాక్ష్యులను విచారించాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. నాలుగు నెలలుగా ట్రయిల్ కోర్టు చేసిందేమీ లేనందున విచారణ మరింత జాప్యం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంద్రాణి ముఖర్జీ స్పెయిన్, యుకెపర్యటనకు ప్రత్యేక కోర్టు గత జూలై 19న అనుమతి ఇచ్చింది. అయితే, దీనిపై సిబిఐ ముంబై హైకోర్టుకు వెళ్లడంతో ప్రత్యేక కోర్టు ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. ఈ నిర్ణయాన్ని ఇంద్రాణి ముఖర్జీ అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేశారు. 2012లో తన కుమార్తె షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలైన ఇంద్రాణి ముఖర్జీ 2015 నుంచి జైలులో ఉంటున్నారు. ఆమెకు 2022లో సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది.

# రాజ్యసభకు కమల్ హాసన్..

## మంత్రితో సమాచారం పంపిన తమిళనాడు సిఎం స్టాలిన్..!



**చెన్నై :** మక్కల్ నిది మయ్యమ్ (ఎంఎన్‌ఎం) పార్టీ అధినేత, నటుడు కమల్ హాసన్ ను తమిళనాడులోని అధికార డిఎంకె పార్టీ రాజ్యసభకు పంపనుంది. ఈ మేరకు తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్.. తన క్యాబినెట్ మంత్రి శేఖర్ బాబు ద్వారా కమల్ హాసన్‌కు సమాచారం పంపినట్లు తెలిసింది. కాగా ఈ ఏడాది జూలైలో డీఎంకే పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్‌ను పెద్దల సభకు పంపేందుకు డీఎంకే సమాయత్తమైంది. గత ఏడాది మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డిఎంకెతో ఎంఎన్ఎం పొత్తు పెట్టుకుంది. అయితే ఈ ఎన్నికల్లో కోయంబత్తురు నుంచి కమల్ హాసన్ బరిలో నిలవాలని భావించారు. కోయంబత్తూరులో ఆయన ఎన్నికల ప్రచారం కూడా నిర్వహించారు. కానీ ఈ లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బరిలోకి దిగారు. దాంతో డిఎంకె అధినేత సూచన మేరకు అక్కడి నుంచి పోటీ చేయాలనే ఆలోచనను కమల్ హాసన్ విరమించుకొన్నారు. 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్ సభ స్థానం నుంచి పోటీచేసిన కమల్ హాసన్ ఓటమి పాలయ్యారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ వ్యూహాత్మకంగా అడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిఎం స్టాలిన్ తనదైన శైలిలో ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగానే కమల్ హాసన్‌ను రాజ్యసభకు పంపుతున్నారు. తద్వారా చిత్ర పరిశ్రమకు తమ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందనే బలమైన సంకేతాలను ప్రజల్లోకి పంపాలనేది డిఎంకె ఆలోచన.

# అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ కన్నుమూత



**లక్నో :** అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి మహంత్ సత్యేంద్ర దాస్ 85 ఏళ్ల వయస్సులో బుధవారం లక్నోలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఈ నెల ప్రారంభంలో బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఆయన పరిస్థితి విషమించడంతో సత్యేంద్రని లక్నోలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేర్చారు. ఈ క్రమంలోనే వైద్యుల పర్యవేక్షణ తర్వాత ఆయన ఆరోగ్యం మరింత క్షీణించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్‌డియు)లో చికిత్స పొందుతున్న ఆయన తాజాగా తుది శ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తం చేశారు. మహంత్ సత్యేంద్ర దాస్ 20 ఏళ్ల వయస్సులోనే అయోధ్య రామాలయ ప్రధాన పూజారిగా నియమితులయ్యారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో తాత్కాలికంగా రామాలయ పూజారిగా కూడా సేవలు అందించారు. ఆయన జీవితం ఎప్పటికీ రామ జన్మభూమి, రామ ఆలయంతోనే సంబంధం కల్గి ఉంది. ఈ క్రమంలో రామాలయంలో ప్రధాన పూజారిగా బాధ్యతలు నిర్వహించడంతోపాటు అనేక పనులను నిర్వహించారు. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సమయంలో కూడా సత్యేంద్ర దాస్ కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత రామాలయం ప్రధాన పూజారిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన మరణం పట్ల అనేక మంది ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# రోహింగ్యా శరణార్థులకు ప్రవేశంపై వచ్చే వారం విచారణ

## విద్యలో ఏ పిల్లలపైనా వివక్షత చూపబడదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** విద్య విషయంలో ఏ పిల్లలపైనా వివక్షత చూపబడదని బుధవారం సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రోహింగ్యా శరణార్థులకు ఢిల్లీ నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటళ్లలో ప్రవేశాలు కల్పించేలా కేంద్రం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గనిర్దేశం చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తదుపరి వారానికి ఖరారు చేసింది. ఈ రోహింగ్యా శరణార్థుల కుటుంబాలు నగరంలో ఎక్కడ నివసిస్తున్నాయో తెలుసుకోవాలని కోర్టు కోరుకుంటున్నదని, వారు ఎవరి ఇళ్లల్లో నివసిస్తున్నారు, వారి వివరాలేమిటి అనేది కూడా తెలుసుకోవాలని అనుకుంటున్నదని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఎన్‌జివో రోహింగ్యా హుమన్ రైట్స్ ఇనిషియేటివ్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కొలిన్ గొన్‌సాల్వేస్ యుఎన్‌హెచ్‌సిఆర్ (యునైటెడ్ నేషన్స్ హైకమిషనర్ ఫర్ రెఫ్యూజీస్)మాట్లాడుతూ కార్డులు కలిగిఉన్న రోహింగ్యా శరణార్థుల వివరాలను అందజేస్తూ తాను అఫిడవిట్ దాఖలు చేశానని ధర్మాసనానికి తెలియజేశారు. రోహింగ్యా శరణార్థులు ఈ యుఎన్‌హెచ్‌సిఆర్ కార్డులను కలిగిఉంటే ఎన్‌జిఒ వివరాలను అందించడం చాలా సులభంగా ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. దీనికి సంబంధించి కోర్టుకు తాను మరిన్ని వివరాలు సమర్పించేందుకు మరికొంత సమయం కావాలని గోన్‌సాల్వేస్ కోరారు. 10రోజుల తర్వాత తదుపరి విచారణ చేపడతామని తెలియజేస్తూ అత్యున్నత న్యాయస్థానం విచారణను అప్పటికి వాయిదా వేసింది.

केनरा बैंक Canara Bank Together We Can
కరీంనగర్–II (13300) శాఖ
ఇం. నం. 6-5-323, 1వ అంతస్థు, రిలయన్స్ స్మార్ట్ పైన, TTD కళ్యాణ మండపం ప్రక్కన-505001.

**వాహనం వేలం అమ్మకం ప్రకటన**

కెనరా బ్యాంక్‌చే వేలం వేయబడే దిగువ తెలిపిన వాహనం కొనుగోలు కొరకు ప్రజల నుండి ఆఫర్లు కోరబడుచున్నవి.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/చార్జ్‌చేయబడిన దిగువ తెలిపిన వాహనం పైన తెలిపిన చిరునామా వద్ద "ఎక్కడ ఎలా ఉన్నది""ఎక్కడ ఏమి ఉన్నది" మరియు "అది ఏ స్థితిలో ఉన్నది" ప్రాతిపదికన 04-03-2025న ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.ల వరకు బహిరంగ వేలం వేయబడుతుందని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు(ల)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడినది.

| క్ర. సం. | రుణగ్రహీత పేరు | వాహనం /మోడల్ వివరణ | రిజిస్ట్రేషన్ నంబర్ | రిజర్వు ధర (రూ.లలో) |
|---|---|---|---|---|
| 1 | శ్రీ కోరుకంటి వేణుమాధవ రావు | RENAULT LODGY DCI RXZ-JSRGW4 BSIV | TS 02 EQ 5472 | రూ. 1,70,000/- |

1) ఆఫర్ లెటర్ మరియు కెనరా బ్యాంక్ పేరున రిజర్వు ధరలో 10% బయానా(కృతార్థులు కాని బిడ్డర్లకు వాపసు చేయబడుతుంది) గల DD/NEFT/RTGSతో పాటు సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి. 2) వేలం తేది మరియు సమయం: 04-03-2025న ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.ల వరకు శాఖ ఆవరణలో. 3) కొటేషన్ల దాఖలుకు చివరి తేది: 03-03-2025న సా. 4.00 గం.ల వరకు. 4) కృతార్థుడైన బిడ్డరు అతను/ఆమె పేరున నిర్ణయించిన అమ్మకంపై వెంటనే అమ్మకం ధరలో 25% (ఇప్పటికే చెల్లించిన బయానాతో సహా) డిపాజిట్ చేయవలసివుంటుంది మరియు మిగతా మొత్తాన్ని అమ్మకం నిర్ధారించిన తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. కృతార్థుడైన బిడ్డరు పైన తెలిపిన అమ్మకం ధరను చెల్లించడంలో విఫలమైనచో, అతను చెల్లించిన డిపాజిట్ జప్తుచేయబడుతుంది. 5) సీల్డ్ కొటేషన్‌లు దాఖలుచేసేముందు వాహనం గురించి ఆసక్తి గల బిడ్డర్లు తమకు తాము బాధ్యత వహించవలసి వుంటుంది. 6) కాగోరు బిడ్డరు బిడ్ దరఖాస్తుతోపాటు KYC డాక్యుమెంట్లను దాఖలు చేయవలసివుంటుంది. 7) ఎట్టి కారణం తెలియజేయకుండా వేలం వాయిదావేయుటకు/రద్దుచేయుటకు లేదా షరతులు మరియు నిబంధనలు మార్పుచేయుటకు అధీకృత అధికారి హక్కు కలిగివున్నారు. గమనిక: ఆసక్తిగల బిడ్డరు వాహనానికి బకాయి ఉన్న గ్యారేజీ చార్జీలు, పన్నులు, మరమ్మతు చార్జీలు మొదలగు వాటిని భరించవలసివుంటుంది. తదుపరి వివరాలకు బ్రాంచ్ మేనేజర్‌ను 9052170305పై సంప్రదించవచ్చును.
తేది: 12-02-2025, ప్రదేశం: కరీంనగర్ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## మాజీ సర్పంచ్ అంతిమ యాత్రలో పాడె మోసిన మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ (తిప్పర్తి):** రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనుచరుడు మాజీ సర్పంచ్ కందిమల్ల రాజిరెడ్డి మరణంతో చలించిపోయి అంతిమయాత్రలో స్వయంగా పాడె మోసి రాజిరెడ్డి లాంటి నిస్వార్థమైన నాయకుడు దూరం కావడం బాధాకరమని అన్నారు. తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కందిమల్ల రాజిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో రాజిరెడ్డి ఎల్లప్పుడు వెన్నంటే ఉండేవాడని తన కోసం అహర్నిశలు శ్రమించాడని మంత్రి గుర్తు చేసుకున్నారు. రాజిరెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా పార్టీ కార్యకర్తలకు ఏ ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటానని తన బలం తన కార్యకర్తలేనని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పార్టీ నాయకులు ఉన్నారు.

## రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జీఎం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీబీనగర్ గుంటూరు రైల్వే మార్గంలో రెండవ లైన్‌ను ఏర్పాటు చేస్తుండగా భద్రత తనిఖీల్లో భాగంగా ఆయన పర్యటించారు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో ఆకస్మికంగా ఆగి ప్లాట్‌ఫాం, బుకింగ్ కౌంటర్‌ను, పార్శిల్ కోసం తెచ్చిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ డీసీఎం ప్రదీప్, డీవోఎం దినేష్‌కుమార్, స్టేషన్ సూపరింటెండెంట్ తారకేశ్వర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తదితరులు ఉన్నారు.

## చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.16.45 లక్షలు



**ప్రజాపక్షం /నార్కట్‌పల్లి :** మండలం చెరువుగట్టులో ని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము యొక్క స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవములు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవములకు వచ్చిన భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకల ఆదాయమును మంగళవారం లెక్కించగా అమ్మవారి ఆలయ హుండీ ఆదాయము రూ.3,19,600లు, స్వామివారి హుండీ ఆదాయము లెక్కించగా రూ.13,25,500లు 2025 శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవములకు మొత్తము హుండీ ఆదాయము రూ.16,45,100లు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ నల్లగొండ డివిజన్ పరిశీలకురాలు బి.సుమతి, దేవస్థాన పర్యవేక్షకులు, ఆలయ సూపరిండెంట్ జి. తిరుపతిరెడ్డి, నందిగామ శ్రీ దుర్గ శివ సాయి సేవా సమితి సభ్యులు, హెచ్‌డిఎఫ్‌సి నల్లగొండ బ్రాంచి సిబ్బంది ,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పిజిఆర్‌ఆర్‌సిడిఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, కో ఆర్డినేటర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని.. అందులో భాగంగా రెండవ దఫా మార్చి 31వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి దరఖాస్తు ఫారం నింపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు, పరీక్షా ఫీజులను ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9866977741, 9398673736 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## చరిత్రలో నిలిచేపోయేలా అభివృద్ధి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** చరిత్రలో నిలిచిపోయేలా భువనగిరి నియోజకవర్గాన్ని సమగ్రంగా అన్ని విధాల అభివృద్ధి చేసి నిరూపిస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అన్ని ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలను కైవసం చేసుకునే ప్రణాళికతో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పోచంపల్లి మండలంలోని దోతిగూడెం, భీమనపల్లి, అంతమ్మగూడెం, కనుముకుల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో తక్షణమే తీర్చవలసిన మౌలిక సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ సాగునీటి కాలువలను పూర్తిచేసి రైతాంగాన్ని సస్యశ్యామలం చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి తాగునీరు అందించేందుకు కృషి చేసే బాధ్యత తమదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తడక వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అనిరెడ్డి జగన్ రెడ్డి, కాసుల అంజయ్య గౌడ్, శ్రీశైలం ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్, అంబరీష్ రెడ్డి, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు గుణిగంటి రమేష్ గౌడ్, రాంరెడ్డి, సింగిల్‌కారు వెంకటేశం, బిసి సెల్ అధ్యక్షుడు మక్తాల రమేష్ గౌడ్, సయ్యద్ ఎజాస్, యువజన సంఘం అధ్యక్షుడు గ్యార సందీప్, వివిధ గ్రా మాల గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# కన్నులపండువగా కల్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/ నార్కట్‌పల్లి :** మండల పరిధిలోని గోప్లాయిపల్లిలో గల శ్రీవారిజాల వేణుగోపాల స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవోపేతంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవారిజాల వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామల కళ్యాణం కమనీయంగా కన్నుల పండువగా అర్చకులు మత్స్యగిరి ఆధ్వర్యంలో జరిపించారు. వేలాది మంది భక్తుల కోలాహలం నడుమ స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఎదుర్కోలు అట్టహాసంగా నిర్వహించి అందంగా ముస్తాబు చేశారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు కల్యాణ తంతును వేద పండితులు మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిపించారు. ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. స్వామి వారి కల్యాణ వేడుకను భక్తులు సౌలభ్యంగా తిలకించేందుకు ఎల్‌ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు గుట్టపై ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి తెలిపారు.ఈ వేడుకల్లో ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



**భారీ బందోబస్త్ ఏర్పాటు : ఎస్ఐ క్రాంతికుమార్**

శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి వారి తిరు కళ్యాణ కార్యక్రమం ఘనంగా జరుగనున్న నేపథ్యంలో ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా, ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ జాగ్రత్తలు తీసుకున్నారు. అదేవిధంగా రాత్రి సమస్య ఏర్పడకుండా గుట్టపైకి వెళ్లడానికి వాహనాలకు అనుమతి ఇవ్వలేదు.

**వేణుగోపాలుడి కరుణ కటాక్షంతో సుభిక్షం : మంత్రి కోమటిరెడ్డి**

గోప్లాయిపల్లి గ్రామంలో శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి వెంక రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరు కళ్యాణంలో పాల్గొని స్వయంగా స్వామివారి పల్లకి మోసారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంపై వేణుగోపాల స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నానన్నారు. చెరువుగట్టు ఆలయాన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచాం త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే వారిజాల వేణుగోపాల స్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. చెరువుగట్టు జాతర తర్వాత ఈ ప్రాంతంలో రెండో పెద్ద జాతర వారిజాల వేణుగోపాలస్వామి వారి జాతర అని కొనియాడారు. ఆలయానికి కూతవేటు దూరంలోనే బ్రహ్మణవెల్లంల ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నది. రాబోయే రోజుల్లో మరింత అద్భుతంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్ రెడ్డి, గడుసు శశిధర్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, ఇడుకుల సంపత్, పాల్గొన్నారు.

# మద్యం అమ్మితే 'బెల్ట్' తీస్తాం

మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా ఏకమైన మహిళలు

చిట్యాల మండలం ఏపూర్‌లో ఘటన



**ప్రజాపక్షం/చిట్యాల:** బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలో మహిళలు, యువకులు ఏకమయ్యారు. బుధవారం రోజున గ్రామంలోని మహిళలంతా మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. డప్పు చప్పుల్లతో గ్రామంలో కలియ తిరుగుతూ మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా ర్యాలీని నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో నెలకొని ఉన్న బెల్ట్ దుకాణాల కారణంగా సమయ పాలన లేకుండా మద్యం మత్తుకు అలవాటు పడ్డ యువకులు బానిసలుగా మారి తమ జీవితాలను అస్తవ్యస్థం చేసుకుంటున్నారని మహిళలు ఆందోళన చెందారు. మద్యం కారణంగా అనారోగ్యంతో, రోడ్డు ప్రమాదాలలో వారు జీవితాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం అక్రమ అమ్మకాలకు అడ్డుఅదుపూ లేకుండా పోయిందని వారు వాపోయారు. ఇక మీదట గ్రామంలో ఎవరు కూడా మద్యం అమ్మకూడదని, అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తీర్మానించుకున్నారు. మద్యం అమ్మిన వారు లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం తాగిన వారికి రూ.20 వేలు, అమ్మకాలను పట్టించిన వారికి రూ.10 వేలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. అలాగే నిషేధిత గుట్కా, సిగరెట్లు అమ్మిన దుకాణాలదారులపై కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం అమ్మకాల నిషేధానికి ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామస్థులను మహిళలు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలెం మాధవి, మహిళా సంఘం అధ్యక్షురాలు వలిగొండ పద్మ, కార్యదర్శి వలిగొండ సునిత, కోశాధికారి గోపగోని మంగమ్మ, సభ్యులు బొంగు శ్రీలత, గుమ్మి సులోచన, బండ అనురాధ, కొండ సౌజన్య, యువజన నాయకులు సుర్గి లింగస్వామి, బండ మశ్చ్యగిరి, పాలెం జంగయ్య, ఎర్రసాని లింగస్వామి, బోడు గణేష్, సుర్గి మహేష్, సుర్గి జంగయ్య, గోపగోని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆ మాజీ ప్రజాప్రతినిధికి షరతులు వర్తించవా?

సొంత పొలానికి ప్రభుత్వ మట్టి

కొంపల్లి చెరువు నుంచి ఇష్టానుసారంగా మట్టి తరలింపు



**ప్రజాపక్షం /మునుగోడు :** చెరువుల నుండి మట్టిని తరలించాలంటే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ అనుమతులతో పాటు ప్రభుత్వానికి నగుదుతో కూడిన డిడిని తీసి మనకు కావలసిన మట్టిని తలించుకోవాలి. కానీ ఇదంతా నాకు అవసరం లేదంటూ చెరువు మట్టిని తరలిస్తున్న ఓ మాజీ ప్రజా ప్రతినిధి తీరు.. వివరాల్లోకి వెళితే మండలంలోని కొంపెల్లి చెరువు నుండి మంగళవారం ఆ నాయకుని వ్యవసాయ భూముల్లోకి చెరువు మట్టిని రెండు జెసిబిలు 20 ట్రాక్టర్ల సహాయంతో దాదాపు 250 నుంచి 300 ట్రాక్టర్ల మట్టిని తరలించారు. ఇదంతా జరుగుతున్న తమకేమీ పట్టనట్టుగా సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు అధికారుల పనితీరుపై ఆ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ట్రాక్టర్ యజమానులు చెరువు నుండి పారిపోయారు. పర్మిషన్ ఉంటే పారిపోవాల్సిన అవసరం ఏమిటని ఇదంతా అధికారుల కనుసైగలోనే నడుస్తుందని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వ మట్టిని తరలిస్తున్న ఆ ప్రజా ప్రతినిధిపై అతనికి సహకరిస్తున్న అధికారులపై సంబంధిత శాఖ జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కొంపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

## కార్పోరేట్‌కు దీటుగా రేస్ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు



రేస్ ఐఐటి అకాడమీ చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ :** దేశ వ్యాప్తంగా ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కోదాడ ఐఐటి అకాడమి చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులు ఎస్.దీక్షిత 98.79, పి.సూర్యప్రకాశ్ 98.43, ఎస్‌డి హుజాఫా 98.34, పి.రోహిత్‌రెడ్డి 98. 02, సిహెచ్ కెఎస్ స్వరూప్‌రెడ్డి 96.14,కె. మణికంఠ 96.12, పి.వంశీ 96.11 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్గీయ బాణాల వెంకటరెడ్డి ఆశయాల సాధన మేరకు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఉండాలని, గ్రామీణ ప్రాంత, పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటు ఫీజులతో కోదాడలోనే రేస్ కళాశాల స్థాపించి కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని అన్నారు. పక్కా ప్రణాళిక అంకితభావంతో తమ కళాశాల అధ్యాపకులు పని చేయడం వల్ల ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారావు, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పెద్దగట్టు జాతరకు భారీ బందోబస్తు



సూర్యాపేట జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** శ్రీ లింగమంతులస్వామి పెద్దగట్టు జాతరకు భారీ బందోబస్తును నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. 2వేల మంది పోలీసులతో ప్రతిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని, 68 సిసి కెమెరాలతో నిరంతరం నిఘా, దొంగతనాల నివారణకు ప్రత్యేక బృందాలు, మహిళల రక్షణకు షీటీం, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జాతర ప్రారంభం రోజు 16వ తేదీ తెల్లవారుజాము నుండి 65నెంబర్ జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపు చేస్తామని తెలిపారు. బుధవారం ఆయన జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, డిఎస్‌పి రవిలతో కలిసి పెద్దగట్టు జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. పోలీస్ భద్రత ఏర్పాట్లు, బందోబస్తు, జాతర రూట్ మ్యాప్, గ్లోబల్ మ్యాప్‌లను పరిశీలించి వారికి తగిన సలహాలు, సూచనలు చేశారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాలు నిలపడానికి ఏర్పాటు చేసిన భారీ పార్కింగ్ ప్రదేశాలు, సిబ్బంది వసతి, జాతరకు వచ్చిపోయే మార్గాలు, బారీకేడ్ల ఏర్పాటు, దేవాలయ రక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 16తేదీ తెల్లవారుజాము నుండి హైద్రాబాద్ నుండి విజయవాడకు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్లగొండ మీదుగా మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ వైపుకు మళ్లించడం, విజయవాడ నుండి హైద్రాబాద్‌కు వెళ్లే వాహనాలను హుజూర్, మిర్యాలగూడ, నల్లగొండ వైపుగా మళ్లించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తామన్నారు. తప్పిపోయిన పిల్లల కోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకునేందుకు షీటీంలు నిరంతరం పర్యటిస్తాయన్నారు. గట్టు కింది భాగంలో ఉన్న చెరువులో నీరు భారీగా ఉండడంతో బారీకేడ్లు ఏర్పాటు చేశామని అయినా పిల్లలు, వృద్దులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం గట్టుపై ఉన్న శ్రీ లింగమంతులస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్, పట్టణ సిఐలు రాజశేఖర్, వీరరాఘవులు, ఎస్ఐలు మహేశ్వర్, బాలు నాయక్, శ్రీకాంత్, వీరయ్య పాల్గొన్నారు.

## రైతు ముఖంలో సంతోషం నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** రైతుల ముఖంలో సంతోషం నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. తుర్కపల్లి మండలంలోని గోపాల్పూర్ గ్రామంలో కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా వచ్చే కాలువను ఆయన సందర్శించి తిమ్మాపురం, ప్యారవరం, సోలిపేట చెరువులకు వచ్చే కాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా బొమ్మలరామారం మండలంలోని తిమ్మాపురం నుండి మేడిపల్లి గ్రామల వరకు రైతులకు నీటి సమస్యలు తీరుతాయని ఆయన అన్నారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రతి అర్హులైన ప్రతి ఒక్కరికి రైతు భరోసా ఇస్తామని అన్నారు.నీటిని విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మండల పార్టీ అధ్యక్షులు సింగిర్తి మల్లేశం, మాజీ జెడ్పిటిసి సభ్యులు చీర్ల రాజేశ్వర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ మాందాల రామస్వామి, మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, రాజమల్లారెడ్డి, ధీరావత్ స్వామి నాయక్, కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## మోడల్ ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ప్రజలలో అవగాహన కల్పించేందుకుగాను ముఖ్యమైన పట్టణాలు, మండల కేంద్రాలలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు బాగుందని, ఇదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాలలో ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఇలాంటి మోడల్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని చెప్పారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో ఇందిరమ్మ ఇండ్లు కూడా ఒకటి అన్నారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ కుమార్ ,సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో జయ విద్యార్థుల ప్రతిభ



కె.ఉజ్వల్ , సిహెచ్ హర్షితశ్రీ, బి.శివమణి

**ప్రజాపక్షం/- సూర్యాపేట టౌన్:** జెఇఇ మెయిన్స్2025 లో జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో 90 పర్సంటైల్స్ సాధించారు. వీరిలో కె ఉజ్వల్ 99.03, సిహెచ్ హర్షితశ్రీ 98.73, బి.శివమణి 98.68, డి.జగదీష్ రాజు 97.76, జి తేజశ్రీ 97.74, టి.అమూల్య 96.97, పి.అమిత్ సూర్య 96.88, బి.లాస్య 96.27, కె.సాయినందన్ 94.42, ఎం.సాధ్విక 93.29, సిహెచ్ కుశల్ రాజ్ 93.23, జి.సాయిరాం 92.69, ఎస్ నక్షత్ర 90.62తో పాటు మరో 13 మంది విద్యార్థులు 90 ఆపైన పర్సంటైల్స్ సాధించారు. మెయిన్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతిలు అభినందించారు. విజయానికి కారకులైన అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జెఇఇ మెయిన్స్‌లో కేఎల్‌ఎన్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెలువడిన జెఇఇ మెయిన్స్ సెషన్ 1 ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ ఎన్ కళాశాల విద్యార్థులు 96 పర్సంటైల్ పైగా సాదించి జాతీయ స్తాయిలో సత్తా చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ అన్నారు. జి.శ్రీకళ 96.475, బి.సర్ధిష్ 94.496, పి.రంగా 92.210 పర్సంటైస్ సాధించగా ఇంకా వివిధ విభాగాల్లో అడ్వాన్స్‌కు 20 మంది ఉన్నారని అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను డైరెక్టర్లు పీఎల్‌ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డిలు అభినందించారు.

## సాగర్ సరిహద్దు వద్ద తనిఖీ కేంద్రాలు

కోళ్ల రవాణాపై ముమ్మర తనిఖీలు..




**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్‌లోని అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విజృంభిస్తూ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే కోళ్లు కోడిగుడ్లపై తెలంగాణ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీనితో ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు తెలంగాణలోకి రాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కావడంతో సరిహద్దు జిల్లాల్లోని అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్‌ను ఆనుకోని ఉన్న నల్లగొండ జిల్లాల అధికారులు సాగర్ సరిహద్దు వద్ద అప్రమత్తమయ్యారు. సరిహద్దులో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ పశు సంవర్ధక శాఖ, అటవీశాఖ, పోలీసు శాఖకు చెందిన సిబ్బందిని నియమించారు. వీరు వాహనాలను తనిఖీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. ప్రత్యేకించి కోళ్లు, కోడి గుడ్లు, కోళ్ల దాణా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. కోళ్లు, గుడ్లు, దాణాతో ఏవైనా వాహనాలు వస్తే వాటిని తిప్పి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కేశవ్ అజ్మీర, అటవీ శాఖ అధికారి రవీందర్, పోలీసులు ఉన్నారు.

# పాక్ సరిహద్దులో అదానీ ఎనర్జీ పార్క్

జాతీయ భద్రతకు ముప్పు : ఖర్గే



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రంలో అదానీ ఎనర్జీ పార్క్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే తీవ్రంగా వ్యతిరేకించారు. జాతీయ భద్రతకు సంబంధించిన స్థిరమైన నిబంధనలను సవరించి సరిహద్దు వెంబడి గుజరాత్ రాష్ట్రంలో అదానీ వ్యాపార సంస్థకు పునర్వినియోగ ఇంధన పార్కు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ దీంతో బిజెపి బూటకపు జాతీయవాదం ముసుగు తొలగిపోయిందని విమర్శించారు. ప్రైవేటు బిలియనీర్లకు ప్రయోజనం కలిగించేవిధంగా జాతీయ భద్రతకు ప్రమాదం కలిగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఖర్గే చేసిన ఆరోపణలపై అదానీ గ్రూపు ప్రతిస్పందించలేదు. ''నరేంద్రమోదీజీ, ఒక ప్రైవేటు బిలియనీరుకు ప్రయోజనం కలిగించడంకోసం మీరు మన సరిహద్దుల్లో జాతీయ భద్రతకు ప్రమాదం తెస్తున్నారు'' అని ఎక్స్ వేదికగా ఖర్గే ప్రధానమంత్రిపై విమర్శలు గుప్పించారు. ''ఇది నిజం, మీరు ఎంతో అమూల్యమైన వ్యూహాత్మక భూమిని బహుమతిగా ఇచ్చేశారు, పాకిస్థాన్ సరిహద్దుకు కేవలం ఒక కిలోమీటరు దూరంలో ఉన్న వ్యూహాత్మకమైన భూమిని మీ ప్రియమైన స్నేహితుడికి ఇచ్చేశారు. సరిహద్దు భద్రతా నిబంధనలను సడలించేశారా?'' అని ప్రధానమంత్రిని ఖర్గే ప్రశ్నించారు. సరిహద్దుల్లో భారత్–చైనా మధ్య వివాదంపై ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన ప్రకటనను ఈ సందర్భంగా ఖర్గే గుర్తుచేశారు. చైనాకు వ్యతిరేకంగా లఢఖ్ సరిహద్దులలో జరిగిన పోరాటంలో మనదేశానికి చెందిన 20 మంది సైనికులు సర్వోత్కృష్టమైన త్యాగాలు చేసిన సందర్భంగా ''మన భూభాగంలోకి ఎవ్వరూ ప్రవేశించలేదు'' అని మోదీ అన్నారు. ఈ విషయంలో సైన్యం వ్యక్తం చేస్తున్న ఆందోళనను ఈ విషయంలో ప్రధానమంత్రి మరచిపోయారని ఖర్గే విమర్శించారు. ''అక్కడ భవిష్యత్తులో అవసరాల నిమిత్తం భూమి లోపల సొరంగాలు తవ్వాల్సిన అవసరం వస్తే, అప్పుడు యుద్ధ వాహనాలను, యంత్రాలను ఉంచుకోవడానికి స్థలం ఎక్కడ దొరుగుతుంది? అప్పుడు ఏం జరుగుతుంది? రక్షణ కార్యకలాపాల నిమిత్తం స్థలం అవసరమైనప్పుడు ఏం చేస్తారు?'' అని ఒక సీనియర్ ఆర్మీ అధికారి అడిగిన ప్రశ్ననే తానూ మళ్ళీ అడుగుతన్నానని ఖర్గే అన్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధ పోరాట దాడులు జరిగే అతి సమీప ప్రాంతంలో ఒక పెద్ద ప్రైవేటు ప్రాజెక్టును ఎందుకు మీరు అక్కడ అనుమతించారు? దీనివల్ల మన సాయుధ బలగాలకు రక్షణ బాధ్యతలు, గస్తీ బాధ్యతలు ఇంకా ఇంకా పెరిగిపోతాయి, దీనివల్ల భారత సైన్యం వ్యూహాత్మక ప్రయోజనాలు దెబ్బతింటాయి అని ఖర్గే హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ కూడా దీనిపై స్పందిస్తూ, ప్రధానమంత్రిగానీ, రక్షణ మంత్రిగానీ దీనిపై తప్పనిసరిగా వివరణ ఇవ్వాలనీ, జాతీయ భద్రతతో రాజీపడేంత తీవ్రమైన చర్యలు ఎందుకు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ఎంపి, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ కూడా ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, ప్రధానమంత్రి స్నేహితుడికి దేశ ఆర్థిక వనరులన్నింటినీ స్వాధీనం చేసే ప్రక్రియ చివరకు సరిహద్దుల్లో జాతీయ భద్రతా నిబంధనలను సవరించేస్థాయి వరకూ వచ్చాయా? అని ప్రశ్నించారు. అదానీ గ్రూపు ఎనర్జీ పార్కు కోసం భారత సరిహద్దుల్లో భద్రతా నిబంధలను మార్చేశారన్న పత్రికావార్తల ఆధారంగా ఆమె స్పందించారు. సీనియర్ ఆర్మీ అధికారులు ఈ విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది ఒకవ్యక్తి వ్యాపార ప్రయోజనాలు కాదనీ, ఒకవ్యక్తి వ్యాపార ప్రయోజనాలే జాతీయ భద్రతకంటే ఎక్కువా? అని ఆమె ప్రశ్నించారు.



## మహావీర్ జయంతి ఉత్సవాలకు ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డికి ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంజారాల ఆరాధ్యదైవం మహవీర్ సంత్ శ్రీ సేవా లాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15న నిర్వహించే ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. మంత్రి ధనసరి సీతక్క , గిరిజన సంఘాల ముఖ్య నాయకులు ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో బుధవారం కలిసి ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉన్నారు.



## హైదరాబాద్‌లో హషీష్ ఆయిల్ స్వాధీనం : ముగ్గురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ అధికారులు హైదరాబాద్‌లో హషీష్ ఆయిల్ (డ్రగ్స్) సరఫరా చేస్తున్న ఓ ముఠాను బుధవారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడుకు చెందిన అరవింద్ అనే వ్యక్తి హషీష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు చెందిన కె.సాయివివేక్, సాలెంరాజు, అతుల్‌సింగ్‌లకు గ్రాముకు రూ.1000 చొప్పున పంపించేవాడు. ఈ ముగ్గురు హైదరాబాద్‌లో హషీష్ ఆయిల్‌ను గ్రాము రూ.1500 నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే సనత్‌నగర్‌లో ఈ ముగ్గురు విక్రయిస్తుండగా ఎస్‌టిఎఫ్ అధికారులు అరెస్టు చేశారు.

## ఎపి, తెలంగాణ రాష్ట్రాలను మద్యం మాఫియా నడిపిస్తోంది

బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో బీర్ల ధరలను పెంచడం దేనికి సంకేతమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బీరుకు రూ.30 నుండి రూ.40లకు పెంచారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపి, తెలంగాణ రాష్ట్రాలను మద్యం మాఫియా నడిపిస్తోందని, ఈ రెండు ప్రభుత్వాలు ఒప్పందంతో నడుస్తున్నాయని ఆరోపించారు. హోంగార్డులకు ఇప్పటి వరకు వేతనాలు లేవని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదని, వాలంటరీ రిటైర్‌మెంట్ ఇవ్వడానికి పలువురు భయపడుతున్నారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



## హామీలను అమలు చేయండి

ఎంఎల్‌సి కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. ఇప్పటికైనా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న హైదరాబాద్‌లో తలపెట్టనున్న మహిళా శంఖారావం సభ పోస్టర్‌ను ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని సిఎంను డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించిందని, బిడి కార్మికులకు రూ.4వేల పెన్షన్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసి టివిల్లో 70 శాతం పనిచేయడం లేదన్నారు.

## గ్రీన్ క్రెడిట్ పథకం కింద 57వేల హెక్టార్లు గుర్తింపు

**న్యూఢిల్లీ :** గ్రీన్ క్రెడిట్ పథకం కింద మొక్కల పెంపకానికి 17 రాష్ట్రాలు క్షీణించిన 57 వేల హెక్టార్ల భూమిని గుర్తించినట్లు కేంద్ర సమాచారం ద్వారా వెల్లడైంది. వాతావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటేందుకు వివిధ వ్యక్తులకు, సంఘాలకు, ప్రైవేట్ సంస్థలకు ఈ భూమిని కేటాయించనున్నారు. గరిష్ట అటవీ ప్రాంతం కలిగిన మధ్యప్రదేశ్ రాష్ట్రం ఈ పథకం కింద అత్యధికంగా ఫిబ్రవరి 2నాటికి 15,200 హెక్టార్లను గుర్తించినట్లు గత వారం కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ 11,361 హెక్టార్లు, గుజరాత్ 6,760 హెక్టార్లు, జార్ఖండ్ 5,648 హెక్టార్లు, తమిళనాడు 4,708 హెక్టార్లు, బిహార్ 4,108 హెక్టార్ల క్షీణించిన అటవీ ప్రాంతాన్ని గుర్తించాయి. 2023 అక్టోబర్‌లో ప్రవేశపెట్టిన గ్రీన్ క్రెడిట్ పథకంలో భాగంగా గుర్తించిన అటవీ ప్రాంతంలో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. మొక్కలు నాటిన వ్యక్తులు, సంస్థలకు క్రెడిట్ పాయింట్లు కేటాయిస్తారు. అటవీ ప్రాంతాన్ని వేరే ప్రయోజనాలకు ఉపయోగించడానికి పరిహారంగా ఈ పథకాన్ని అమలులోకి తెచ్చారు. అయితే ఈ పథకాన్ని కొందరు మాజీ అటవీ అధికారులు, పర్యావరణవేత్తలు వ్యతిరేకిస్తున్నారు. వాస్తవ అటవీ ప్రాంతానికి ఈ పథకం ఎంతమాత్రం ప్రత్యామ్నాయం కాదన్నది వారి వాదన.

## హరీష్‌ను అరెస్టు చేయొద్దు

గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు



**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ అభియోగాల కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. హరీష్ వేసిన పిటిషన్‌ను కొట్టేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. ఫోన్ ట్యాపింగ్ చేయించడమంటే రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత హక్కులను హరించడమేనని చెప్పారు. వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసే చర్యే అవుతుందన్నారు. కేసు దర్యాప్తు దశలో కోర్టులు అడ్డుకోడానికి వీల్లేదన్నారు. తన ఫోన్లు ట్యాపింగ్ చేయించారంటూ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారి జి.చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదును మేరకు నమోదైన కేసును కొట్టేయాలంటూ బీఆర్‌ఎస్ నాయకుడు, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. గతంలోని మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్ హరీష్‌రావును పోలీసులు అరెస్టు చేయరాదని, ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదన్న గతంలోని ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సిద్ధార్థ లూథ్రా వాదనలు కొనసాగిస్తూ, చక్రధర్ ఫోన్‌నే కాకుండా ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఫిర్యాదుదారుడి ఫోన్లను ట్యాపింగ్ చేయించారనే కేసు ప్రాథమిక విచారణ దశలో హైకోర్టు జోక్యం చేసుకోరాదని కోరారు. టెలిగ్రాఫ్ చట్ట నిబంధనల ప్రకారం ఫోన్ల ట్యాపింగ్ తీవ్ర నేరమన్నారు. ట్యాపింగ్ ప్రజల గోప్యత హక్కును హరించడమేనని చెప్పారు చక్రధర్ ఫోన్ ట్యాప్ అయ్యిందని ఆపిల్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా హెచ్చరించిందని చెప్పారు. పిటిషనర్‌కు రక్షణ కల్పించొద్దని కోరారు. తొలుత హరీష్‌రావు తరపున సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ, రాజకీయ కక్షతోనే తనపై చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారని, పోలీసులు ఎలాంటి ప్రాథమిక విచారణ కూడా చేయకుండా హడావుడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. విచారణ 19కి వాయిదా పడింది.

## చెత్తకుప్పలో శిశువు మృతదేహం

లతిత్‌పూర్‌లో దారుణం

**జలౌన్(యుపి) :** ఉత్తరప్రదేశ్ లలిత్‌పూర్ జిల్లా ఆస్పత్రి చెత్తకుప్పలో కుక్కలు పీక్కుతిన్న శిశువు మృతదేహం లభ్యమైనట్టు అధికారులు వెల్లడించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మీనాక్షిదేవి వివరణ ఇస్తూ బహదూర్‌పూర్ గ్రామానికి చెందిన సంగీత అనే మహిళ 9వ తేదీ సాయంత్రం 6.50 గంటలకు నెలలు నిండని శిశువుకు జన్మనిచ్చిందని, అయితే ఆ శిశువు 7.30 గంటలకు మృతి చెందినట్టు తెలిపారు. అభివృద్ధి చెందని మెదడు, కపాలంతో జన్మించిన ఆ శిశువు కొద్ది సేపటికే మృతి చెందడంతో తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు. మంగళవారం మృత శిశువు దేహం లభ్యమైన సమాచారం అందడంతో శిశువుకున్న గుర్తింపు కార్డుతో సంగీత జన్మనిచ్చిన శిశువేనని నిర్ధారించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. కాగా మృత శిశువును ఖననం చేసేందుకు ఒక వ్యక్తికి అప్పగించాలని నర్సు చెప్పడంతో రూ.200 చెల్లించి అతనికి ఇచ్చామని సంగీత భర్త అఖిలేష్ తెలిపాడు. ఖననం చేయడానికి బదులు అతను చెత్తకుప్పలో వేసి ఉంటాడని అన్నాడు.

## బిజెపి అక్రమాలపై నోరెత్తని హజారే

శివసేన ఎంపి సంజయ్ రావత్

**న్యూఢిల్లీ :** బిజెపి ప్రభుత్వ అక్రమాలపై 2014 తరువాత ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారె నోరెత్తలేదని శివసేన ఎంపి సంజయ్ రావత్ విమర్శించారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆప్ ఓటమి అనంతరం హజారె డబ్బుపై అరవింద్‌కున్న ఆశే ఆప్ ఓటమికి కారణమని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రావత్ హజారెపై విరుచుకుపడ్డారు. దీనిపై హజారె స్పందిస్తూ కొంతమంది వ్యక్తులు వారి మానసిక స్థితిని అనుసరించి మాట్లాడుతుంటారని అన్నారు. కాగా కేజ్రీవాల్, మనీష్ శిశోదియా లేకుంటే హజారె ఢిల్లీని చూసి ఉండవారు కాదని, రావత్ పేర్కొన్నారు. 2014 తరువాత కేంద్రంలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిపై హజారె మౌనం వహించారని రావత్ అన్నారు. రంగుల అద్దంలోనుంచి చూసేవారికి ప్రపంచం అలానే కనిపిస్తుందని హజారె సమాధానంగా అన్నారు.




## సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మాదిగల ఆకాంక్ష ఎస్‌సి వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ముందు సిఎం రేవంత్‌రెడ్డి, సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, కోచైర్మన్ దామోదర్ రాజనరసింహ చిత్రపటాలకు వేదిక ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడిపాపయ్య మాదిగ, ఎపి రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర కో–ఆర్డినేటర్లు చింతా స్వామి, రాజలింగం ఇసుకరాజు మాదిగ, మేరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ సభకు అనుమతి

**హైదరాబాద్ :** అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదంటూ బిఆర్‌ఎస్ పార్టీ ఈ నెల 18న రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో నిర్వహించే సభకు హైకోర్టు అనుమతిచ్చింది. పలు షరతులు విధిస్తూ అనుమతి ఉత్తర్వులను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి జారీ చేశారు. 18న అమనగల్ జూనియర్ కాలేజీ మైదానంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూడు వేల మందితో సభ నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని, మతవిద్వేషాలు రెచ్చగొట్టరాదని, ఇతర షరతులను విధించింది. బీఆర్‌ఎస్ నిరసన కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై అమనగల్ పార్టీ అధ్యక్షుడు వేసిన పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

## కేసు కొట్టేయండి

సునీత లక్ష్మారెడ్డి

**హైదరాబాద్ :** మెదక్ జిల్లా వెల్దుర్తి పీఎస్‌లో 2018లో నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇతరులు పిటిషన్ వేశారు. దీనిపై విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ జస్టిస్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వెల్దుర్తి అంబేద్కర్ క్రాస్ రోడ్డు వద్ద పర్మిషన్ లేకుండా నిరసన వ్యక్తం చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించారనే కేసు కింది కోర్టు విచారణలో ఉంది. ఫిర్యాదుదారును ప్రతివాదిగా చేర్చేందుకు ఆమెను అనుమతిస్తూ విచారణను వాయిదా వేశారు.

## ప్యారానగర్ వ్యర్థ నిల్వ కేంద్ర పనులను ఆపండి

**హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదాల మండలం ప్యారానగర్‌లో జిహెచ్‌ఎంసి ఏర్పాటు చేయబోయే వ్యర్థ నిల్వ కేంద్ర పనులను ఆపాలని హైకోర్టు స్టే ఆదేశాలిచ్చింది. అయితే, రోడ్డు నిర్మాణంతోపాటు సర్వే చేయవచ్చునని చెప్పింది. వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. పూర్తి వివరాలను అందజేయాలని ఆదేశించారు విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేశారు.

## ఆ భూముల వివరాలివ్వండి

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామం సర్వే నెం 181లోని 103 ఎకరాల నిషేధిత జాబితాలోని భూములను ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయడంపై దాఖలైన అప్పీల్‌ను డివిజన్ బెంచ్ విచారించింది. భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందిన భూములు నిషేధిత జాబితాల్లో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేశారనే వ్యాజ్యంపై విచారణ ఈనెల 27వ తేదీకి వాయిదా పడింది. మహమ్మద్ ఫరూజ్ అలీఖాన్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రిజిస్ట్రేషన్లపై మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది.

# పంటచేలకు మిషన్ భగీరథ నీరు!

తాగునీరందక ప్రజల అవస్థలు..







**ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి:** నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మీషన్ భగీరథ నీరు వ్యవసాయ పొలాలకు అక్రమంగా స్థానిక రైతులు మళ్ళించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలు తాగు నీరు అందని పరిస్థితి హిప్నేల్లి గ్రామ ప్రజలకు ఏర్పడింది.గత వారం రోజులుగా నీటి కోసం నానా కష్టలు పడుతున్నారు. ఇక్కడ స్థానిక ప్రజలు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలో మీషన్ భగీరథ నీరు ప్రజలకు అందకుండా, అధికారుల నిర్లక్ష్యంతో వ్యవసాయ పొలాలకు మళ్లుతోంది. బోరిగాం గ్రామ బాలజీ గుట్ట వద్ద, హిప్నేల్లి గ్రామ సమీపంలో కొందరు రైతులు అక్రమంగా నీటిని వాడుతున్నారు. దీంతో గ్రామాల్లో తాగు నీటి కోసం ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఉన్నత అధికారులు దీనిపై తక్షణమే స్పందిచాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉధృతమవుతోంది. వేసవి కాలం సమీపిస్తుండడంతో అధికారుల నిర్లక్ష్యం మీషన్ భగీరథ తాగునీరు సరఫరా అందక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే స్థానికులు మాత్రం ఈ మిషన్ భగీరథ త్రాగునీటిని తమ పంటలకు, వ్యవసాయ పొలాలకు మళ్లించి కాసులు పండించుకుంటున్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో బాలాజీ గుట్ట సమీపంలోని రైతులు మొక్క జొన్న పంటలకు మీషన్ భగీరథ నీటిని వాడుతున్నారు.అదే విధంగా, హిప్నేల్లిగ్రామ సమీపంలో మరి కొంత మంది రైతులు అక్రమంగా మెయిన్ పైప్‌లైన్లకు అనుసంధానం చేసుకుని పంట పొలాలకు నీరు తీసుకుంటున్నారు. వేసవి రాకతో మండలంలోని పలు గ్రామాల్లో నీటి కొరత తీవ్రంగా ఉంది. హిప్నేల్లి గ్రామంలో ప్రజలు గత వారం రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక నయా అబాది నుంచి పాత ఊరికి కాలి నడక వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అక్రమ మిషన్ భగీరథ నీటి వినియోగాన్ని అధికారులు పట్టించుకోకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తోంది. తక్షణమే జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, గ్రామాలకు మిషన్ భగీరథ తాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్లపై కేజీ వీల్స్‌తో తిరగనీయొద్దు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/తల్లాడ :** రోడ్లపై ట్రాక్టర్లు ఫుల్ వీల్స్‌తో తిరగొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎక్కడైనా రోడ్లపై ఫుల్ వీల్స్‌తో ట్రాక్టర్లు కనపడితే వాటిపై చర్యలు తీసుకోవాలని తల్లాడ ఎస్ఐ కొండలరావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం తల్లాడలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోడ్లు వేస్తున్నా ట్రాక్టర్లు ఫుల్ వీల్స్‌తో తిరగడం వల్ల పాడైపోతున్నాయన్నారు. తల్లాడలో రోడ్లపై నీళ్లు కనిపించవద్దని ఎంపిడివోకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. తల్లాడలో శాంతిభద్రతల గురించి ఎస్ఐ కొండలరావును అడిగి తెలుసుకున్నారు.



బయోమాస్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రి

తల్లాడలోని మల్లారం రోడ్‌లో ఎస్‌కె ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బయోమాస్ ప్లాంట్‌ను బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తో కలిసి ప్రారంబించారు. ఈసందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతు బయో ప్లాంట్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. బయోప్లాంట్ రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు. బయోప్లాంట్ నిర్వాహకులు వెనిగర్ల కిషోర్ మాట్లాడుతు రైతులు పండించే మొక్కజొన్న, వరి తదితర పంటలు వేస్టేజ్ పొలాల్లో కాల్చడంవలన భూసారం పాడైపోతుందని అలా నష్టపోకుండా ఉండేందుకు బయో ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులుమట్లా దయానంద్, కల్లూరు ఎఎంసి చైర్మన్ నీరజ, కాపా సుధాకర్, రాయల రాము, దుగ్యాల రఘుపతిరెడ్డి, జక్కంపొడి కిషోర్, రామప్పరావు, తుమ్మలల్లి రమేష్, దీవెల కృష్ణయ్య, అడపా అనిల్ పాల్గొన్నారు.



## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ మండల కేంద్రంలో పల్లె దవాఖాన అయినా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బుధవారం నాడు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మెరుగైన సేవలు అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉందని వైద్యులకు సూచించారు. అదే విధంగా గతంలో ప్రభుత్వ ఆసుపత్రి



లో సరైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ హయాంలో అలాంటి సమస్యలు తలెత్తవని ఆయన హామీ ఇచ్చారు. వైద్య సిబ్బందికి ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాలు కల్పించి ముందుకు సాగుదాం అని అన్నారు. జాతీయ రహదారి పక్కనే ఉంది కాబట్టి ఇప్పుడు ఇలాంటి ప్రమాదాలు జరుగుతుందో తెలియదని 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అంతకుముందు ఆసుపత్రికి వచ్చినాయన్నకు వైఎస్ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ కళాశాలలో 'జాబ్ మేళా'

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల అటానమస్‌లో శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ సహకారంతో కళాశాల తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా 170 మంది అభ్యర్థులు పాల్గొనడం జరిగింది. 20 మంది ఎంపిక కావడం జరిగింది. ఎంపికైనటువంటి అభ్యర్థులను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్ర ప్రసాద్ టిఎస్‌కేసి కోఆర్డినేటర్ డా.హరిబాబు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ టిఎస్‌కేసి కమిటీ మెంబర్స్ టిఎస్‌కేటిఎస్‌కేసి మెంటర్ పి.స్వరూప పాల్గొన్నారు.

## 1104 ట్రేడ్ యూనియన్ 75 వసంతాల సంబరాలు

**ప్రజాపక్షం/బిజినేపల్లి:** ట్రేడ్ మార్క్‌గా విద్యుత్‌రంగంలో నిలుస్తున్న ఏకైక సంఘం 1104 ట్రేడ్ యూనియన్ అని పలువురు విద్యుత్ ఉద్యోగులు కొనియాడారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ట్రేడ్ యూనియన్ 75 వసంతాల సంబరాలు బిజినపల్లి సెక్షన్ ఆఫీస్ ముందు బుధవారం నిర్వహించారు. కార్యాలయం ముందు యూనియన్ నాయకులు కార్మికులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్ర



మంలో మండల విద్యుత్ అధికారి రాకేష్ రెడ్డి, సబ్ ఇంజనీర్ శ్రీకాంత్, యూనియన్ నాయకులు మంగివిల్సన్, కొంకలి లోకేష్, బిసం శ్రీనివాసులు, నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

### మాజీ సర్పంచ్ అవంతి శంకర్

**ప్రజాపక్షం/బిజినపల్లి:** ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ సర్పంచు అవంతి శంకర్ విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. మండలంలోని సాయినిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దబూదుల సతీష్ సాగర్ గ్రామంలోని జడ్పిహెచ్‌ఎస్ ఉన్నత యుపిఎస్ పాఠశాలలకు, తాండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికి 360 బ్యాగులను బుధవారం మాజీ సర్పంచు అవంతి శంకర్ పంపిణీ చేసి మాట్లాడారు. సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు పెద్దబూల సతీష్ మా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం మాకు ఎంతో సంతోషమని వారికి మేము హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, మాట్లాడుతూ అందరిలో డబ్బులు ఉంటాయి కానీ దానంచేసే గుణం కూడా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ యువకులు వి.శివ, రాము, బి.కురుమయ్య, లక్ష్మీ నారాయణ, బి.సూరి, శంకర్, రాగ నిరంజన్, రాముడు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 14 'వీర జవాన్ల దినోత్సవం'

**ప్రజాపక్షం/మక్తల్:** స్థానిక పట్టణం లో శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14 ని అమరవీరుల దినోత్సవంగా జరుపుకుందాం అను గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కే. సత్యనారాయణ గౌడ్ పాలమూరు జిల్లా భజరంగ్ దళ్ సప్తయిక్ మిలన్ సంయోజక్ పి.భీమేష్ మాట్లాడుతూ ప్రేమికుల రోజును పాశ్చాత్య దేశాల విష సంస్కృతి విడనాడాలని సూచించారు. ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో దేశం కోసం వీరమరణం పొందిన ఆర్మీ జవాన్లను స్మరించుకుని, వారికి ప్రతి ఒక్కరూ నివాళులు అర్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ ప్రఖండ సంయోజక్ రాహుల్ పట్టణ ప్రముఖ్ మూర్తి. పట్టణ సహ ప్రముఖ్ రామాంజనేయులు గోరక్ష ప్రముఖ్ నాగరాజ్, గోరక్ష సహ ప్రముక్ అక్షయ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/ఊర్కొండ :** ఊర్కొండ మండలకేంద్రానికిచెందిన మిడ్జిల్ దార రాములమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాదారం మాజీసర్పంచ్, కాంగ్రెస్‌మండలపార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాపని ఖిల్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ఊర్కొండపట్టణ అధ్యక్షుడు అరిఫ్, యువజనవిభాగం మండల అధ్యక్షుడు ఆదినారాయణ, మాజీవార్డు సభ్యులు రవి, నాయకులు పులిజాలచంద్రకాంత్, గోపాల్, పాల్గొన్నారు.

## నేడు రాజకీయపార్టీలతో సమావేశం

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ వెంకట్‌రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

# కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** కాంగ్రెస్‌ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులు గజమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించి 240మంది లబ్ధిదారులకు ఇండ్లపట్టాల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టిన ఏడాదిలోనే నాలుగు గ్యారంటీలను అమలుచేయ డం జరిగిందన్నారు. రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ చేశామనితెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్లవరకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీదే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.500లకే గ్యాస్‌సిలిండర్లతోపాటు మహిళలకు ఉచితబస్సు ప్రయాణంకల్పిం చి బస్సుల సంఖ్యను పెంచడం జరిగిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, మూడు ఎకరాల భూపంపిణీ, రుణ మాఫీ, యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీఇచ్చి అమలుచేయకుండా తుంగలోతొక్కారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేదప్రజల అభివృద్ధియే లక్ష్యంగా సంక్షేమపథకాలను అమలుచేస్తున్నామన్నారు. అంతకుముందు మండలపరిధిలోని మాచర్ల గ్రామానికి రూ.5కోట్ల నిధులతో మంజూరైన బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్‌కంట్రోల్‌బోర్డుమెంబర్ ఠాగూర్‌బాలాజిసింగ్, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల‌శ్రీకాంత్ రెడ్డి, మాజీకౌన్సిలర్లు గోరేటిశ్రీనివాసులు, హన్మనాయక్, ఎజాస్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ రమకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, మున్సిపల్ కమీషనర్ షేక్‌మహ్మద్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీనాయకులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, పుస్తకాల రాహుల్, బిసిసంఘం నాయకులు గోపాల్, మైనార్టీ నాయకురాలు రేష్మబేగం, రెహనబేగం, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# 'ప్రజాపాలన'లో తండాలకు మహర్దశ

### ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి

**ప్రజాపక్షం/ బిజినేపల్లి :** సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో షెడ్యూల్ తెగల తండాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని ఊడుగుల కుంట తాండ నుంచి మంగనూర్ వరకు షెడ్యూల్ తెగల ఎస్ఎఫ్ నిధులు రూ. 3.73 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులకు బుధవరం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతి ఆవాసా నికి బీటి రోడ్డు వేసి రవాణా అవసలు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఆవాసానికి బీటీ రోడ్డు, అంతర్గతంగా సీసీ రోడ్లు వేయడంతో పాటు మౌలిక వసతుల కల్పన చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాట పడుతున్నామని అన్నారు. ప్రతిపక్ష పార్టీల మాయమాటలు నమ్మకుండా సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లోని ప్రజలకు అవసరమైన ప్రతి పనిని చేసేందుకు ప్రణాళిక రూపొందించుకోని ముందుకు పోతున్నామని అన్నారు. స్వంత జిల్లా నాగర్ కర్నూల్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు సిఎం రేవంత్ రెడ్డి కేటాయిస్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మైజార్టీ గెలిపించి ముఖ్యమంత్రిక బహుమతి ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పిఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు అమృత్ రెడ్డి, తిరుపతయ్య, కాట్రావత్ చందులాల్ పాండు నాయక్, హరీశ్వర్ రెడ్డి, చంద్రగౌడ్, మన్యానాయక్, రాంచందర్, సైదులు, లక్ష్మయ్య గౌడ్, తిరుపతి రెడ్డి , మండల మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ ఖిజర్ తదితరులు ఉన్నారు.



**ప్రారంభమైన మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులు**

బిజినేపల్లి మండలం శాయినిపల్లి గ్రామానికి మార్కొండ లిఫ్ట్ ద్వారా ఎర్ర కుంట, ఊర చెరువుకు నీళ్లు రావడంలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు దృష్టికి తీసుకుపోవడం స్పందించి ఎమ్మెల్యే నిన్న వసరం తాండ దగ్గర సందర్శించి ఆ చెరువులకు నీళ్లు ఎలా వెళతాయో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను రెండు రోజు ల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి గారి ఆదేశాలతో బుధవారం సాయంత్ర సాయిన్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అవంతి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభం చేశారు. మా గ్రామ రైతుల సమస్యను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే బుధవారం పని



ప్రారంభం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో కాలువ పనులు ప్రారంభం అయ్యాయి. కాలువ ద్వారా నీళ్లు ఇవ్వడానికి కృషి చేసిన మా ఎమ్మెల్యే మనస్ఫూర్తిగా మా గ్రామం తరపున అభినందనలు తెలియజేసుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసి చైర్మన్ వెంకటస్వామి, డైరెక్టర్లు వెంకటస్వామి. దీవుల నాయక్, హరీష్ రెడ్డి, ప్రేమ్ నాయక్ , శివ, రాము బి. కురుమయ్య, రాము, రాగ నిరంజన్, కాంగ్రెస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** గురువారం ఎమ్మెల్యే పెబ్బేరు మండల పరిధిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లో మంజూరైన సిసి రోడ్లు కొత్త బిటీ రోడ్లకు శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాలలో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా సీఎంఆర్ కళ్యాణ్ లక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారుల చెక్కులను అందజేయనున్నారు. ఉదయం 8 గంటలకు తాటిపాముల, 8.30కు కంచిరావుపల్లిలో టిఫిన్, 9 గంటలకు కంబాలాపూర్, 9.30కు నగనరాల మూడవ సెంటర్, పది గంటలకు శ్రీరంగాపూర్, 10.30 గంటలకు నాగసాని పల్లి, 11 గంటలకు వెంకటాపూర్ , 11.30 గంటలకు జానంపేట, మధ్యాహ్నం 12 గంటలకు కొత్త సుగురు, మధ్యాహ్నం 12.30కి సుగురు లో మధ్యాహ్న భోజన కార్యక్రమం ఉంటుంది. తదానంతరం 1.30 గంటలకు బున్యాదిపురం, 2 గంటలకు రంగాపూర్, మధ్యాహ్నం 2.30 గంటలకు జనంపల్లి, మధ్యాహ్నం మూడు గంటలకు పెంచికలపాడు, ఇర్లదిన్నె, నాలుగు గంట లకు బూడిదపాడు, 4.30కు



తిప్పాయపల్లి, ఐదు గంటలకు గుమ్మడం, 5.30 గంటలకు యాపర్ల , సాయంత్రం 6 గంటలకు అయ్యవారి పల్లి, 6.30 గంటలకు పాతపల్లి గ్రామాలలో సీసీరోడ్ల నిర్మాణానికి డ్రైనేజీ ఏర్పాటు, బిటి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తా రు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పెబ్బేరు మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటిసి, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచు లు, సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నాయకులు ఎన్ఎస్‌యుఐ మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.



## విద్యార్థులకు కంటి అద్దాలు అందజేత

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాల స్వస్తియ కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కే) ఎంహెచ్‌టి 4 టీం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌టి 4 టీం సిబ్బంది డా. రఘు మాట్లాడుతూ కదుకుంట్ల పిహెచ్‌సి, ఘన్పూర్ సిహెచ్‌సి కమలదిన్పూర్ పిహెచ్ సి ఏరియాలలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో,కళాశాలలో చదువుతున్న 9,10 తరగతు లు, ఇంటర్మీడియట్ చదువుతున్న 3వేలమంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని కంటి సమస్యలు ఉన్న 210 మంది విద్యార్థులను గుర్తించామని వారికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవతో తన నిధుల నుండి కళ్లద్దాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి రోజు ఘనపురం, కమాలుద్దీన్‌పూర్ , పిహెచ్‌సిల పరిధిలోకి వచ్చే స్కూల్ , కళాశాలల విద్యార్థు లు 56 మందికి కళ్లద్దాలు అందజేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు జిల్లా కలెక్టర్ కు, ఆర్‌బిఎస్‌కే ఎంహెచ్‌టి 4 టీం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌టి 4 సిబ్బంది డా.రఘు, ఫార్మసిస్టు శ్రీవిద్య, ఏఎన్ఎం లక్ష్మి , అధ్యాపకులు , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతురాలికి నివాళులర్పించిన నాయకులు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** సీనియర్ జర్నలిస్టు వీపనగండ్ల మాజీ సర్పంచ్ వంగూరు నర్సింహారెడ్డి మాతృమూర్తి వంగూరు దేవేంద్రమ్మ (85) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో మండల పరిధిలోని వివిధ పార్టీల నాయకులు మృతురాలికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వంగూరు దేవేంద్రమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో మాజీ ఎంపీపీ కమలేశ్వర్ రావు, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బాల్ రెడ్డి, రైతు కమిటీ అధ్యక్షుడు పోతుల వెంకటరెడ్డి, నాయకులు గోపి, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అదయ్య, రాజు, చిన్నారెడ్డి తదితరులు మృతురాలు దేవేంద్రమ్మకు నివాళులర్పించారు. మృతురాలి దేవేంద్రమ్మ రెండవ కుమారుడు వంగూరు నర్సింహారెడ్డి, వీపనగండ్ల గ్రామ సర్పంచ్‌గా పనిచేసి , ప్రస్తుతం ఒక దినపత్రికలో వనపర్తి జిల్లా స్టాపర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## డిజిటల్ విద్యాబోధన సులభతరం

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో డిజిటల్ విద్యాభోదన సులభతరంగా ఉంటుందని జిల్లా అకాడమిక్ మానటరింగ్ అధికారి మహనంది అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో కాంప్లెక్స్ పాఠశాలల బయో సైన్స్ ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మహనంది మాట్లాడుతూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిజిటల్ యాప్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ బోధన విధానంలో పాఠ్యాంశాలను సులభంగా నేర్పించడంలో ఉపాధ్యాయులకు వివరించారు. డిజిటల్ యాప్ ద్వారా జీవశాస్త్ర పాఠంశాలను బొమ్మలను చూసి విషయాలను తొందరగా విద్యార్థులు నేర్చుకోవటానికి సులభతరంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పిలు శ్రీనివాసులు, అక్బర్ పాషా, రఘురాం, శివకుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్పి వెంకటేష్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** అన్ని రకాల మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వి.రజని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అన్నారు. గోపాల్‌పేట మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే తీవ్రమైన నష్టాల గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మత్తు, మాదక




ద్రవ్యాలకు అలవాటు పడి యువత వారి బంగారు జీవితాలను మొదటి దశలో నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు ఎవరు కూడా అలాంటి వాటికి అలవాటు కాకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, మెడికల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ మంజుల సఖి, సెంటర్ అడ్మినిస్ట్రేటివ్, ఎం. కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాందేవ్ రెడ్డి, ఉపాధ్యాయులు యాదగిరి ధర్మ రాజ్, తజుద్దీన్ పాల్గొన్నారు.



## విలువలతో కూడిన జర్నలిజాన్ని పరిరక్షించాలి

### యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

**ప్రజాపక్షం/చిన్నంబావి:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విలువలతో కూడిన జర్నలిజాన్ని పరిరక్షించాలని టియూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలో టియుడబ్లుజె(ఐజెయు) సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వాస్తవ పరిస్థితులను సమాజానికి అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగవ పిల్లర్‌గా ఉన్న జర్నలిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టియూడబ్ల్యూజే (ఐజేయూ) పనిచేస్తుందన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించడంలో జర్నలిస్టులకు మెరుగైన వైద్యం అందించడంలో యూనియన్ ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద యూనియన్‌గా టియూడబ్ల్యూజె కొనసాగుతుందన్నారు. ప్రతి జర్నలిస్టులు యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ సొసైటీ సబ్ కమిటీ మెంబర్ శ్రీనివాసరావు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవరావు, సీనియర్ జర్నలిస్టులు బి.రాజు, విజయ్ కుమార్, రవికాంత్, కొల్లాపూర్ తాలుకా అధ్యక్షులు రాజు, సురేష్ వెంకటస్వామి, చిన్నంబావి మండల అధ్యక్షుడు భాను ప్రకాశ్, నాయకులు కిరణ్, శివ, శ్రీకాంత్ , సత్యం తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐ కృష్ణదేవకు ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/ఊర్కొండ :** ఇటీవలే బదిలీపై మండలానికి విచ్చేసి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ కృష్ణదేవకు ఊర్కొండ కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు అరిఫ్, కాంగ్రెస్‌యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ, సేవాదల్ మండల అధ్యక్షుడు పోలేగణేష్, మాజీవార్డుసభ్యులురవి, రఫిఖ్, సీనియర్ నాయకులు దయాకర్, దారరాజు, మ్యాకలశివకుమార్, కంఠంరాములు, పోలేభాస్కర్, ఆనంద్ పాల్గొన్నారు.



## చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడికి సంఘీభావం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** మీసాల దేవుడిగా ప్రసిద్ధి చెందిన చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన పూజారి రంగరాజన్ పై జరిగిన దాడికి సంఘీభావంగా పలువురు అర్చకులు ఆయనను కలిసి సంఘీభావం తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిలుకూరి బాలాజీ అర్చకుడు రంగరాజన్ పై దాడిని నిరసిస్తూ నేడు చిలుకూరు బాలాజీ అర్చకులు రంగరాజన్ ని ప్రత్యేకంగా చిలుకూరిలోని వారి నివాసంలో కలిసి వారికి రాష్ట్ర ధూప దీప నైవేద్యం అర్చక సంఘం అధ్యక్షులు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల నుండి పెద్ద ఎత్తున కలిసి వారికి సంఘీభావం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ పూజారులపై దాడి జరగడం ఖండించదగినదని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు పివీ లక్ష్మీ కాంతాచార్యులు, జిల్లా సలహదారులు శ్రీహరి ఆచార్య, జిల్లా కోశాధికారి శ్రీధర్ జోషి, జిల్లా సభ్యులు జూరాల రవి, అర్చకులు పాల్గొన్నా రు.

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయొద్దు : ఎస్పి యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం/నారాయణపేట :** జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడు తూ రాజకీ



యంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్ బుక్ , ట్విట్టరు, ఇన్‌స్ట్రాగ్రాం, వాట్సాప్ గ్రూపుల లో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ఒక వర్గానికి కించపర్చే విధంగా ఉన్న తమకు తెలియని వీడియోలు, ఫోటోలు, పోస్టులు చేసిన వాటి ని ఇతరులకు ఫార్వర్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ ని బాధ్యుడిగా చేస్తూ ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు. ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని ఆ వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్ పంపిణీ

**ప్రజాపక్షం / మద్దూర్ :** ప్రజా పాలనలో మద్దూరు పట్టణ కేంద్రంలోని మొల్ల అబ్దుల్ రహీంకు రూ. 1లక్ష సీఎంఆర్ ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు అబ్దుల్



రహీం ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రహీం, కాంగ్రె స్ నాయకులు ఉస్మాన్ , సలాం, అహేమద్ తదితిరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించండి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15 రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని వనపర్తి జిల్లా బంజారా గిరిజన సంఘం జనరల్ సెక్రటరీ మూడవత్ మోతిలాల్ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికి, ఫిబ్రవరి 15వ తేదీన సెలవు దినంగా ప్రకటించాలని గిరిజనులందరి తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రకటించారు.



# షోకేస్ కళారంగం

## అవీ రంగస్థల వేదికలే..



డిస్నీ థీమ్ పార్కులను కేవలం ఎమ్యూజిమెంట్ పార్కులుగా పరిగణించడానికి వీల్లేదు. వీటిని సాంకేతికంగా థియేటర్లు లేదా రంగస్థల వేదికలుగా పరిగణించాలి. డిస్నీ వరల్డ్, డిస్నీ ల్యాండ్ వంటి ఎన్నో విభాగాలు ఈ థీమ్ పార్క్‌లో ఉన్నాయి. వీటిలో ప్రతి ఒక్కటీ ఓ పెద్ద థియేటరే. ఈ థీమ్ పార్క్‌లో పని చేస్తున్న ఉద్యోగులను 'కాస్ట్ మెంటబర్స్' అని పిలుస్తారు. ఫ్లోరిడాలోని 'వాల్ట్ డిస్నీ వరల్డ్' లో కనీసం 12 లక్షల దుస్తులు ఉన్నాయని అంచనా. ఏ రంగస్థల వేదిక లేదా థియటేర్ కంపెనీ లోనూ ఇన్ని దుస్తులు లేవు. దుస్తుల విషయంలోనే మరో ఆసక్తికరమైన అంశం ఉంది. సాధారణంగా నాటకాలు లేదా సినిమాల కోసం దుస్తులను కిరాయికి ఇచ్చే స్టోర్లు ఉంటాయి. సాధారణంగా ఒకటిరెండు వందల కాస్ట్యూమ్స్ ఉండే, దానిని పెద్ద దుకాణంగానే పరిగణించాలి. అయితే, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని నేషనల్ థియేటర్‌కు చెందిన ప్రాప్స్ డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో కనీసం 85000 కాస్ట్యూమ్స్ ఉన్నాయి. వాటిని ప్రదర్శనల సమయంలో ధరించడానికి వివిధ ప్రొడక్షన్ల నుంచి వచ్చే ఆర్డర్ ప్రకారం సరఫరా చేస్తారు. అంతేకాదు, సామాన్య ప్రజలు కూడా ఈ దుస్తులను అద్దెకు తీసుకోవచ్చు. ఇలావుంటే, లండన్‌లో నడిచే 'ది మౌస్‌ట్రాఫ్' అత్యధిక కాలంగా ప్రదర్శిస్తున్న నాటకంకాగా, మ్యూజికల్ ప్రదర్శన రికార్డు 'లెస్ మిజరబుల్స్' దక్కించుకుంటుంది. దీనిని ఇప్పటి వరకూ 13000 కంటే ఎక్కువ పర్యాయాలు ప్రదర్శించారు. విక్టర్ హ్యూగో రచించి ఈ సంగీత ప్రధాన నాటక ప్రదర్శనకు 392 దుస్తులు వాడతారు. ఈ థియేటర్‌లో 5000 రకాల దుస్తులు, 85 రకాల విగ్గులు ఉన్నాయి. దీనికి ఒక రివాల్వింగ్ స్టేజీ కూడా ఉంది. సినిమాల్లో మాదిరిగా వివిధ ప్రాంతాల్లో కథ నడుస్తుంది. అందు కోసం ఈ రివాల్వింగ్ స్టేజ్ ప్రతి ప్రదర్శనకూ 63 సార్లు తిరుగుతుంది. తద్వారా వివిధ రకాల లొకేషన్స్‌లో ఉన్న అనుభూతి ప్రేక్షకులకు దక్కుతుంది.



# సంగీత సిద్ధాంతం!



ఆశ్చర్యం అనిపించినప్పటికీ, సంగీతానికీ ఓ సిద్ధాంతం ఉంది. సంగీత సృష్టి ఈ సిద్ధాంతానికి లోబడే జరుగుతుంది. అందుకు ఉపయోగించే విధానాలలో సంగీత సంజ్ఞామానం, నిర్మాణం, సామరస్యం, శ్రావ్యత, లయ, కూర్పు వంటి వివిధ రూపాలను, అంశాలను ప్రతిబింబిస్తుంది. సంగీత సృష్టి, పనితీరులో ఉపయోగించే సూత్రాల అధ్యయనాన్ని సంగీత సిద్ధాంతంగా చెప్పుకోవచ్చు. చారిత్రక ఆధారాలను ప్రామాణికంగా తీసుకుంటే, తొలి సంగీత సిద్ధాంతం క్రీస్తుశకం 1492 నాటిదని తెలుస్తోంది. 'థియోరియా మ్యూజిక్' అనే పేరుతో ఫ్రాంచినస్ గఫూరియస్ చెక్కపలకలపై చెక్కిన బొమ్మల ద్వారా సంగీత విధానాలను వివరించాడు. జుబాల్, పైథాగరస్, ఫిలోలస్ అనే ముగ్గురు సంగీత పరిశోధకుల గురించిన వివరణనిస్తుంది. సంగీతంలో స్కేల్స్, కార్డ్స్, కీ సిగ్నేచర్స్, సమయానుకూల సిగ్నేచర్స్, సంగీత రూపం వంటి కీలక భావనలు పొందుపరచి ఉంటాయి. స్కేల్ లేదా స్థాయి అనేది సంగీత నమూనా లేదా సంగీత క్రమాన్ని సృష్టించే నిర్దిష్ట గమకాల శ్రేణి. సంగీతంలో శ్రావ్యత, శ్రుతులు సృష్టించడంలో స్కేల్స్ కీలక భూమిక పోషిస్తాయి. టోన్స్, సెమీటోన్స్ శ్రేణితో రూపొందిన 'టానిక్' అని పిలిచే నిర్దిష్ట గమనిక చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది. సంగీతంలో మేజర్ స్కేల్స్, మైనర్ స్కేల్స్, పెంటాటోనిక్ స్కేల్స్ వంటి వివిధ రకాల స్థాయిలు ఉంటాయి. శృతి పురోగతిని అర్థం చేసుకోవడానికి, శృతి కదలికను అర్థం చేసుకోడానికి ఈ ఫ్రేమ్‌వర్క్ అత్యవసరం. విభిన్న ప్రమాణాలు, వాటి నమూనాలను నేర్చుకోవడం సహజంగానే సంగీతకారులకు తమ సొంత ఆలోచనలను మెరుచుపరుకోవడానికి, గానాన్ని మరింత మెరుగు పరచుకోవడానికి సహాయడుతుంది. ఇలంటి విభిన్నమైన అంశాలను అధ్యయనం చేసి, రూపొందిన నిర్దిష్ట విధానాన్నే సంగీత సిద్ధాంతం అంటారు. అయితే, ఇది శిలాశాసనమేమీ కాదు. కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. కొన్ని సంగీత ప్రక్రియలు లేదా విధానాలు మాత్రం మూస పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. ఆ చట్రం నుంచి సంగీతాన్ని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించిన వారిని హేళన చేయడం లేదా అణచివేయడం లేదా వెలివేయడం ఆనవాయితీగా వస్తున్నది. తమిళనాడుకు చెందిన కర్నాటక సంగీత విద్వాంసుడు టిఎం కృష్ణ ఉదంతాన్ని ఇందుకు తిరుగులేని ఉదాహరణ. భారతీయ సంగీత రీతులను సామాజిక మార్పు కోసం ఉపయోగించడంలో తప్పులేదని వాదించిన కృష్ణపై సాంప్రదాయవాదులు కక్షకట్టారు. రామన్ మెగసెసె అవార్డును అందుకున్న కృష్ణ తౌలుత భాగవతుల సీతారామ శర్మ వద్ద సంగీతాన్ని అభ్యసించారు. అనంతరం చింగ్లెపుత్ రంగనాథం, సెమ్మన్‌గుడి శ్రీనివాస అయ్యర్ వద్ద రాగం తానం పల్లవిలో శిష్యరికం చేశారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ ఆయనకు 'హిందు సంగీత కళానిధి' ఎంఎస్ సుబ్బలక్ష్మి అవార్డుతో సత్కరించింది. కానీ, శాస్త్రీయ సంగీతాన్ని అపభ్రంశం చేస్తున్నాడంటూ కృష్ణమీద కత్తికట్టిన కొంత మంది ఈ అవార్డును రద్దు చేయాల్సిందిగా కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తుది ఆదేశాలు జారీ చేసే వరకూ సంగీత కళానిధి అవార్డు ప్రస్తావన ఎక్కడా చేయడానికి వీల్లేదని కృష్ణను ఆదేశిస్తూ సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం కథాక్రమంలో మనకు స్పష్టంగా కనిపిస్తున్నది ఈర్ష మాత్రమే. కొన్ని కులాలు లేదా వర్గాలకు మాత్రమే శాస్త్రీయ సంగీతాన్ని పరిమితం చేసే ప్రయత్నం స్పష్టమవుతున్నది. సంగీత విధానాలను ఏమాత్రం పొల్లుపోకుండా, ఒకే రీతిలో ఆచరించాలని, లేకపోతే దాని పవిత్ర పోతుందని వాదించడం వెనుక సంగీతం పట్ల అభిమానం కంటే, వ్యక్తుల పట్ల కక్షే ఎక్కువగా కనిపిస్తున్నది. సంగీతానికి సిద్ధాంతం ఉండడం తప్పుకాదుగానీ, అది కాలానుగుణ మార్పులకు లోనుకాకూడదన్న శాసనాన్ని లిఖించడమే తప్పు.

## రకరకాల దుస్తులు..



సినిమాల్లో ఒక పాటపై హీరో ఎన్ని డ్రెస్సులు వేశాడు... హీరోయిన్ ఎన్ని చీరెలు మార్చింది అని ఒకప్పుడు విపరీతమైన చర్చ జరిగేది. చివరికి ఆ సినిమా పేర్లతో దుస్తులు మార్కెట్‌లో వచ్చేవి. సినిమా కాబట్టి ఇలాంటి సీన్లు సులభం. కానీ, రంగస్థలంపై ప్రత్యక్షంగా ఒక నాటకంలో నటిస్తున్నప్పుడు లేదా ఒక ప్రదర్శన ఇస్తున్నప్పుడు దుస్తులు మార్చడం అనుకున్నంత సులభం కాదు. ఈ విషయంలో ఆంగ్ల ఇల్యూజనిస్టు పాల్ కీవ్ పాల్ కీవ్ పేరిట ప్రపంచ రికార్డు ఉంది. 2002లో కేంబ్రిడ్జి థియేటర్‌లో జరిగిన ప్రదర్శనలో అతను ఏకంగా 29 డ్రెస్‌లు మార్చి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. న్యూర్క్ డ్రామా డెస్క్ అవార్డును గెల్చుకున్న ఏకైక భ్రమకారుడు కూడా కీవ్ కావడం గమనార్హం. అతను మాటిల్డా 'ది మ్యూజిక్',షేక్స్‌పియర్ 'అరేబియన్ నైట్స్', డెరెన్ బ్రౌన్ 'వెస్ట్ ఎండ్ టూర్' వంటి ప్రదర్శనల్లో అతను వేదికపై భ్రమలు సృష్టించేవాడు. మాయాజాలాన్ని ప్రదర్శించేవాడు. కీవ్ మాదిరి అసాధారణ ప్రతిభావంతుడు లేదడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు.

## ఖరీదైన టికెట్..



ఒక మ్యూజికల్ ప్రదర్శనకు అత్యధిక ధర ఎంత వరకూ ఉండవచ్చు? ఆయా గాయకులు లేదా గాయనీమణుల పేరుప్రఖ్యాతులను బట్టి ఆధారపడి ఉంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే. సినిమా విషయానికి వస్తే, సగటున ఒక షోకు టికెట్ ధర 500 నుంచి 1000 రూపాయలుగా చెప్పవచ్చు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, రూ. 10,000 నుంచి 15,0000 కూడా వసూలు చేస్తున్నారు. అయితే, డ్రామాలు, సంగీత విభావరులకు ఇంత డిమాండ్ లేదు. సాధారణ పరిస్థితుల్లో అత్యధికంగా 1000 రూపాయల వరకూ ఉండవచ్చు. ఎడ్‌షీరన్ లేదా లేడీ గాగా లేదా టేదా షిఫ్ట్ వంటి అంతర్జాతీయ స్టార్ల విషయానికి వస్తే సుమారు ఐదారు వేల రూపాయలుగా ధరలను ఖరారు చేయవచ్చు. కానీ, అత్యంత ఖరీదైన టికెట్ విలువ 1150 డాలర్లు (అప్పట్లో సుమారు రూ. 66,000/ ప్రస్తుతం సుమారు రూ. 86,000). డగ్లస్ హోమ్ క్విస్ట్ 2017 క్రిస్మస్, న్యూ ఇయర్స్‌డే మధ్య వారంలో ప్రీమియం షో నిర్వహించాడు. 'స్మాష్ హిట్' పేరున్న అతని ప్రదర్శనకు అంత భారీ టికెట్ పెట్టినప్పటికీ, థియేటర్ ప్రేక్షకులతో క్రిక్కిరిసిపోవడం విశేషం. అభిమానానికి హద్దులు ఉండవని అందుకే అంటారు.

## అన్నాదమ్ముల అనుబంధం..



'డాక్టర్‌ను కావాలనుకున్నానుగానీ యాక్టర్‌ని అయ్యాను' అంటూ చాలామంది అంటునే ఉన్నారు.. మనం వింటునే ఉన్నాం. కానీ, హాలీవుడ్ అగ్రశ్రేణి నటుల్లో ఒకడైన క్రిస్టోఫర్ ఆస్టన్ కుచర్ ఇవే మాటలు చెప్పినప్పుడు, అతని గురించి తెలిసిన ప్రతి ఒక్కరూ అవునని అంగీకరించి తీరాలి. 1978 ఫిబ్రవరి 19న, ఆస్టన్ తన కవల సోదరుడు మైఖేల్ కంటే ఐదు నిమిషాలు ముందు పుట్టాడు. ఆస్టన్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండగా, సోదరుడు మైఖేల్‌ను అనారోగ్యం వెంటాడింది. గుండె సంబంధమైన వ్యాధులు అతనికి పుట్టుకతోనే సంక్రమించాయి. దీనికితోడు సెరిబ్రల్ పాల్సీ వ్యాధి. గుండె మార్పిడి జరిగితేతప్ప మైఖేల్ బతకడని వైద్యులు తేల్చిచెప్పారు. చనిపోయిన వారి గుండెను అమర్చవచ్చన్న విషయం తెలిసిన ఆస్టన్ తన సోదరుడి కోసం ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాడు. తద్వారా తమ్ముడికి తన గుండెను అమర్చవచ్చన్నది అతని అభిప్రాయం. అప్పటికి ఆస్టన్ వయసు 13 ఏళ్లు. అదృష్టవశాత్తు మైఖేల్‌కు అవయవదానం ప్రాజెక్టు ద్వారా గుండె లభించింది. శస్త్రచికిత్స విజయవంతమైంది. కానీ, వ్యాధులు అతనిని వెంటాడుతునే ఉన్నాయి. తమ్ముడి బాధ చూసి చలించిపోయిన ఆస్టన్ వైద్య విద్య అభ్యసించాలని అనుకున్నాడు. తన తమ్ముడి మాదిరి బాధపడుతున్న వారికి చికిత్సను అందించేలా పరిశోధనలు చేయాలన్నది అతని సంకల్పం. కానీ, అనుకోకుండా అతను నటుడయ్యాడు. సున్నిత హృదయుడు కాబట్టే కళారంగం అతనిని ఆకర్షించి ఉండవచ్చు. కళల పట్ల తల్లిదండ్రులకు ఉన్న ఆసక్తి కూడా అతనిని ఈ దిశగా నడిపించడానికి కారణమై ఉండవచ్చు. ఏదిఏమైనా ఆస్టన్ హాలీవుడ్‌లో అత్యుత్తమ నటుడిగా పేరు సంపాదించుకున్నాడు. సినిమాలకు నిర్మాతగా కూడా వ్యవహరించాడు. స్టాక్ మార్కెట్‌లో కోట్ల రూపాయలు సంపాదించాడు. పిల్లల అక్రమ రవాణా అరికట్టడానికి 'థోర్న్' (THORN) అనే సంస్థను నెలకొల్పాడు. కాలగమనంలో మైఖేల న్యాయవాదిగా ఎదిగాడు. పబ్లిక్ స్పీకర్ అయ్యాడు. సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న పిల్లల హక్కు కోసం పోరాటం చేస్తున్నాడు. తన్నతో కలిసి 'థోర్న్' సంస్థకు సేవలు అందిస్తున్నాడు. ఈ అన్నాదమ్ముల అనుబంధాన్ని ఎంత చెప్పినా తక్కువే.





# తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మది కీలక పాత్ర

### ఆమె స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలి : సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/జనగామ రూరల్:** ఐలమ్మ స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపహాడ్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం మరికుక్కల నర్సింహులు అధ్యక్షతన జరుగగా రాజారెడ్డి హాజరై మాట్లాడుతూ భూమికోసం భుక్తికోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఆనాడు రజాకారులకు వ్యతిరేకంగా తెలంగాణ రైతు సంఘం పోరాటంలో చాకలి ఐలమ్మ కీలకపాత్రం పోషించిందని కొనియాడారు. ఆ పోరాట ఫలితంగానే భూ సంస్కరణలు అమలయ్యాయని, పేద ప్రజలు వ్యవసాయం చేసుకుని బతుకుతున్నారన్నారు. కానీ నేటి ప్రభుత్వాలు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనియెడల భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైల్ల ఆశయ్య, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏదునూరి మదార్, మైలారం వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రేమలతారెడ్డి, మాజీ ఎంపిపి కళింగ రాజు, గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి బోడ నరేందర్, ఉపేందర్, రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొలిపాక నరసింహులు, ఐలమ్మ మనువరాలు మంజుల, గ్రామ రజక సంఘం నాయకులు సిద్దిరాములు, యాదగిరి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** కుమ్రం భీం జిల్లా ఏరియా ఆసుప్రతిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం హాస్పిటల్ ఇంచార్జి సూపరింటెండెంట్ సుభాష్‌కు ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భోగె ఉపేందర్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలల నుండి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చామని, ఇప్పటి వరకు దాని ఊసే లేదని ఆందోళనవ వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలను రద్దు చేసి గ్రీన్ ఛానల్ ద్వారా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని, అదే విధంగా గత రెండు సంవత్సరాల నుండి కార్మికులకు రావాల్సిన ఇపిఎఫ్, ఇఎస్ఐ తదితర పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ఇప్పటికైనా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, లేని పంక్షంలో ఈనెల 17 నుండి విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గుణవంతురావ్, మమత, మల్లేష్, మురళి, ప్రేమలత, జ్ఞానేశ్వర్, శ్రీశైలం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్




**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రథమ మహాసభ జంపాల రవీందర్ అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన సభలో పాల్గొన్న పశ్య పద్మ మాట్లాడుతూ ములుగు జిల్లా నుండి దూర ప్రాంతాలకు సాగు నీరు తరలిస్తున్న పాలకులు ఈ జిల్లాలోని చెరువులకు అనుసంధానం ఎందుకు చేయలేపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకొని అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ములుగు మండలంలోని బొగ్గులవాగు పైన డ్యాం నిర్మించినట్లయితే మూడు వందల ఎకరాల భూమికి సాగునీరు అందుతుందన్నారు. అలాగే వర్షాకాలంలో రహదారి సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని, అలాగే పొట్లాపూర్ వద్ద గల ఏదుళ్ల చెరువు దగ్గర నుండి నర్సంపేట రంగాయ చెరువుకు తరలిస్తు న్న నీటిని ఏదుళ్ల చెరువు దగ్గర చెక్ పాయింట్ పెట్టినట్లయితే ఈ ప్రాంతంలోని వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇంకా వాజేడు మండలంలోని మోడికుంట వాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంకా అనేక గ్రామాలలో నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పూర్తిస్థాయిలో హక్కు పత్రాలు అందించాలని సూచించారు. రుణమాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలకు పూర్తిగా అండదండలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జంపాల రవీందర్, రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి, మామిడాల సమ్మిరెడ్డి, మంద సదాలక్ష్మి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండి అంజద్ పాష, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బండి నర్సయ్య, గడ్డం క్రిష్ణ, బండారి శ్రీనివాస్, నాసర్, అనంతరం జిల్లా నూతన కమి టీ ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జక్కుల అయిలయ్య, మాతంగి శ్యామ్, ముత్తయ్య, లక్ష్మ య్య, రమేష్, సమ్మయ్య, కొక్కుల రాజేందర్, తోట సంపత్, బక్కన్న, గొంది సాంబయ్య, వెంకట్రాం, సాంబయ్య, శ్రీను, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అండ.. ఎఐఎస్‌ఎఫ్ జెండా

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** హైదరాబాద్ రాజధానిలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు భవిష్యత్ కార్యాచరణ పలు సమస్యలపై ఈ సమావేశంలో చర్చలు జరుగుతాయని కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న జాతీయ నూతన విద్యా విధానం, దేశ విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టు అని దీనిపై విద్యార్థులు సంఘటితమై పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన అన్నారు. విద్య కేంద్రీకరణ, విద్య వ్యాపారీ కరణ, విద్య కార్పొరేటీకరణ, విద్య కాషాయీకరణతో పాటు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీస్తూ వీటిని మూడు నాలుగు రకాలుగా విభజించి కుట్ర పడుతున్నారని,ఇందుకు ఇటీవల విడుదల చేసిన యుజిసి ప్రతిపాదనలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారినే నియమిస్తున్నారని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 10% జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించకుండా ఎలా ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తారని ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందపరచకపోవడంతో పేదవారికి ఉచిత విద్య లేనట్టేనని తేటతెల్లాం అయిపోయిందని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్, పదాలను డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముష్కరులకు తొత్తుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్ వీరసవర్కర్, మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో అంతర్యం ఏమిటో మేధావులు విద్యావంతులు అర్థం చేసుకోవాలని,దేశ చరిత్రను తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బిజెపి ముందుందన్నారు.

యావత్ విద్యార్థులు ఈ కు ట్రను పసిగట్టి విద్యారంగ సమస్యలపై కేంద్ర ప్ర భుత్వం చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు పసిగట్టి తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు 7850 కోట్లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నా వాటిని వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# భూమి లేని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు రూ. 12వేలు ఇవ్వాలి : బికెఎంయు

### ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో భూమిలేని వ్యవసాయ కుటుంబానికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఖమ్మంజిల్లా సమితి సమావేశం బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి అధికారం చేపట్టిందన్నారు. ఏళ్లు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. భూమి లేని వ్యవసాయ కార్మికులకు రూ. 12వేలు ఇస్తామని హామీ ఇచ్చి గ్రామసభల్లో ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పని దినాలు చేసి ఉండాలనే నిబంధన పెట్టడం వల్ల సదరు పథకానికి భూమి లేని వ్యవసాయ కుటుంబాలను దూరం చేసిందన్నారు. రోజు వారి కూలీ ఇస్తేనే పూటగడవని పరిస్థితిలో ఉన్న ఈ కుటుంబాలు జీవనోపాధి కోసం వేరే రోజు వారి పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకోవాల్సి ఉన్నందున ఉపాధి హామీ పనుల్లో 20 రోజుల పాటు చేయలేకపోతున్నారు. అట్టి నిబంధనను సవరించి భూమి లేని ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబాన్ని గుర్తించి రూ. 12వేల సాయం చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో పెన్షన్ మీద ఆధారపడే వివిధ రకాల పెన్షన్‌దారులకు అధికారంలోకి రాగానే రెండు వేల నుంచి నాలుగువేలకు పెంచి ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏళ్లు గడిచినా ఇవ్వడం లేదన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలలో ఉపాధి హామీ పనులను కొనసాగించాలని లేదా పట్టణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకు రావాలని తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పగిళ్ల వీరభద్రం, సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు, జిల్లా నాయకులు కళ్లెపు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# పేదలపై భారాలు తగ్గించాలి, కొనుగోలు శక్తి పెంచాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, పేదలపై భారాలు మోపేలా ప్రవేశపెట్టడానీ డిహెచ్‌పిఎస్ వ్యతిరేకిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) బుధవారం భువనగిరి జిల్లా సమావేశం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో కె.దయాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు హాజరైనారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఖనిజ సంపద లూటీ కోసం అడవులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టాలని మోడీ సర్కారు చూస్తున్న తీరును ఎండగట్టారు. 30 కోట్ల మంది ఉపాధి కూలీలకు రూ.2 లక్షల కోట్లు ఎందుకు కేటాయించలేదు? చేతులెందుకు రావట్లేదు? కనీస వేతనం రూ.26 వేలు వేతనం ఈ దేశంలో ఉండకూడదా అన్నారు. రైతులను కూలీలుగా మార్చేందు కు, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు రూ.10 వేల కోట్లను తగ్గించారనీ, సబ్సిడీలను కుదించారని వివరించారు. రైతులు, కార్మికులు, కూలీలకు వ్యతిరేకంగా ఉంటే ఇది ప్రజా బడ్జెట్ ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. ఒక్క శాతం కార్పొరేట్ల చేతుల్లో 40 శాతం దేశసంపద పోగుబడుతుంటే ఇంకెన్నాళ్లు అన్నారు. బడ్జెట్‌లో సరిగా కేటాయింపులు లేవన్నారు.16 శాతం దళితులకు ఐదు శాతం కేటాయించడమేంటి? వారికి దక్కాల్సిన 11 శాతాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సలగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, లక్ష్మ య్య, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## 15న జాబ్ మేళా



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ఐటిఐ క్యాంపస్ లో ఫిబ్రవరి 15న శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి అబ్దుస్ సుబాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీని అగ్రి ల్యాబ్స్‌లో 50 అగ్రికల్చర్ ఫీల్డ్ స్టాఫ్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీయట్, డిగ్రీ, డిప్లమా ఇన్ అగ్రికల్చర్, డిప్లమా ఇన్ ఆర్టీకల్చర్ విద్యా అర్హత ఉన్నవారు అర్హులని, ఎన్నికైన వారికి నేరుగా ఉద్యోగం కల్పించడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 36760047444 ను సంప్రదించాలన్నారు.

# మహానగరి

## రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక



**ప్రజాపక్షం/బషీరాబాద్ :** రాష్ట్ర స్థాయిలో ఈనెల 28న హైదరాబాద్‌లో జరుగనున్న సైన్స్ సమినార్‌కు బషీరాబాద్ మండలం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి యాసీన్ ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వందల దరఖాస్తులలో జాతీయ కమిటీ ఎంపిక చేసిన 31మందిలో యాసీన్ ఒకరు. అభ్యసన పునర్బలనం కోసం సాంకేతిక క్రీడా పద్ధతి అంశంపై సెమినార్ తయారు చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు యాసీన్ ఎంపికయ్యారు. యాసీన్ ప్రస్తుతం ఎస్‌సిఇఆర్‌టిలో ఫ్యాకల్టీ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.

## చెరువులు కాపాడుకోవాలి : సిపిఐ



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చెరువులు కబ్జాలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్ ఏఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాంపేట పరిధిలో తుర్కా చెరువు, శ్రీరామ్ కుంట చెరువును సందర్శించిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ చెరువులను కాపాడాలని అధికారులను కొరడాన్ని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం పరిధిలో 65 ఎకరాలలో విస్తరించిన పరికి చెరువు గత బిఆర్‌ఎస్ హయంలో సగం కబ్జా కాగా మిగిలి ఉన్న సగం కూడా కబ్జాకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరికి చెరువు ను సందర్శించిన అనంతరం స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కబ్జాలు అపుతామని , చెరువులను కాపాడుతామని, కబ్జా దారులను శిక్షిస్తామని చెప్పిన కబ్జాదారులను శిక్షిస్తామని చెప్పినప్పటికీ, కబ్జాదారులు ఎలాంటి భయం లేకుండా కబ్జా చేస్తున్నారన్నారు. చెరువును కాపాడుకోవడానికి నిత్యం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు స్వామి, ఏఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి జైలర్‌పై బదిలీ వేటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చర్లపల్లి సెంట్రల్ జైలులో జైలర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సత్తయ్యపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. సంగారెడ్డి జిల్లా జైలు అధికారి చింతల దశరథంతో కలిసి మద్యం మత్తులో గొడవ పడటంతో, హైదరాబాద్ రేంజ్ డిఐజి శ్రీనివాస్ రావు విచారణ జరిపి, జైలర్ సత్తయ్యను చర్లపల్లి జైలు నుండి సంగారెడ్డి కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు. చింతల దశరథంపై విచారణ కొనసాగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. జైలర్ సత్తయ్య, పేరు మోసిన రౌడీషీటర్ లల్లు కు సహకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. అదే సమయంలో, చర్లపల్లి జైలు వార్డెన్లుగా పనిచేస్తున్న రహీముద్దీన్, లింగయ్యలు గంజాయి సరఫరాలో ప్రమేయం ఉన్నారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, జైలు సుపరిండెంట్ రామచంద్రం వారిని జైలు బయట విధులు నిర్వహించాలని ఆదేశించారు.

## బాక్సింగ్‌లో వర్షితకు పతకం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన వర్షితను తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ బుధవారం సన్మానించి అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ ఇష్రత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. వర్షిత గోల్డ్ మెడల్ సాధించడం కళాశాలకు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమలో వైస్ ప్రిన్సిపల్ చేతన, అకాడమిక వైస్ ప్రిన్సిపల్ స్రవంతి, ఫిజికల్ డైరక్టర్ హైమావతి, హౌజ్ మాస్టర్ అనుపమ, కల్చరల్ కోఆర్డినేటర్ ధనవేణి, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఎ సభ్యుడిగా జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఆర్‌టిఎ) సభ్యుడుగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం మేడ్చల్ జిల్లా ఆర్‌టిఎ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ తూంకుంట మున్సిపల్ పరిదిలోని దేవరయాంజాల్‌లో జైపాల్ రెడ్డి నివాసానికి విచ్చేసి నియామక పత్రం అందజేశారు. అనంతరం జైపాల్‌రెడ్డిని ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ సన్మానించారు.

## అనంతగిరి అడవిలో చిరుత సంచారం

ధృవీకరించిన ఫారెస్ట్ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్




**ప్రజాపక్షం/ వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా పరిధిలోని అనంతగిరి అడవిలో వికారాబాద్ నుంచి తాండూర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై చిరుత రోడ్డు దాటుతు వాహనదారులకు కన్పించింది. దీనిని జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్ ధృవీకరించారు. ఫారెస్టులోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లడకూడదని సూచించారు. ఫారెస్టు అధికారులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. చిరుత ఒక్క జాగాలోనే ఉండదని అది తిరుగుతూ ఉంటుందని ఎవరికైనా కనిపిస్తే అటవి శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి సూచించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



**ప్రజాపక్షం/పూడుర్:** పూడుర్ మండల పరిధిలోని సోమన్గుర్తి గ్రామనికి సిఎచ్ కృష్ణ అనారోగ్యంగా ఉన్నాడని తెలిసిన వెంటనే పరిగి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు రాంమోహన్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2లక్షల రూపాయలు ఎల్‌ఓసిని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రఘునాద్‌రెడ్డి, సురేందర్ ముదిరాజ్, భాస్కర్, అబ్రహం, ఎండి అలీ, ఎండి ఇలియాస్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు అమ్మకపోతే చంపేస్తా

బాధితుడి ఇంటిపై దాడి చేసి వార్నింగ్ ఇచ్చిన నయీమ్ అనుచరుడు

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి తొమ్మిది ఏళ్ల తరువాత అతడి అనుచరులు తిరిగి బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. ఆపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అమ్మేయాలంటూ సైదాబాద్‌లో నివాసముంటున్న మిర్చి వ్యాపారిని నయీమ్ అనుచరుడు రెండేళ్లుగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వినకపోవడంతో బాధితుడి ఇంటిపై దాడి చేసి అతడి కుటుంబ సభ్యులను కొట్టాడు. మార్చి 30లోపు ఇల్లు అమ్మాలని లేని పక్షంలో చంపేస్తానని వార్నింగ్ ఇచ్చిన ఘటన బుధవారం సైదాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వై.ప్రకాశ్‌రెడ్డి తన కుటుంబంతో కలిసి సైదాబాద్‌లోని లక్ష్మి అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెంబర్ ఒకటిలో 20 ఏళ్లుగా నివాసముంటున్నాడు. తొమ్మిది ఫ్లాట్స్ ఉన్న ఆపార్ట్‌మెంట్‌పై నయీమ్ అనుచరుడు పి.శ్రీహరి కన్ను పడింది. ముందుగా పెంట్‌హౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. మెల్లిమెల్లిగా దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత నాలుగు ఫ్లాట్స్ యజమానులను నయానోభయానో చేసి వాటిని కూడా స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత అతని కన్ను ప్రకాశ్‌రెడ్డి నివాసముంటున్న ఫ్లాట్‌పై పడింది. తనకు ఆ ఫ్లాట్ అమ్మాలంటూ రెండేళ్ల నుంచి బెదిరిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే నీళ్లు, గేటు, అపార్ట్‌మెంట్‌పైకి రానీయక ఆటంకాలు కల్పించాడు. అయినా తాను ఫ్లాట్‌ను అమ్మనని ప్రకాశ్‌రెడ్డి ఖరాకండిగా చెప్పేశాడు. దీంతో రెచ్చిపోయిన శ్రీహరి అతని కుమారుడు ప్రసాద్, కూతురు పింకి, భార్య మాధవిలు బాధితుడి ఇంటిపై ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో ప్రకాష్ రెడ్డి ఇంట్లో లేడు. ఇంట్లో ఉన్న ప్రకాష్‌రెడ్డి భార్య అనురాధ, కుమారుడు శ్యాం సుందర్‌రెడ్డి, అల్లుడు సంతోష్‌లను కడుపులో తన్ని కొట్టాడు. అడ్డువచ్చిన గర్భవతిఐన కోడలును సైతం కొట్టారు. "మేము నయీమ్ అనుచరులం.. చాలా హత్యలు చేశాం..మార్చి 30 లోపు ఫ్లాట్ ఖాళీ చేయకుంటే ఏప్రిల్‌లో అందర్ని చంపేస్తాం..ఎస్‌సిఎస్‌టి కేసులు పెట్టి జైలులకు పంపిస్తాం'' అంటూ బాధితులకు వార్నింట్ ఇచ్చి వెళ్లిపోయాడు. ప్రకాశ్‌రెడ్డి ఇంట్లో వారం రోజుల్లో కుమారుడి పెళ్లి ఉండడంతో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. శ్రీహరి వార్నింగ్ ఇచ్చినట్లుగానే సైదాబాద్‌లో బాధితులపై మంగళవారం ఎస్‌సిఎస్‌టి కేసు పెట్టించాడు. దీంతో బాధితులు అసలు జరిగిన విషయాలపై ఈస్ట్‌సౌత్ జోన్ డిసిపి, సైదాబాద్ ఎసిపి, సిఐలకు శ్రీహరి ఆగడాలపై బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా నయీమ్ ఎన్‌కౌంటర్ మరుసటి రోజే అతని అనుచరుడైన శ్రీహరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిపై నల్లగొండ, హైదరాబాద్, రాచకొండలో పలుకేసులు న్నాయి. పిడి యాక్ట్ విధించడంతో ఏడాది కాలం జైలు జీవితం గడిపి విడుదలయ్యాడు. అయినా పద్ధతి మార్చుకోక బెదిరింపులకు పాల్పడడం గమనార్హం.

## విద్యార్థులకు చదవుతో పాటు ఆటలు అవసరం : ఉమాహారతి




**ప్రజాపక్షం/పరిగి :** విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు అవసరమని జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ ఉమాహారతి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా పరిధిలోని మహిళ శిశుసంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో వేడుకల్లో భాగంగా కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ , కోకో ఆటలు పోటీలను జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ ఉమహరతి జెండా ఊపి ఆటలు పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబడ్డి , కోకో జట్టుతో మొదట మండల్ లెవల్లో ఆడించి ,మండల్‌లో గెలుపోందిన వారిని నియోజకవర్గం లెవల్లో ఆటలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆటలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగానే కాకుండా మనిషి దృడంగా ఉంటారన్నారు. ప్రతీ ఒక్కరు ఆటలకు సమయం ఇవ్వాలని ఆటలో చురుకుగా ఉంటే చదువులో కూడా ముందుంటారని విద్యార్థులకు చదవు తో పాటు ఆటలు అవసరం అన్నారు. పోటీల్లో మొదటి స్థానం నిలిచింది దోమ కేజీబీవీ విద్యార్థులు , కోకో మొదటిస్థానం పూడుర్ కేజీబీవీ విద్యార్థులు విజయం సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా సాధికారత బృందం పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దేముల్ :** ఎల్‌ఎన్‌ఆర్ యువసేన, అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణా శిభిరం పోస్టర్లను తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం తాండూరులోని క్యాంపు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణను అందించడం ఎల్‌ఎన్‌ఆర్ యువసేన, అభయ పౌండేషన్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎన్‌ఆర్ యువసేన వ్యవస్థాపకులు లొంక నర్సిములు, టిపిపిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆటవస్తువుల పంపిణీ

కాంగ్రెస్ నాయకులు ఉప్పరి మల్లేశం జన్మదిన వేడుకులు బుధవారం తాండూరులో ఘనంగా జరుపుకున్నారు. మల్లేశం జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రమైన పెద్దేముల్‌లోని ప్రభు త్వం పాఠశాలలో విద్యార్థులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి హాజరై మల్లేశంకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, తాండూరు మార్కెటీ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, ధారాసింగ్ తదితర నేతలు పాల్గొన్నారు.

# మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాసం ఉంటుంది!

మాజీమంత్రి, బిఆర్‌ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరమేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డిలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ సమయంలో బిఆర్‌ఎస్ ఎలాంటి ప్లాన్ చేస్తుందనేది ఇప్పుడు అందరిలో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత పాలక మండలికి నాలుగేళ్లు పూర్తి కావడంతో ఏ క్షణంలోనైనా మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాసం పెట్టేందుకు బిఆర్‌ఎస్, బిజెపి రెండు పార్టీ లు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈక్రమంలోనే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జిహెచ్‌ఎంసి రాజకీయాలపై వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి కెటిఆర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని వెల్లడించారు. పరిస్థితులకు అనుగుణంగా మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై నిర్ణయం ఉంటుందన్నారు. నెంబర్ గేమ్‌ను బట్టి మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాసం ఉంటుందన్నారు.

### తెలంగాణలో బిసి ఉద్యమం బలంగా ఉంది

బిసి ఉద్యమం తెలంగాణ రాష్ట్రంలో బలంగా ఉందని మాజీమంత్రి, బిఆర్‌ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన కులగణన సర్వేలో చాలా తప్పులు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కెసిఆర్ చేసిన సర్వేలో బిసిలకు 51 శాతం మంది ఉన్నారని చెప్పారు. తెలంగాణలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలు 90 శాతం మంది ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో కోటి మందికిపైగా పిల్లలున్నారని చెప్పారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి లెక్కలు లేవన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తలసాని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే బిసిలు ఒప్పుకోరని చెప్పుకొచ్చారు. పునర్విభజన జరిగితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు తెలంగాణకు తగ్గుతాయన్నారు. ప్రభుత్వం రీసర్వే చేస్తే కెసిఆర్, కెటిఆర్, బిఆర్‌ఎస్ నేతలు సర్వేలో పాల్గొంటారని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేశాక రేవంత్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై బిసి సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

# రైతులకు రాయితీపై తుంపర్ల సేద్యం యూనిట్లు

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు రాయితీపై తుంపర్ల సేద్యం యూనిటర్లను పంపిణీ చేస్తుందని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు ఎంపిడిఒ కార్యాలయంలో 111మంది లబ్ధిదారులకు 75శాతం రాయితీపై మంజూరైన తుంపర సేద్యం యూనిట్లను ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాయితీలకు చోటు లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రాయితీపై వ్యవసాయ పరికాలను పునర్‌ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవడానికి తుంపర్ల సేద్యం పరికరాలు లాభధాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, వ్యవసాయశాఖాధికారులు, రైతులు ఉన్నారు.



### జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి హమీచ్చారు. బుధవారం టియుడబ్ల్యుజె (ఐజెయు) తాండూరు డివిజన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో జిపిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన జర్నలిస్టుల ఆత్మీయ సమావేశానికి ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అర్హులైన నిజమైన జర్నలిస్టుల ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేస్తానన్నారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

**హౌజింగ్ కమిటి ఏర్పాటు...** అర్హులైన ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్, ఇంటి స్థలాల ఎంపిక కోసం టియుడబ్ల్యుజె (ఐజెయు) తాండూరు డివిజన్ హౌజింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. పట్టణ కమిటీ సభ్యులు రామకృష్ణ, గోపాల్, తాండూరు మండల కమిటీ సభ్యులుగా సంగమేష్, వెంకట్రాంరెడ్డి, యాలాల మండల కమిటీ సభ్యులుగా జావిద్, బషీరాబాద్ మండల కమిటీ సభ్యులు శివకుమార్, పెద్దేముల్ మండల కమిటీ సభ్యులుగా కృష్ణలను ఎన్నుకున్నారు. సమావేశంలో జర్నలిస్టులు ప్రభాకర్, రాంచద్రయ్య, ఆర్‌విరెడ్డి, రాంరెడ్డి,లింగేష్, శివానంద్, నరేందర్‌లతో నాలుగు మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సిఎం సహాయనిధి పేదలకు వరమని, ఆర్థిక ఇబ్బందులతో వైద్యానికి నోచుకోలేని పేద కుటుంబీకులు సిఎం రిలీఫ్ ఫండ్ స్కీమ్‌ను వినియోగించుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ పథకం కింద చికిత్సకు అవసరమైన ఆర్థికసాయం లభిస్తుందని, అవసరమైన వారు తనను సంప్రదించాలని కోరారు. బుధవారం మిర్జాలగూడ ప్రాంతానికి చెందిన లావణ్యకు ఈ స్కీమ్ కింద మంజూరైన రూ. 39 వేల చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌతం నగర్ కార్పొరేటర్ మేకల సునీత, బిఆర్‌ఎస్ నేతలు రాము యాదవ్, బైరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## రెడిమిక్స్ ఘటనలో యువతి మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలో బస్సు కొరకు వేచియున్న ఇద్దరి యువతుల పైకి రెడిమిక్స్ వాహనం దూసుకొచ్చిన ఘటనలో తీవ్రంగా గాయపడిన కొర్వి భవాణి(19) అస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. సోమవారం బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు యువతులపైకి రెడిమిక్స్ వాహనం దూసుకురావడంతో ఇద్దరికి గాయలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను కొంపల్లిలోని శ్రీకర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా కొరివి భవాణి మంగళవారం మృతి చెందింది. మరో యువతి కోరివి గాయత్రిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం నగరంలోని యశోద ఆస్పత్రికి తరలించామని బాధిత కుటుంబీకులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో..

**ప్రజాపక్షం/బంట్వారం :** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన బంట్వారం మండల పరిధిలో తోర్మామిడి గ్రామంలో జరిగింది. పోలీసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, ముస్కాన్ బేగం (21) 8 నెలల గర్భవతి ఉండగా అబార్షన్ కావడంతో మంగళవారం రాత్రి మృతిచెందింది. తన కూతురు ముస్కాన్ బేగం మృతికి ఆమె భర్త సైఫ్ ఖాన్ కారణమని ముస్కాన్ బేగం తండ్రి షేక్ జమీరుద్దీన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్‌ఐ కేసు నమోదు చేసి శవ పరీక్ష అనంతరం మృత దేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు.

# కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

పరోక్షంగా సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దొమ్మరపోచంపల్లి సర్వే నంబర్ 120/11 ప్రభుత్వ భూమిలో కంటైనర్లు, బేస్‌మెంట్ నిర్మాణాలు చేపడుతూ జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల సమన్వయ లోపంతోనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కబ్జాదారులు అడ్డదారిలో కోర్టు ఆర్డర్స్ తెచ్చుకొని ప్రభుత్వం భూమిని కాజేసేందుకు పక్కా స్కెచ్ వేశారు అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ రావు ఐపీఎస్ ఆదేశాలతో 2016 లో స్థానిక రెవెన్యూ అధికారులు అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల కోసం కేటాయించారు. స్థానిక ఎమ్యెల్యే కె.పి.వివేకానంద, ఎమ్యెల్సీ శంభిపూర్ రాజు లు ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో కలిసి హాస్టల్ భవన నిర్మాణాల కోసం 2019లో శంకుస్థాపన చేశారు. కబ్జాదారులు కోర్టును ఆశ్రయించడంతో హాస్టల్ భనన నిర్మాణానికి బ్రేక్ పడింది. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా సదరు భూమిలో కంటైనర్లు, బేస్‌మెంట్ నిర్మాణాలు చేపడుతూ కబ్జాల పర్వం జోరుగా సాగిస్తున్నారు. కోర్ట్ ఆఫ్ కంటెంప్ట్ కింద కేసులు నమోదవుతున్నాయంటూ రెవెన్యూ,ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు తప్పించుకుంటున్న తీరు అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అధికారుల సమన్వయలోపంతో గత 6 నెలల నుండి కబ్జాల పర్వం జోరందుకుంది,కాసులకు కక్కుర్తి పడుతున్న రెవెన్యూ అధికారులు కబ్జాదారులు పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలం కబ్జాలతో కనుమరుగవుతుంటే సంబంధిత అధికారులు సంబంధంలేనట్లుగా వ్యవహరిస్తున్నారు.



### కబ్జాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు : ఆర్‌డిఒ

సర్వే నంబర్ 120 ప్రభుత్వ భూమిలో వివరణ కోరగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు,2016 లో సర్వే నంబర్ 120 లో కొంత భూమిని ట్రైబల్ వెల్ఫేర్ విభాగానికి కేటాయించామన్నారు. కబ్జాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయని, తొలగించాలంటూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములలో అక్రమనిర్మాణాలు చేపడితే పిడీ యాక్ట్ నమోదు చేస్తామని కబ్జాదారులు హెచ్చరించారు. అధికారులు అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**ప్రజాపక్షం/తలకొండపల్లి:** మండలంలోని చుక్కాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు విద్యను బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాణాంతం,ఉపాధ్యాయులు క్రిష్ణయ్య,సహేనాజ్ సుల్తానా,బాల్ కోటి,కవిత,కొండల్ రెడ్డి,శ్రీనివాసులు,భారతమ్మ,శంకర్ ఉన్నారు.

# మహానగరి

## ప్రత్యేక మండల ఎర్పాటుకు ఎంపికి వినతి



**ప్రజాపక్షం/తలకొండపల్లి:** తమ గ్రామాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గట్టు ఇప్పలపల్లి గ్రామ జెవిసి అధ్యర్యంలో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గట్టుఇప్పలపల్లి జెవిసి నాయకులు శ్రీనివాస్ రెడ్డి,వెంకటయ్య యాదవ్,రేణురెడ్డి,డేవిడ్,అశోక్ తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన భీంభరత్



**ప్రజాపక్షం/షాబాద్ :** చేవెళ్ల నియోజవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని బుధవారం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. చేవెళ్ల నియోజవర్గ ఎన్నికలప్పటి నుండి ఇప్పటి వరకు నిరంతరం పార్టీకి పని చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు న్యాయం జరిగడం లేదని వివరించారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఖాలీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను పార్టీకి చిత్త శుద్ధితో పని చేసిన వారికి ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో పార్టీకి కష్టపడి పని చేస్తున్న నాయకులకు స్థానిక ఎన్నికల్లో అవకాశాలు కల్పించేందుకు అవకావం ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకులంగా స్పందించి పార్టీ కష్టపడిన వారికి అండగా ఉంటామని, చేవెళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి అదర్శంగా అభివృద్ధిలో రాణించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చిన్నట్లు భీంభరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారయణ రెడ్డి, రాష్ట అధికార ప్రతినిధి గౌరిసతీష్, చేవెళ్ల సింగిల్ విండొ చైర్మెన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు బర్ల యాదయ్య, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంసి ప్లాట్ సీజ్ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/గండిపేట:** శంషాబాద్ మండల పరిధిలోని శంషాబాద్, కొత్వాల్ గూడ ప్రాంతాలలో కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న 21 ఆర్‌ఎంసి ప్లాంట్లను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలతో శంషాబాద్ తాసిల్దార్ రవీందర్ దట్ తన సిబ్బంది ఆదేశానుసారం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కృష్ణ ,సారిక, సిబ్బందితో అక్కడికి చేరుకొని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్‌ఎంసి ప్లాట్‌ల నుంచి చాలా రోజులుగా కాలుష్యం ఏర్పడుతుందని స్థానికుల నుంచి తీవ్రస్థాయి లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సలీం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం




**ప్రజాపక్షం/గండిపేట:** నార్సింగి మున్సిపాలిటీ మాజీ మున్సిపల్ చైర్పర్సన్ నాగపూర్ణ,వైస్ చైర్మన్ విజయ్ బాబు ,కౌన్సిలర్స్ జి. శివారెడ్డి ,దుర్గేష్ యాదవులను కోకాపేట్ గవర్నమెంట్ స్కూల్లో బుధవారం సన్మానించిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మమ్ములను సన్మానించడం చాలా సంతోషకరమైన విషయమని వారు అన్నారు. కోకాపేట్ గవర్నమెంట్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అలివేళ్ళు, మాట్లాడుతూ అధికారంలో ఉన్నంతకాలం గవర్నమెంట్ స్కూల్ పిల్లలకు కావలసిన సౌకర్యాలను అందించడంలో ముందున్నందుకు వారిని ఘనంగా స న్మానించామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాల్వంత్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, నాగేష్ యూత్ సభ్యులు శాంతి రెడ్డి , విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : చల్లా



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి సూచించారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కెపురం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షలత ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీల్లోనూ సత్తాచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ క్రీడలను యువత సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని నిర్థవెల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వర్గీయ ఆకుల రుక్కమ్మ శ్రీరాములు జ్ఞాపకార్థం వారి వారసులు ఆకుల వెంకటేష్ శ్రీశైలం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అభినంధించారు. విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కా ర్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సురేందర్, నిర్థవెల్లి మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రాంచందర్‌నాయక్, పోమాల్‌పల్లి మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నిర్వాహకులు ఫైజాన్, వెంకటేష్, మహేష్, భారత్, శివ, రామాంజన్‌రెడ్డిలు పాల్గొన్నారు.



# హైడ్రాకు ఫిర్యాదు చేసి ఆక్రమణలు తొలగిస్తాం

వర్షాకాలంలోపు బాక్స్ డ్రైన్లు, పూర్తిచేసి వరద ముంపు సమస్యలకు పరిష్కారం చూపుతాం

హస్తినాపురం, చంపాపేట డివిజన్‌లో పర్యటించిన మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్/ సరూర్ నగర్ :** గత పదేళ్ల కాలంలో కొందరు రాజకీయ నేతలు అండదండలతో ఎల్‌బి నగర్‌లో చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయని, హైడ్రాకు ఫిర్యాదు చేసి ఆ కబ్జాలను తొలగిస్తామని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. బుధవారం హస్తినాపురం, చెంపాపేట డివిజన్‌లో జిహెచ్‌ఎంసి ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌లతో కలిసి వరద ముంప్పు ప్రాంతాలను పరిశీలించారు. అసంపూర్తిగా కాలనీలలో నీటి నాలా పనులు నిలిచిపోయిన నేపథ్యంలో.. ఆ నాలాను పరిశీలించారు. నాలా పనులకు సంబంధించిన మ్యాప్‌ను ఈ సందర్భంగా పరిశీలించగా, కాలనీ వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కూడా మధుయాష్కీకి, జోనల్ కమిషనర్‌కు వారు వివరించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ నాలాలు చెరువులు ఆక్రమణకు నిదర్శనం హస్తినాపురంలోని చేపల చెరువు అని.. ఆ చెరువు ప్రాంతమంతా ఆక్రమణ గురైందని పేర్కొన్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేసి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఎస్‌ఎన్‌డిపి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న నాలా నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని, వచ్చే వర్షాకాలంలోపు ఆయా కాలనీ వాసులకు వరద నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. నిర్ణీత సమయంలోపే బాక్స్ డ్రైన్‌ను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఓ ఫంక్షన్ హాల్‌కు చెందిన వ్యక్తులు నాలాను ఆక్రమించి పార్కింగ్ కోసం చేపట్టిన నిర్మాణాలపై స్థానికులు ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన మధుయాష్కీ నాలా ఆక్రమణలు వెంకటనే తొలగించేలా అధికారులు చర్యలు చేపడతారన్నారు. హస్తినాపురంలోని వరద ముంప్పు కాలనీలు వందనపురి, ఎంక్లేవ్, రెడ్డి కాలనీలలో వరద ప్రభావం ఉన్న కాలనీలపై స్థానిక కార్పొరేటర్ సుజాత నాయక్‌తో కలిసి పర్యాటించారు. రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, టిపిసిసి కార్యదర్శి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, లింగాల కిషోర్ గౌడ్, కుట్ల నర్సింహ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డ సత్యనారాయణ, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నల్ల రఘుమారెడ్డి, సాయి నికేష్, బద్రీనాథ్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సేవకే నా జీవితం అంకితం

ఎంఎల్‌సి కూర రఘోత్తంరెడ్డి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన లేని కార్పొరేట్ వ్యక్తికి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించడం సరికాదని, అలాంటి వారిని గెలిపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపక ఉనికికే ప్రమాదం వాటిల్లవచ్చని ఎంఎల్‌సి కూర రఘోత్తంరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ సేవకే తన జీవితం అంకితమని, అందుకు మరోసారి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలో దిగుతున్నానని తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎంఎల్‌సిగా తాను సింగరేణి పాఠశాల టీచర్లకు 30శాతం ఫిట్‌మెట్ సాధించటంలో కీలక పాత్ర పోషించానని తెలిపారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేశానని గుర్తుచేశారు. ఎన్నడూ లేనివిధంగా సిట్టింగ్ ఎంఎల్‌సిని కాదని, సంఘానికి ఎలాంటి బాధ్యత వహించని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడ వెనుక అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

## నేతకాని, మహార్‌లకు ప్రత్యేక గ్రూప్ ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వానికి మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ఎస్‌సి వర్గీకరణలో భాగంగా గ్రూప్–సిలో చేర్చిన నేతకాని, మహార్ కులాలను కలిపి ఒక ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాలలతో ఉన్న గ్రూప్‌లో తాము ఉండలేమని వారు కోరుకొంటున్నారని స్పష్టంచేశారు. 32లక్షలున్న మాదిగలే, 15లక్షల మంది ఉన్న మాలలతో నిలదొక్కుకోలేకపోయారని పేర్కొన్నారు. లక్షన్నర ఉన్న నేతకాని, మహర్లు మాలలతో ఎలా తట్టుకొంటారన్న విషయంపై అందరికీ సందేహం ఉన్నదన్నారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎంపి వెంకటేశ్ నేతతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితుల్లో ఏ వర్గానికి అన్యాయం జరిగినా ఎంఆర్‌పిఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. మాల, మాదిగలకు ఎంఆర్‌ఓ నుంచి జారీ చేస్తున్న విధంగానే మహర్లకు కూడా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తాను మాలలకు వ్యతిరేకం కాదని, కొంతమంది వ్యతిరేకులు తనను ఆవిధంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మాలల కోసం పోరాడిన చరిత్ర ఎంఆర్‌పిఎస్‌కు ఉన్నదని గుర్తుచేశారు. మాజీఎంపి వెంకటేశ్ నేత మాట్లాడుతూ నేతకాని, మహర్ కులాలకు చెందిన తాము గ్రూప్–సిలోని మాలలతో పోటీపడలేమన్నారు. ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగపరమైన అవకాశాలను మాలలే గుంజుకొంటారని, అందుకే తమకు ప్రత్యేక గ్రూప్‌గా పరిగణించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు గోవింద్ నరేశ్ మాదిగ, పలువురు మహర్ నేతకాని నేతలు పాల్గొన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం

# 18న కలెక్టరేట్‌ల ముట్టడి

పార్టీపరంగా కోటా వద్దు అసెంబ్లీలో చట్టమే ముఖ్యం : ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 18న కలెక్టరేట్‌లు, ఎంఆర్‌ఒ కార్యాలయాల ముందు ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. బిసిలు తమ కర్తవ్యంగా భావించి ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన 14 బిసి సంఘాల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో బిసిలకు న్యాయం జరగదన్నారు. ఎందుకంటే మిగతా అన్ని పార్టీలు కూడా 42శాతం రిజర్వేషన్లు అంగీకరించకపోతే అగ్రకులాల డబ్బుతో బిసిలు పోటీపడలేరని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలుచేయాల్సిందేనన్నారు. అగ్రకులాలకు 10శాతం ఇడబ్ల్యూఎస్ కోటా అమలు చేశాక, 50శాతం రిజర్వేషన్ల సీలింగ్ పై పార్లమెంట్ రాజ్యాంగసవరణ చేసిందని గుర్తుచేశారు. అన్ని పార్టీలు బిసి బిల్లుకు మద్దతించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం తప్పించుకొంటే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో బిసి ఫ్రంట్ చైర్మన్ గౌరిగె మల్లేశ్ యాదవ్, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నేతలు నందగోపాల్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌బినగర్ కూడలిలో బాపూజీ కాంస్యవిగ్రహం ఏర్పాటు చేస్తాం



**ప్రజాపక్షం, సరూర్‌నగర్ :** ఆచార్యకొండ లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి కులం వారికే కాదు రాష్ట్ర బీసి బహుజనులందరికి బాపూజీ అని మాజీ ఐఎఎస్ అధికారి చిరంజీవులు కొనియాడారు. బుధవారం కొత్తపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన తెలంగాణ బిసి కులాల సమన్వయ వేధిక అధ్యక్షులు బొమ్మ రఘురాంనేత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మగౌరవ నినాదం సభలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, ఇతర సంఘం ప్రతినిధులతో కలిసి చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎల్‌బినగర్ చౌరస్తాలో బాపూజీ నిలువెత్తు కాంస్య విగ్రహ ఏర్పాటు కోసం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్ బాపూజీ అని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని యువకులకు ఆదర్శంగా నిలిచిన గొప్ప స్వాతంత్ర్య సమరయోదుడు అని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధాకార్యధర్శి దుస్స యాదగిరి, పివిటి మార్కెట్ అధ్యక్షుడు కైరంకొండ ధనంజయ, ప్రధాన కార్యధర్శి శ్రీనివాస్, పిడికిలి రాజు, తడక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో అలసత్వం వద్దు

షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో అధికారులు ఆలసత్వం వహించరాదని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయంలో 168 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. వాటిని ప్రణాళిక బద్ధంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సంక్షోభంలో ఉన్నప్పటిని పేదల లబ్ది చేకూరాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాలను కొనసాగిస్తున్నారని వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు గ్రామాల వారిగా సమస్యలను గురించి వాటిని పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని, పేదల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పార్థసారధి, డిప్యూటి తహశీల్దార్ ఆనంద్ సింగ్, ఎంపిడిఓ బన్సిలాల్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నేతలు బస్వం, మాజీ ఎంపిటిసి భార్గవ్‌కుమార్‌రెడ్డి, పుల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, శ్రీనివాస్, జమ్రుద్‌ఖాన్, జంగారి రవి, నెహ్రూనాయక్‌తోపాటు లబ్దిదారులు పాల్గొన్నారు.

### కళాశాల భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాత నాగిళ్ళ గోపాల్‌గుప్త ఒక లక్ష రూపాయాల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం పట్టణంలోని బైపాస్ రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన గోదావరి హోటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రెస్టారెంట్ నిర్వాహకులు తిరుపతి యాదవ్, లక్కాకుల రమేష్‌లతో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎండి ఖాజాపాషా (కెపి), అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, నరసింహారెడ్డి, మల్లేష్, నరేష్, రంగనాథ్, సురేష్‌లు పాల్గొని నిర్వాహకులను అభినంధించారు.

## 24 నుండి నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు

మాజీ జెడ్‌పిటిసి పట్నం అవినాష్ రెడ్డి

**ప్రజాపక్షం/షాబాద్ :** ఈ నెల 24 నుండి నియోజకవర్గ స్థాయి క్రికెట్ క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్‌పిటిసి పట్నం అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ పిఆర్‌ఆర్ స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివంగత నేత పట్నం రాజేందర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా క్రీడలు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత క్రీడకారులకు తమ ప్రతిభ నిరుపించుకునేందుకు మంచి అవకాశం అన్నారు. చేవెళ్ల నియోజవర్గంలోని అన్ని మండలాల నుండి క్రీడకారులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. పాల్గొనే క్రీడకారులు తమ ఆధార్ కార్డు నెంబర్ డ్రస్ కోడ్ ఉండాలన్నారు. మొదటి బహుమతి రూ.2లక్షలు, రెండవ బహుమతి 1లక్ష వాలీబాల్ క్రీడ కారులకు మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు నగదు పారితోషకం అందజేస్తున్నట్లు తెలిపారు.

## ఆనంద్‌కుమార్ కుటుంబానికి ప్రేమ్ పరామర్శ



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటన తీవ్రంగా కలిచివేసిందని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోల్కొండకు చెందిన ఆనంద్‌కుమార్ చారీ మృతదేహాన్ని బుధవారం వివేకనంద్‌నగర్‌కు చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ప్రేమ్ ఆనంద్ నివాసానికి చేరుకుని ఆయన పార్టీవదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుంభమేళ నుండి తిరిగి వస్తుండగా జబల్‌పూర్ జిల్లా, సిహోరా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆనంద్ మృతి చెందడం బాధాకరం ఉందని అన్నారు.

## రంగస్థల కళకారుడు బింగి కుమార్ కన్నుమూత

నాన్‌దార్‌ఖాన్ పేట్ గ్రామంలో ఆధ్యాత్మీక చింతనతో కన్నీటి పర్వతమైన అంత్యక్రియలు





**ప్రజాపక్షం/షాబాద్:** రంగస్థల కళకారుడు బింగి కుమార్‌ను కోల్పోవడం రంగస్థల కళాజ్యోతి భజనమండలికి తీరని లోటన షాద్‌నగర్ కళాజ్యోతి బృందం సభ్యుడు రమేష్ విశ్వకర్మ పేర్కొన్నారు. వివరాలలోకి వెళ్లితే రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని నాన్‌ధార్‌ఖాన్ పేట్ గ్రామానికి చెందిన బింగి కుమార్ (45) అతనికి గత రెండు రోజుల క్రితం మెదడులో నరలు బలహీనత వలన సృహకోల్పవడం జరిగింది. అతని వెంటనే నగరంలోని సాయి కృష్ణ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న దైవాల గూడ, షాద్‌నగర్ కళజ్యోతి బృదం నాన్‌దార్‌ఖాన్ పెట్‌కు చేరుకోని ఆధ్యాత్మీక ప్రదర్శనలతో శివనామస్మరణ, ఓం నారాయణ, వాసుదేవా అంటు భక్తి భావంతో కన్నీటి పర్వతమై అంత్యక్రియలు నిర్వహించారు. భగవంతునికి నిత్యం పూజలు చేస్తు, ఆట పాట, కిర్తనలు భగవంతునికి ఆర్పించిన మహ పురుషుడు బింగి కుమార్ అని కొనియాడారు. రంగస్థల కళకారుడు బింగి కుమార్ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం, అతనికి ఆత్మశాంతి ప్రసాధించాలని భగవంతుని వేడుకున్నారు. నాన్‌ధార్ ఖాన్ పేట్‌లో నిర్వహించిన బింగి కుమార్ అంత్యక్రియలు భగవత్‌నామస్మరణతో కన్నీటి పర్వతంగా మారింది. భగవంతుని పార్థించే భక్తులకు ఇలాంటి భావం కల్గిన భక్తజనం , ఆధ్యాత్మీక సంఘాలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయిలో వైద్యసేవలు అభివృద్ధి చేయాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామీణ స్థాయిలో వైద్యసేవలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం కొత్తూరు మండల పరిధిలోని ఎస్‌బి పల్లి గ్రామంలో జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ వర్చువల్ సమావేశం నిర్వహించారు. అదే విధంగా ఎస్‌బిపల్లి సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారి సేవల గురించి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వైద్యసేవలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ అంధిస్తున్న వైద్యసేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరేందుకు అవకాశాలు ఉంటాయని సూచించారు. అదే విధంగా వీరు నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎక్వాస్ జిల్లా, రాష్ట్ర స్థాయి బృందాలు జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ వర్చువల్ ద్వారా పరిశీలించినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాల సంస్థ డాక్టర్ షకీలా ఎస్‌బి పల్లి సబ్ సెంటర్ సేవల గురించి వర్చువల్‌గా మాట్లాడినట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి జాతీయ ప్రమాణాల సంస్థ ధృవపత్రం పొందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక వైద్యాధికారిని డాక్టర్ షకీలాను కోరినట్లు తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు వైద్యా ఆరోగ్య శాఖ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీం కన్సల్టెంట్ రాము, జిల్లా డిపిఎంఓఅక్రమ్, డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, సిహెచ్‌ఓ నాగేష్, హెల్త్ సూపర్‌వైజర్ అనసూయ, ఫార్మసిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ శివకుమార్, డిఈఓ నీరజ, ఏఎన్‌ఎంలు దుర్గా సుజాత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడ

# టీమిండియా ఘన విజయం..



## ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్

అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా క్రికెటర్లు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టారు. మొదట బ్యాటర్లు మెరవగా, తర్వాత బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఆఖరి వన్డేలో టీమిండియా 142 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపొందింది. మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 356 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ 214 పరుగులకు ఆలౌటైంది.
టీమిండియా కెప్టెన్, గత మ్యాచ్ సెంచరీ హీరో రోహిత్ శర్మ (1) త్వరగానే నిష్క్రమించినా, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి వన్ డౌన్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ వికెట్ కాపాడుకుంటూనే దూకుడుగా ఆడారు. ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిన గిల్ 102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 112 పరుగులు చేసి ఔటయ్యాడు. మంచి టచ్‌లో కనిపించిన కోహ్లి 55 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 52 పరుగులు చేశాడు. వీరి తర్వాత వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (64 బంతుల్లో 78), కేఎల్ రాహుల్ (29 బంతుల్లో 40) వేగంగా ఆడడంతో భారత్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించే దిశగా కదిలింది.
అనంతరం 357 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన ఇంగ్లండ తడబడింది. 34.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. టామ్ బాంటన్ (38), అట్కిన్సన్ (38) మాత్రమే చెప్పుకోదగిన స్కోర్లు సాధించారు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (23), బెన్ డకెట్ (34) శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. భారత బౌలర్ల ధాటికి ఇంగ్లండ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్‌కు ఒక్కో వికెట్ దక్కింది.

ఆఖరి వన్డేలో టీమిండియా 142 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపొందింది

## శుభ్‌మన్ గిల్ ఆల్‌టైమ్ రికార్డు!



ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో గిల్ అదరగొడుతున్నాడు. తొలి వన్డేలో 87, రెండో వన్డేలో 60 పరుగులు చేసిన ఈ బ్యాటర్ అహ్మదాబాద్‌లో జరుగుతున్న మూడో వన్డేలో (112; 102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో గిల్ అద్భుతమైన రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా (50 ఇన్నింగ్స్‌లు) 2500 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. అంతకుముందు ఈ రికార్డు సౌతాఫ్రికా మాజీ ఆటగాడు హషీమ్ ఆమ్లా (53 ఇన్నింగ్స్‌లు) పేరిట ఉండేది. అంతేకాదు ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున వేగంగా 2500 రన్స్ చేసిన శ్రేయస్ అయ్యర్ (59 ఇన్నింగ్స్‌లు) రికార్డును బ్రేక్ చేశాడు.

### ఐసిసి ర్యాంకింగ్స్‌లో నంబర్ 2

ఇంగ్లాండ్‌తో మూడో వన్డే ఆరంభానికి ముందు ఐసీసీ ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ (773 పాయింట్లు)ను వెనక్కినెట్టి గిల్ (781 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ (786 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి రెండు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి పడిపోయాడు. శ్రేయస్ అయ్యర్ ఒక స్థానం మెరుగై పదో ర్యాంకు దక్కించుకున్నాడు.

## ఆస్ట్రేలియాపై శ్రీలంక ఘన విజయం



ఆస్ట్రేలియాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన శ్రీలంక.. వన్డే సిరీస్‌లో మాత్రం శుభారంభం చేసింది. రెండు వన్డేల సిరీస్‌లో భాగంగా కొలంబో వేదికగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన శ్రీలంక 49 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలింది. చరిల్ అసలక(126 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్స్‌లతో 127) సెంచరీతో చెలరేగగా..దునిత్ వెల్లాలేగే(30) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ మూడు వికెట్లు తీయగా.. స్పెన్సర్ జాన్సన్, ఆరోన్ హార్డీ, నాథన్ ఎల్లిస్ రెండేసి వికెట్లు పడగొట్టారు. మాథ్యూ షార్ట్ ఓ వికెట్ తీసాడు. అనంతరం ఆస్ట్రేలియా 33.5 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. మార్నస్ లబుషేన్(41), ఆరోన్ హార్డీ(32) టాప్ స్కోరర్లుగా నిలిచారు. శ్రీలంక బౌలర్లలో మహీష్ తీక్షణ(4/40) నాలుగు వికెట్లు తీయగా.. అసిత ఫెర్నాండో రెండు వికెట్లు, వానిందు హసరంగా, చరిత్ అసలంక తలో వికెట్ తీసారు.

## గూస్‌బంప్స్ తెప్పించేలా.. 'కింగ్‌డమ్' టీజర్




టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ విడి12 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చారు చిత్ర యూనిట్. ఈ సినిమాకు 'కింగ్‌డమ్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఇక దీనికి సంబంధించిన టీజర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో సాగిన కింగ్‌డమ్ టీజర్ ప్యూర్ గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ సినిమాలోని మెయిన్ ప్లాట్‌ను ఈ టీజర్‌లో రివీల్ చేశాడు ఎన్టీఆర్. తమ రాజు కోసం వెయిట్ చేస్తున్న ప్రజల కోసం విజయ్ దేవరకొండ ఎలాంటి భీకర యుద్ధానికి సిద్ధమవుతాడు అనేది ఈ సినిమా కథగా ఉండబోతున్నట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక విజయ్ దేవరకొండ పాత్రను ఎలివేట్ చేసిన విధానం అయితే సూపర్ అని చెప్పాలి. టీజర్ చివర్లో విజయ్ దేవరకొండ చెప్పే 'అవసరమైతే మొత్తం తగలబెట్టేస్తా' అనే డైలాగ్ ఈ టీజర్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ టీజర్‌తో ఒక్కసారిగా విజయ్ దేవరకొండ ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేశాడు. అతని లుక్, అతని పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన విధానం ఈ సినిమాపై నెక్స్ట్ లెవెల్ హైప్ క్రియేట్ చేశాయి. అనిరుధ్ రవిచందర్ మరోసారి తనదైన మ్యూజిక్‌తో ఈ టీజర్‌ను మలిచిన తీరు ఆకట్టుకుంటుంది. ఇక ఈ సినిమాను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తనదైన మార్క్ తెరకెక్కించాడు. మొత్తానికి 'కింగ్‌డమ్' టీజర్‌తో ఈ సినిమా ఎలాంటి విధ్వంసం సృష్టించబోతుందో శాంపిల్ చూపెట్టారు అని చెప్పాలి. ఈ ప్రెస్టీజియస్ నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తుండగా మే 30న ప్రపంచవ్యాప్తంగా భారీ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

రీల్

## నా లవ్ 'బ్రేకప్' అయ్యింది

విశ్వక్ సేన్



'లైలా' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమకథ గురించి వెల్లడించారు నటుడు విశ్వక్‌సేన్. తనకొక బ్రేకప్ స్టోరీ ఉందని తెలిపారు. ''టీనేజ్‌లో ఉన్నప్పుడు ఎవరైనా అమ్మాయిని చూడగానే ఇష్టం పుడుతుంది. ఆ సమయంలో దానిని మనం సీరియస్ రిలేషన్ అనుకుంటాం. దాని గురించి ఎప్పుడూ తలుచుకున్నా నవ్వొస్తుంది. అలాంటిదే నా జీవితంలోనూ ఒక కథ ఉంది. అది కాకుండా సీరియస్ లవ్‌స్టోరీ కూడా ఒకటి ఉంది. 24 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ప్రేమలో పడ్డాను. మూడున్నరేళ్లకు బ్రేకప్ అయింది. ఆ సమయంలో ఎంతో బాధపడ్డా. ఆ బాధ నుంచి బయటకు వచ్చి నా లైఫ్‌పై ఫోకస్ పెట్టా. ఆ తర్వాత నాకు ఎవరి మీద ఇష్టం కలగలేదు'' అని విశ్వక్ సేన్ తెలిపారు. సరైన సమయం వచ్చినప్పుడు పెళ్లి చేసుకుంటానన్నారు. జీవితంలో బాధపడిన సందర్భాలు చాలా ఉన్నాయని చెప్పారు. 27 ఏళ్ల వయసులో కూడా బాధతో తాను కన్నీళ్లు పెట్టుకున్న రోజులు ఉన్నాయని తెలిపారు. బాధగా కలిగినప్పుడు కన్నీళ్లు పెట్టుకుంటే.. దాని నుంచి వెంటనే బయటకు రాగలుగుతామని వెల్లడించారు.

## 'దిల్‌రూబా' రిలీజ్ వాయిదా!



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'దిల్‌రూబా' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు విశ్వ కరుణ్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రానుంది. ఈ సినిమాను తొలుత ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. కానీ, కొన్ని కారణాల వల్ల ఇప్పుడు ఈ సినిమా రిలీజ్‌ను వాయిదా వేశారు. దీంతో ఈ సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడా అని ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమాను ఇప్పుడు మార్చి 14న రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా ప్రకటించిన తేదీ కంటే ఒక నెల తర్వాత ఈ సినిమాను తీసుకొచ్చేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమాలో రుక్సర్ ఢిల్లోన్ హీరోయిన్‌గా నటిస్తుండగా సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నాడు.

## అస్సలు ఊహించలేదు

ఊర్వశీ రౌతేలా



'డాకు మహారాజ్'లో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో కలిసి నటించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా. ఇందులో బాలయ్యతో కలిసి ఆమె 'దబిడి దిబిడి' పాటకు డ్యాన్స్ చేశారు. ఈ పాట విడుదలైన సమయంలో కొరియోగ్రఫీపై వచ్చిన కాంట్రవర్సీ గురించి తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ప్రేక్షకుల నుంచి ఈవిధమైన స్పందన తాను అస్సలు ఊహించలేదని అన్నారు. ఆ పాట, అందులోని స్టెప్పులను ప్రేక్షకులు ఆదరిస్తారనుకున్నానని ఆమె చెప్పారు. కానీ, ఈవిధంగా మాట్లాడతారని తాను అస్సలు అనుకోలేదని తెలిపారు.''రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగింది. అన్ని పాటలకు ఏవిధంగా కొరియోగ్రఫీ ఉంటుందో అదేవిధంగా ఈ పాటకూ చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు ఆయనతో కలిసి వర్క్ చేశాను. ఆయన స్టెప్పులు చెప్పినప్పుడు నాకు ఏమాత్రం విభిన్నంగా లేదా అభ్యంతరకరంగా అనిపించలేదు. సాధారణమైన స్టెప్పుల మాదిరిగానే భావించా. కానీ, పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన విమర్శలు చూసి షాకయ్యా. కొరియోగ్రఫీని ప్రేక్షకులు తప్పుపట్టడానికి కారణం ఏమిటో అంచనా వేయడానికి కూడా సమయం లేకపోయింది. అంతా సడెన్‌గా జరిగిపోయింది. రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఇలాంటి విమర్శలు వస్తాయని మేము అస్సలు ఊహించలేదు. రిహార్సల్స్ క్లిప్స్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు'' అని ఊర్వశీ రౌతేలా తెలిపారు. ఏదేమైనా సోషల్‌మీడియా వేదికగా కొంతమంది కావాలని చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని అన్నారు. వివరణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని చెప్పారు.

## సమ్మె నోటీస్ ఎలక్షన్ కోడ్‌కు ముందే ఇచ్చాం

### ఆర్‌టిసి జెఎసి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఆర్‌టిసిలో ఇచ్చిన సమ్మె నోటీసులకు ఎలక్షన్ కోడ్ వర్తించదని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన స్పష్టం చేశారు. బుధవారం మిధాని డిపోలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు అవగాహనా రాహిత్యంతో జెఎసి ఇచ్చిన సమ్మె నోటీసుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందో, సమ్మె నోటీసు ఎప్పుడు ఇచ్చామో తెలియకుండా విమర్శ చేయడం సమంజసం కాదని అన్నారు. తాము ఆర్‌టిసి యాజమాన్యానికి గత నెల 27న జెఎసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు ఇస్తే ఈ నెల 3న ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ వచ్చిందని పేర్కొన్నారు. లేబర్ కమిషనర్‌కు ఈ నెల 7న సమ్మె నోటీసు ఇచ్చిన అన్ని కార్మిక సంఘాలను 10 వ తేదీన సమావేశానికి రమ్మని లెటర్ ఇచ్చారని, ఫిబ్రవరి 3వ తేదీనుండి ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు 10 వ తేదీన చర్చలకు రమ్మని లేఖలు ఎందుకు రాశారని ప్రశ్నించారు. ప్రభుత్వం, యాజమాన్యాలు సమస్యల పరిష్కారానికి సుముఖంగా లేనట్లుగా తెలుస్తోందని, ఇంకా ఈ యాజమాన్యం కార్మికులను మరింత ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉండటం కోసమే చర్చలకు మొహం చాటేస్తున్నారని అన్నారు. జెఎసి ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించేందుకు అతిత్వరలో మరో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు.ఈ సమావేశంలో జెఎసి నాయకులు ఎన్. కమలాకర్ గౌడ్, బి.డి.రావు, బి.జ్యోతి, జి.రాములు, సుద్దాల సురేష్, బి.శ్రీనివాస్, వి.బాబు, రాంచందర్, ఎం.ఎ. మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే



ప్రజాపక్షం/హైదరాబాద్: గతంలో పాల్గొనని వారికోసం మసారి ఈ నెల 16 నుంచి 28 వరకు కుల సర్వే నిర్వహించనున్నందున స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం కానున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో షెడ్యూల్ విడుదలవుతుందని భావిస్తున్న తరుణంలో మరోసారి 'కులగణన' చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని లక్ష్యంతో ఉన్నదని సాక్షాత్తూ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడించడంతో ఇప్పట్లో స్థానిక ఎన్నికలు లేనట్టుగానే కనిపిస్తోంది. ఈ నెల 16 నుంచి 28 వరకు కులగణన సర్వేను మరోసారి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి మొదటి వారంలో 42 శాతం బిసిల రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి, ఆ తర్వాత శాసనసభలో బడ్జెట్ సమావేశాల్లో ఆ బిల్లును ఆమోదించ నున్నారు. మార్చి నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగే అవకాశాలు ఉంటాయి. ఆ తర్వాత 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రులు, ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లనుంది. దీనిపైన కేంద్రం ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది..?, ఇందుకు ఎంత సమయం పడుతుంది..? అనేది రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. ఈ ప్రక్రియ మొత్తం ముగిసే వరకు ఎంత సమయం పడుతుంది..?, అప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారా?, లేదా..? అనేది స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహుల్లో ఉత్కంఠత నెలకొన్నది. 42 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత లభించిన తర్వాతనే ఎన్నికలకు పోవాల్సివస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉంటాయని పలువురు అంచనా వేస్తున్నారు.
అప్పటి వరకు స్థానిక సంస్థలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే కొనసాగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు స్థానిక సంస్థలకు పాలక మండలి లేకపోతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులకు కూడా బ్రేక్‌పడే అవకాశాలు ఉంటాయి. ఇదే జరిగితే ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పెరిగే అవకాశాలు లేకపోలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## 14న పవర్‌పాయింట్ ప్రజంటేషన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజంటేషన్‌ను నిర్వహించాలని టిపిసిసి నిర్ణయించింది. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ పాల్గొంటారు. ప్రభుత్వం నిర్వహించిన కుల గణన, ఎస్‌సి ఉప కులాల వర్గీకరణపై కాంగ్రెస్ శ్రేణులకు సమగ్ర సమాచారం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోచైర్మన్, మంత్రి సి.దామోదర రాజనర్సింహ, సభ్యులైన మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ధనసరి అనుసూయ సీతక్క, ఎంపి మల్లు రవి, ఎఐసిసిసి కార్యదర్శి ఎస్.ఎ.సంపత్‌కుమార్ ప్రజెంటేషన్ ఇస్తారని టిపిసిసి తెలియజేసింది. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, నియోజకవర్గ బాధ్యులు, ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, టిపిసిసి కార్యవర్గ సభ్యులు, డిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్‌సిలు, మాజీ ఎంఎల్‌ఎలు, కార్యవర్గ ప్రతినిధులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని టిపిసిసి విజ్ఞప్తి చేసింది.

## రేషన్‌కార్డులపై భారీ ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇది కూడా లాంఛనమే అయింది. దీంతో అసలు ఎవరికి రేషన్‌కార్డులు మంజూరు అయ్యాయి? వాటిని ఎప్పటిలోపు అందజేస్తారనేది దరఖాస్తుదారులకు ఎలాంటి సమాచారం లేకపోవడం, ప్రభుత్వం మాత్రం ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డును పరిగణలోకి తీసుకుంటున్న నేపథ్యంలో రేషన్ కార్డు లేని నిరుపేదలు ఆవేదన చెందుతున్నారు. గత పదేళ్లుగా మీ సేవలో రేషన్ కార్డుల దరఖాస్తులను స్వీకరించడం నిలిపివేయగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 7వ తేదీన రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అప్పటికే తీవ్ర ఆవేదనతో ఉన్న దరఖాస్తుదారులు గత శనివారం మీసేవ కేంద్రాలకు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. అయితే మీసేవ కేంద్ర నిర్వాహకులు దరఖాస్తులు తీసుకోవడంలేదని అసలు సంగతి చల్లగా చెప్పడంతో ప్రజలు మరోసారి తీవ్ర గందరగోళానికి గురయ్యారు. దీంతో వెల్లుబికిన ప్రజాఆగ్రహంతో దిద్దుబాటు చర్యలు చేట్టిన అధికారులు మీ సేవలో దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించినట్లు ప్రకటించారు. అయితే మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటి రశీదులను పౌరసరఫరాల శాఖ కార్యాలయం కాని, తహశీల్దార్ కార్యాలయంలోగాని సమర్పించాలని మీ సేవ నిర్వాహకులు సూచిస్తుండడంతో తిరిగి గందరగోళం నెలకొంది. ఇదేక్రమంలో మీసేవలో దరఖాస్తు చేసిన రసీదును భద్రపరుచుకోవాలని, ఎవరికీ అందజేయాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు.

### దరఖాస్తులకే పరిమితం కాకుండా రేషన్ కార్డులు కూడా ఇవ్వండి: విజయలక్ష్మి

''ఆధార్ కార్డు సాంకేతిక సమస్యల కారణంగా 2013 వరకు ఉన్న రేషన్ కార్డు కాస్తా రద్దు అయింది. ఆధార్ కార్డులో సరిచేసుకున్న తర్వాత తిరిగి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో నిలిచిపోయింది. ఆ తర్వాత స్వరాష్ట్రంలో అధికారం చేపట్టిన బిఆర్‌ఎస్ హయాంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డులు మాత్రం జారీకాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అభయ హస్తం కింద రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇటీవల రేషన్ కార్డుల కోసం నిర్వహించిన తనిఖీలో అధికారులను అడిగితే నా దరఖాస్తే లేదంటున్నారు. ఇప్పుడు తిరిగి మీసేవలో దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. రేషన్ కార్డుల జారీ ప్రభుత్వ నిర్ణయం సరైందే అయినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా మాలాంటి దరఖాస్తుదారులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇప్పటికైనా రేషన్ కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం'' రేషన్‌కార్డు బాధితురాలు విజయలక్ష్మి 'ప్రజాపక్షం'కు తెలిపారు.

## మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

విక్రమ్ మిశ్రీ చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలతోపాటు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలను విస్తారంగా చర్చించారు. ఇటీవల ప్రపంచంలో ఏర్పడిన భౌగోళిక, ప్రాదేశిక సమస్యలను వారు చర్చించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో తక్షణ సంస్కరణ ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. భద్రతామండలిలో అంశాలతోపాటు వివిధ ప్రపంచ సమస్యలపై సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ద్వైపాక్షిక సంబంధాలపై పూర్తిస్థాయిలో వారు చర్చించారు. భద్రతామండలిలో భారతదేశానికి శాశ్వత సభ్యత్వం లభించేందుకు మేక్రాన్ తన పూర్తి మద్దతును పునరుద్ఘాటించారు. గడచిన పాతిక సంవత్సరాలుగా రెండు దేశాలమధ్యా దశలవారీగా క్రమంగా బంధం బలోపేతమవుతూ వచ్చిందని పేర్కొంటూ రెండు దేశాలమధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి చాలా బలంగా మేక్రాన్ తన చిత్తశుద్ధిని ప్రకటించారు. మేక్రాన్–మోదీ ఇద్దరూ ఒకే విమానంలో ప్రయాణం చేశారు. వీరిద్దరి సమావేశం తర్వాత ప్రతినిధులస్థాయిలో రెండు దేశాలమధ్య చర్చలు ముందుకు కొనసాగుతాయి. వాణిజ్యం, పెట్టుబడుల సంబంధాలను రెండు దేశాలూ ఉద్ధృతం చేయాలని, సాంకేతికరంగం, నవీన ఆవిష్కరణలు చేయడంలో కూడా ఉమ్మడి సహకారం తీసుకోవాలని నాయకులు నిర్ణయించారు. రక్షణ,పౌర అణు ఇంధనం, అంతరిక్షం వంటి కీలక వ్యూహాత్మక రంగాలలో సహకారాన్ని నాయకులిద్దరూ పునఃసమీక్షించారు. భారత్‌లో పర్యటించాలని మేక్రాన్‌కు మోదీ ఆహ్వానం పలికారు. అంతకుముందు మార్సియల్లీ సమపంలోని కోస్తాపట్టణం కాస్సిస్‌లో మోదీ గౌరవార్థం మేక్రాన్ రాత్రి విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. రెండు దేశాలమధ్య ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సహకారిన్ని మరింత లోతుగా పటిష్టవంతం చేసుకోవాలని, ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. వివిధ ప్రపంచ వేదికలపైన, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి కార్యకలాపాలు నిర్వహించాలనీ, పలు విషయాల్లో చొరవలు తీసుకోవాలని వారు నిర్ణయించారు. పలు అంశాలపై వారిద్దరిమధ్య విస్తారంగా చర్చలు జరిగాయి. ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సామాజిక, ఆర్థిక, పర్యావరణసంబంధిత విషయాలలో కృత్రిమ మేధ ద్వారా ప్రజాప్రయోజనాలరీత్యా మంచి ఫలితాలను అందించాలని కూడా నాయకులిద్దరూ గట్టిగా నిర్ణయించుకున్నారు. రెండు రోజులపాటు జరిగిన కృత్రిమ మేధ ప్రపంచ శిఖరాగ్ర సదస్సుకు ఫ్రాన్స్–భారత్‌లు రెండూ సహభాగస్వామ్యంతో ఆతిథ్యం ఇచ్చిన నేపథ్యంలో నాయకులు ఇద్దరూ ఈ సదస్సు డిక్లరేషన్ అంశాలను ఆచరణలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. సమావేశం అనంతరం వారిద్దరూ ఒక ఉమ్మడి ప్రకటన చేస్తూ, రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తారంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. దీంతో ఇప్పటివరకూ మోదీ ఆరుసార్లు ఫ్రాన్స్‌లో పర్యటించినట్లయింది. గత ఏడాది జనవరిలో మేక్రాన్ 75వ గణతంత్ర దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

### ఉమ్మడిగా కొత్తతరం.. అణు రియాక్టర్ల అభివృద్ధి

భారత్–ఫ్రాన్స్ రెండు దేశాలూ ఉమ్మడిగా కొత్తతరం అడ్వాన్స్‌డ్ అణు రియాక్టర్లను అభివృద్ధి చేయాలని అభిలషించాయి. అణుఇంధన ఆవశ్యకతతను పునరుద్ఘాటించాయి. అత్యాధునిక అణు రియాక్టర్ల తయారీపై మోదీ–మేక్రాన్ ఇద్దరూ గట్టి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇంధన భద్రతకు అణుశక్తి ఎంతో కీలకమైనదని వారు అభిప్రాయపడ్డారు. వాతావరణంలోకి కర్బన ఉద్గారాలను తక్కువస్థాయిలో ప్రసారం చేసేందుకు ఇదే సరైన మార్గమని వారు అభిప్రాయపడ్డారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లను, అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ రియాక్టర్లను తయారు చేసేందుకు ఒక పత్రంపై ఇరువురూ సంతకాలు చేశారు. ఇరుదేశాలకు చెందిన అణుశక్తిశాఖలమధ్య గతంలో ఉన్న అవగాహనా ఒప్పంద పత్రాలను పునరుద్ధరించుకున్నారు. ప్రపంచ అణు ఇంధన భాగస్వామ్య కేంద్రం (జిసిఎన్‌ఇపి)తో సహకారానికి అనుబంధంగా ఈ ఒప్పంద పత్రాలను పునరుద్ధరించారు.

### పారిస్‌లో భారత సైనికవీరులకు నివాళులు అర్పించిన మోదీ

ఫ్రెంచ్ సేనలతో భుజం–భుజం కలిపి మొదటి ప్రపంచయుద్ధంలో ప్రాణత్యాగాలు చేసిన భారత సైనిక వీరులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పారిస్‌లో బుధవారంనాడు నివాళులు అర్పించారు. పారిస్‌లోని చరిత్రాత్మకమైన మజర్గ్యూ శ్మశానసవాటికను మోదీ సందర్శించి భారత సైనిక వీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మేక్రాన్ కూడా పాల్గొన్నారు. పారిస్‌లో రెండోరోజు పర్యటనలో ఉన్న మోదీ భారత సైనిక వీరుల సమాధులవద్ద భారత జాతీయ పతాకాన్ని ఉంచి పుష్పగుచ్ఛాలతో వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ శ్మశానవాటికలో 205 మంది భారత సైనికులు అమరులై శాశ్వతనిద్రలో ఉన్నారు. 1925 జులైలో ఆనాటి ఫీల్డ్ మార్షల్ సర్ విలియం బర్డ్‌వుడ్ ఈ స్మారక శ్మశానవవాటికను ప్రారంభించారు. బ్రిటీష్ వలసపాలకుల హయాంలో భారత్ నుండి సైనికులు మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొన్నారు. యూరప్‌లో శాంతిసాధనకోసం జరిగిన పోరాటంలో భారత సైనికులు ప్రాణాలు త్యాగం చేశారు.
ఈ సమాధి, శ్మశానవాటికలు భారత్–ఫ్రాన్స్ దేశాల ప్రజలమధ్య ఒక గొప్ప స్మృతిచిహ్నంగా నిలిచింది. ఈ సందర్భంగా శ్మశానవాటికలో వాద్యాలు మోగించారు. తర్వాత మేక్రాన్, మోదీ ఇద్దరు ఈ స్మారక శ్మశానవాటిక ప్రాంగణాన్ని చుట్టూ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భారత సైనికులు అక్కడ హాజరయ్యారు. ఎర్రగులాబీలను అమరవీరుల సమాధులవద్ద ఉంచారు. ఈ స్మారక శ్మశానవాటికను కామన్‌వెల్త్ వార్‌గ్రేవ్స్ కమిషన్ (సిడబ్ల్యుజిసి) ఆధ్వర్యంలో కొనసాగుతున్నది. మొదటి ప్రపంచ యుద్ధాన్ని''గ్రేట్‌వార్'' అని కూడా పిలుస్తారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com